thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 113 కరీంనగర్ బుధవారం, 2 జూలై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కొన్ని నెలల్లో ఇరాన్ అణు కార్యక్రమం మళ్లీ మొదలు

న్యూఢిల్లీ : అమెరికా దాడుల వల్ల ఇరాన్ అణు కార్యక్రమానికి వచ్చిన ముప్పు పెద్దగా ఏం లేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. అమెరికా దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని, ఆ తర్వాత ఇరాన్ మళ్లీ యురేనియాన్ని తనకు కావాల్సిన విధంగా శుద్ధి చేయగలదని వివరించారు. ఇరాన్ అణు స్థావరాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం, ఆ దేశ అణు కార్యక్రమాన్ని పూర్తిగా ధ్వంసం చేశామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనకు ఇది పూర్తిగా విరుద్ధంగా ఉండటం గమనార్హం.



# గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరాలి

## తెలంగాణ బిజెపి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన రామచందర్‌రావు

హైదరాబాద్: ఎంతోమంది కార్యకర్తలు, నేతల త్యాగాలతో భాజపా ఈ స్థాయిలో ఉందని ఆ పార్టీ తెలంగాణ నూతన అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలని.. గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరాలని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్ తదితరులు నాయకత్వంలో వారి సహకారంతో ముందుకెళ్తామన్నారు. "14 కోట్ల సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా ఉంది. అలాంటి రాజకీయ పార్టీ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడినయ్యా. తెలంగాణ అధ్యక్షుడిగా నన్ను ప్రకటించడం గర్వంగా భావిస్తున్నా. కార్యకర్తగానే పనిచేస్తా. పార్టీలో నాయకులంతా సమష్టిగా పనిచేస్తారు. కొత్తపాత తేడా లేదు.. ఎవరైనా భాజపాలో చేరినప్పటి నుంచే పార్టీ వ్యక్తులు. కొత్తనీరు రావాలి. యువత, మహిళలు భాజపాలో చేరాలి. పార్టీని బలపరచాలి.

**నేను సౌమ్యుడిని కాదు..** ప్రజాస్వామ్య, వికసిత్ తెలంగాణకు భాజపా అధికారంలోకి రావాలి. ప్రజలు పార్టీ వైపు చూస్తున్నారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి. కాంగ్రెస్ పార్టీ ఫేక్ న్యూస్ యూనివర్సిటీ నడుపుతోంది. భాజపా నేతలను ట్రోల్ చేస్తున్నారు. రామచందర్‌రావు సౌమ్యుడు కాదు. 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చా. విద్యార్థుల కోసం పోరాడి పోలీసుల దెబ్బలు తిన్నాను. ప్రజాస్వామిక పద్ధతిలో ప్రభుత్వంపై పోరాటం చేస్తాను. తెలంగాణ ప్రజల కోసం పోరాడతాను. ప్రజలు, కార్యకర్తలు, నేతలు కలిసి రావాలి" అని రామచందర్‌రావు అన్నారు.

**'నేను సాఫ్ట్ అనుకుంటున్నారేమో..' తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడు రామచందర్ రావు ఫస్ట్ స్పీచ్ లోనే..** "నేను పేరుకే అధ్యక్షుడిని నేనెప్పటికీ కార్యకర్తను... మీ సేవకుడినే.." అని బీజేపీ తెలంగాణ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రామచందర్ రావు అన్నారు. కార్యకర్తలే ఈ పార్టీకి నిజమైన సారథులని తెలిపారు. "ఉమ్మడి ఏపీలో జనసంఘ్ అభ్యర్థి పోటీచేస్తే వెయ్యి ఓట్లు మాత్రమే వచ్చాయని, కమ్యూనిస్టు పార్టీ గెలిచింది. ఆనాడు జనసంఘ్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు. ఇదేందని కమ్యూనిస్టులు అడిగితే గత ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయని సంబురాలు చేసుకుంటున్నామని చెప్పారు. ఇవాళ అదే ఉత్సాహంతో తెలంగాణలో 8 ఎమ్మెల్యే, 8 ఎంపీ, 3 ఎమ్మెల్సీ సీట్లను కైవసం చేసుకున్నాం. పార్టీ కోసం సైకిల్ పై రాష్ట్రమంతటా తిరుగుతూ ఎంతో కష్టపడ్డాం. బీజేపీ ఈ స్థాయికి వచ్చిందంటే... ఎంతో మంది కార్యకర్తల, నాయకుల త్యాగాలున్నాయి. మీ చెమట కష్టంతోనే బీజేపీ ఎదిగింది. అందరి ఆశీస్సులతో నేను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వంగా ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికవడం చాలా సంతోషంగా ఉంది. నక్సలైట్ల తూటాలకు బలైన బీజేపీ నాయకుల బలిదానాలవల్లే పార్టీ ఈ స్థాయికి ఎదిగింది. బీజేపీ మాస్ క్యాడర్ పార్టీ%ా% సిద్ధాంత బలమున్న పార్టీ. కలిసికట్టుగా పనిచేసి గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరేద్దాం. బీజేపీలో కొత్త, పాత అనే పంచాయితీ లేదు. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందే. తెలంగాణ యువత రాజకీయాల్లోకి రావాల్సిందే. యువకుల్లారా... మహిళలారా... బీజేపీలోకి రండి. 33 శాతం రిజర్వేషన్ల అమలుతో మహిళలకు ఎన్నో అవకాశాలు రాబోతున్నాయ్. తెలంగాణ ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు గెలుపే లక్ష్యంగా పనిచేస్తా. బీఆర్ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ వర్సిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారు. స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకుని పోరాడదాం. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులకు దమ్ముంటే.. నేరుగా ఎదురుగా పోరాడదాం రండి. మీరు దమ్ములేని పిరికిపందలు కాబట్టే వెనుకుండి ఫేక్ న్యూస్ ప్రచారం, ట్రోల్ వంటివి చేస్తున్నారు. నేను క్రిమినల్ లాయర్ ను.. ఫేక్ న్యూస్ సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడను. రామచందర్ రావు సౌమ్యుడు కాదు... ఏబీవీపీగా ఉన్నప్పుడే జైలుకు వెళ్లొచ్చినోడిని. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నోడిని. కాళ్లు, చేతులు విరగ్గొట్టుకున్నా సిద్ధాంతాన్ని వీడకుండా పనిచేసినోడిని. నేను సౌమ్యుడినే.. యుద్ధంలోకి దిగితే యోధుడినే.. కత్తి దూయడంలో ముందుంటా. విద్యార్థులు, న్యాయవాదులతో, పేదల పక్షాన న్యాయ పోరాటం చేసినోడిని. ఇకపై తెలంగాణ ప్రజల పక్షాన అలుపెరగని పోరాటాలకు సిద్ధం. కలిసికట్టుగా అందరితో కలిసి పనిచేస్తా.... బీజేపీని అధికారంలోకి తీసుకొస్తా" అని తెలిపారు.



## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

హైదరాబాద్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని ఇవాళ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో వచ్చే మొదటి మంగళవారం ఎల్లమ్మ తల్లి వార్షిక కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణం కోసం ఆలయాన్ని నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు. ఇవాళ ఉదయం 5 గంటల నుంచే భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు, వీఐపీ ఎంట్రీ కోసం క్యూ లైన్ ఏర్పాటు చేశారు. అమ్మవారి కల్యాణాన్ని చూడటానికి భక్తులు, శివసత్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి ఐదుగంటలకు పైగా సమయం పడుతోంది. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్డేట్.. పంపిణీకి ముహూర్తం ఫిక్స్..!




హైదరాబాద్ : తెలంగాణ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్డేట్ వచ్చింది. రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారికి రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. కొత్త కార్డుల పంపిణీకి ముహూర్తం ఫిక్స్ చేశారు. ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలి విడతలో మొత్తం 2 లక్షలకు పైగా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం అర్హత పొందిన దరఖాస్తుదారుల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. రాష్ట్రంలో చాలా ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల మంజూరు నిలిచిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీ కోసం ఒక కేబినెట్ సబ్-కమిటీని నియమించింది. కొత్త రేషన్ కార్డుల జారీలో అవలంబించాల్సిన విధానం, అర్హతల గురించి సబ్-కమిటీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు కొత్త కార్డుల కోసం, అలాగే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను జత చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వడపోత చేపట్టిన అనంతరం అర్హులైన వారి జాబితాను ఖరారు చేశారు. వారికి రేషన్ కార్డులు జారీ చేయనున్నారు.

రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరాయంగా కొసాగుతోందని.. అర్హులు ఎప్పుడైన అప్లయ్ చేసుకోవచ్చునని అధికారులు ఇది వరకే వెల్లడించారు. ఇక కొత్తగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. కొత్త రేషన్ కార్డులు సరికొత్తగా బార్ కోడ్‌తో, ఈజీ యాక్సెస్ చేసేలా రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికే కొత్త కార్డు స్వరూపంపై తుది నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే స్మార్ట్ కార్డు నమూనాను ప్రభుత్వం విడుదల చేయబోతున్నట్లు సమాచారం. ఈ స్మార్ట్ కార్డులు ఏటీఎం కార్డు సైజులో ఉండనున్నాయి. ఒక వైపు ముఖ్యమంత్రి ఫోటో, మరొక వైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటో, మధ్యలో తెలంగాణ ప్రభుత్వ లోగో ఉండేలా వీటిని డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# అధైర్య పడకండి...

# అన్ని విధాలా ఆదుకుంటాం...!




## పాశమైలారం ప్రమాద బాధితులకు భరోసా ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జులై 1: ఉమ్మడి రాష్ట్రంలో గానీ తెలంగాణ రాష్ట్రంలో గానీ ఇంత భారీ ప్రమాదం జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు (మంగళవారం) పాశమైలారం చేరుకున్న సీఎం.. ప్రమాదస్థలిని పరిశీలించి, ఈ ఘటనపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పాశమైలారం ఘటన అనంతరం మంత్రులు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మృతుల్ని తరలించడం, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడం వంటివి అధికారులు దగ్గరుండి మరీ చూసుకుంటున్నారన్నారు. ఈ ప్రమాదం చాలా మంది ప్రాణాలు బలిగొందని.. ప్రమాదం దురదృష్టకరమని ఆవేదన చెందారు. దుర్ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించామని.. ప్రభుత్వ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ప్రమాదంలో మృతులు.. క్షతగాత్రులు బీహార్, ఒడిశా, మధ్య ప్రదేశ్, ఆంధ్ర, తెలంగాణకు చెందిన వారు ఉన్నారన్నారు. ఈ ప్రమాదంలో 36 మంది ప్రాణాలు కోల్పోగా.. 17 మంది మిస్ అయ్యారని తెలిపారు. ఇంకా మరికొంతమంది ఆచూకీ లభించడం లేదన్నారు. ప్రమాద సమయంలో 143 మంది కార్మికులు ఉన్నారని.. ప్రమాదం అనంతరం 53 మంది ఆచూకీ తెలిసిందని సీఎం పేర్కొన్నారు. ఇంకా కొంతమంది శిథిలాల కింద ఉన్నారా.. లేక భయంతో ఎక్కడికైనా వెళ్ళిపోయారా అన్నది తెలియాల్సి ఉందని వెల్లడించారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన మృతులకు కోటి రూపాయల నష్టపరిహారం అందిస్తామని ప్రకటించారు. తీవ్ర గాయాలపాలైన వారికి, పని చేసుకోలేని స్థితిలో ఉన్న వారికి పది లక్షలు ఇస్తామన్నారు. స్వల్ప గాయాలు అయినవారికి ఐదు లక్షల రూపాయలు నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. క్షతగాత్రులకు వైద్య సహాయం ప్రభుత్వం, పరిశ్రమ వర్గాలు కలిసి అందిస్తామని చెప్పారు. ప్రమాదంపై ఒక కమిటీని వేసామని.. కమిటీ బాధ్యులను గుర్తించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని సీఎం అన్నారు. పరిశ్రమలకు సూచనలు ఇచ్చే విధంగా, ఆ సూచనలను పరిశ్రమలు అమలు చేసే విధంగాఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఫార్మా యజమానులు కార్మికుల భద్రతపై చర్యలు తీసుకోవాలని... అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితుల పిల్ల చదువుల బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుంటుందని.. మృతదేహాలను సొంత గ్రామాలు తరలించేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**ఊహాజనిత సమాధానాలు చెప్పొద్దు.. పాశమైలారం ఘటనపై సీఎం రేవంత్ సీరియస్....** పాశమైలారం ప్రమాద స్థలిని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో పరిశ్రమలశాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక కోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. సిగాచీ పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిశ్రమలో పనిచేసే వారి నైపుణ్యాల గురించి సీఎం ఆరా తీశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా యాజమాన్యం ఘటనా స్థలికి రాకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ప్రమాద ఘటనను కార్మిక, వైద్యశాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. నిన్న ఉదయం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించిన ఘటనలో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.




## సిగాచి ప్రమాదంలో ప్రేమికుల మృతి.. విషాదంలో ఎమ్మెల్యే..

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 361కి చేరింది. మరో 22 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న పరిస్థితి కనిపిస్తోంది. శిథిలాల కింద కొంతమంది చిక్కుకుని ఉంటారని అధికారులు భావిస్తున్నారు. అయితే, ఈ విషాదకరమైన ఘటనలో ఓ ప్రేమ జంట కలలు కలలుగానే మిగిలిపోయాయి. త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారు మృత్యువు ఒడికి చేరుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్ రెడ్డి %మీూజ% పూర్తి చేసి సిగాచి పరిశ్రమలో ఉద్యోగంలో చేరాడు. అయితే, అదే పరిశ్రమలో తిరువూరు నియోజకవర్గం పుట్రేల గ్రామానికి చెందిన శ్రీ రమ్య %మీూజ% పూర్తి చేసి ఉద్యోగంలో చేరింది. అక్కడ ఇద్దరి మధ్య స్నేహం ప్రేమకు దారితీసింది. అయితే, కులాలు వేరు కావడంతో కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించారు. ఇక ఆ ప్రేమ జంట తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆశ్రయించింది. ఇరు కుటుంబాలతో మాట్లాడిన ఎమ్మెల్యే కొలికపూడి మొత్తానికి పెళ్లికి ఒప్పించారు. ఇక అన్ని అడ్డంకులు తొలగిపోవడంతో ఆషాఢమాసం అయిపోయిన వెంటనే వివాహం చేసుకోవాలని ఆ ప్రేమ జంట నిర్ణయం తీసుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో ఆ ప్రేమ జంట.. ఎమ్మెల్యే కొలికపూడి ఇంటికి వెళ్లి.. తమ పెళ్ళికి రావాలని ఆహ్వానించడంతో వారిద్దరికీ బట్టలు పెట్టి పంపించారు. అయితే, నిన్నటి ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఎమ్మెల్యే.. నిఖిల్ రెడ్డికి ఫోన్ చేశారు.. నో రెస్పాన్స్ రావడంతో రమ్యకు ఫోన్ చేయగా తను కూడా స్పందించలేదు. దీంతో ఎమ్మెల్యే.. వెంటనే కెమికల్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్ళారు. మొదటి అంతస్తులో ఉన్న రమ్య.. భవనం కూలిపోవడంతో స్లాబ్ కింద పడి మరణించిందని, నిఖిల్ రెడ్డి పూర్తిగా కాలిపోయాడని అధికారులు తెలిపారు. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే..విషాదంలో ఉన్న బాధిత తల్లిదండ్రులను ఓదార్చారు. పెళ్లి బట్టల్లో వారిని చూడాలనుకున్న ఎమ్మెల్యే.. వారు విగతజీవులుగా కనిపించడంతో విషాదంతో వెనక్కు తిరిగివెళ్లిపోయారు.




## కచ్చితమైన కారణం తెలియాల్సిందే.. అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్, జులై 1: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా పాశమైలారం ఘటనాస్థలిని పరిశీలించారు. ఈరోజు (మంగళవారం) ఉదయం జూబ్లీహిల్స్ నివాసం నుంచి బయలుదేరి పాశమైలారం చేరుకున్నారు సీఎం. ప్రమాద స్థలిని పరిశీలించిన ముఖ్యమంత్రి.. ఈ ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఆపై ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. సిగాచి పరిశ్రమ నిబంధనలు పాటించిందా అని ప్రశ్నించారు. సిగాచి పరిశ్రమలో తనిఖీలు నిర్వహించారా అని అడిగారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాలు తనకు తెలియాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంపై నిపుణులతో అధ్యయనం చేయించాలన్నారు. ప్రమాదానికి బాధ్యులైన పరిశ్రమ యాజమాన్యం స్పందించిందా అని మరో ప్రశ్న వేశారు. ప్రమాదంపై సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని.. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఊహాజనిత జవాబులు కాకుండా వాస్తవాలను తెలపాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**యాజమాన్యంపై సీఎం ఫైర్...** సిగాచి యాజమాన్యంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి 24 గంటలు అవుతోందని.. ఘటనా స్థలికి యాజమాన్యం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు బాధితులకు ఏం భరోసా ఇచ్చారని నిలదీశారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాన్ని మానవతా దృక్పథంతో చూడాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొంగులేటి శ్రీనివాస్ ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సీఎం రేవంత్ పరామర్శించనున్నారు. కాగా.. పాశమైలారం పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 45కు చేరింది. ఘటనాస్థలిలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెస్క్యూ ఆపరేషన్‌లో సింగరేణి టీమ్ పాల్గొంది. ప్రమాద సమయంలో 143 మంది పనిచేస్తున్నట్లు గుర్తించారు. 34 మందికి తీవ్రగాయాలు అవగా.. వారిని వెంటనే స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందజేస్తున్నారు. శిథిలాల కింద గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దాదాపు 29 మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. ఇప్పటి వరకు ఆరు మృతదేహాల గుర్తించారు. ఇంకా 17 మంది ఆచూకీ గల్లంతు అయ్యినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం నుంచి 57 మంది సురక్షితంగా బయటపడ్డారు.

## ఆలయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం




ములుగు: ములుగు నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దేవాలయాల అభివృద్ధి కోసం రూ.1.42 కోట్లు మంజూరు చేసింది. మంత్రి సీతక్క విజ్ఞప్తితో నిధులు మంజూరయ్యాయి. సీజీఎఫ్ నిధుల నుంచి రూ.1.42 కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గోవిందరావు పేట మండలం బుస్సాపూర్ జానకి రామాలయానికి రూ.12 లక్షలు, కొత్తగూడ మండలం గుంజేడులోని ముసలమ్మ ఆలయానికి రూ. 50 లక్షలు మంజూరు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ములుగు మండలం జగ్గన్నపేట పుట్టా మల్లిఖార్జున స్వామి దేవాలయానికి రూ.30 లక్షలు, మల్లంపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, ములుగు పట్టణంలోని నాగేశ్వరస్వామి దేవాలయానికి రూ.20 లక్షలు, రామాలయానికి రూ.10 లక్షలు మంజూరు చేసింది. త్వరలో టెండర్లు పిలిచి ఆలయ అభివృద్ధి పనులను నిర్వాహకులకు దేవదాయ శాఖ అధికారులు అప్పగించనున్నారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.



## రెండు నెలల క్రితం ప్రేమ పెళ్లి..

### పాశమైలారం ఘటనలో దంపతుల దుర్మరణం

కడప: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదం నింపింది. ప్రమాద సమయంలో కంపెనీలో పనిచేస్తోన్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆచూకీ గల్లంతైంది. నిఖిల్‌రెడ్డి ఇటీవలే ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామానికి చెందిన నామాల శ్రీరమ్యను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ ఆషాఢ మాసం తర్వాత పెద్దల సమక్షంలో ఘనంగా వేడుక చేద్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం సిగాచీ ఔషధ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో దంపతులిద్దరూ దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరు కుటుంబాలకు చెందిన వారు శోకసంద్రంలో మునిగిపోయారు.




హైదరాబాద్: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరు పొందారు. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

బీవీ పట్టాభిరామ్.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 'రావ్ సాహెబ్' భావరాజు సత్యనారాయణ సంతానంలోని పదిహేను మందిలో ఒకరు. కౌమారదశలో కాలి వైకల్యంతో కలిగిన ఆత్మన్యూనతా భావాన్ని జయించి తనని తాను ఇంద్రజాలికుడిగా, రచయితగా తీర్చిద్దుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతున్న రోజుల్లో ఎంబేర్ రావు అనే ఇంద్రజాలికుడి నుంచి ఆ విద్యను నేర్చుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఆహార సంస్థలో ఉద్యోగం చేసే రోజుల్లోనూ సాధన చేసేవారు. 1970 దశకం నాటికి స్వతంత్రంగా రెండుమూడు గంటలపాటు ప్రేక్షకులను కదలనీయకుండా ఇంద్రజాలం ప్రదర్శించే స్థాయికి పట్టాభిరామ్ ఎదిగారు.

**ప్రజలను జాగృతం చేస్తూ..** 1984లో హైదరాబాద్‌లో కళ్లకు గంతలు కట్టుకుని రవీంద్రభారతి నుంచి చార్మినార్ వరకు స్కూటర్ నడిపి ఇంద్రజాల విద్యలో తెలుగునేలపై కొత్త అధ్యాయాన్ని సృష్టించారు. చేతబడి వంటి మూఢనమ్మకాలపై ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. హిప్నాటిజాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చి పలు రుగ్మతలను పోగొట్టవచ్చని నిరూపించారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ఇంద్రజాలాన్ని జోడించి ప్రభుత్వ పథకాలకు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించారు. గోదావరి వరద బాధితుల కోసం ప్రదర్శనలు ఇచ్చి తన మానవత్వాన్ని చాటుకున్నారు. దూరదర్శన్‌లో కొన్ని సీరియళ్లతో పాటు పలు సినిమాల్లో నటించారు. జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'రెండురెళ్లు ఆరు'లోనూ డాక్టర్ పట్టాభిరామ్‌గానే కనిపించారు. ఈ క్రమంలో సినీ ప్రముఖులు శోభన్ బాబు, అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, జయప్రద, రాజేంద్రప్రసాద్ తదితరులు ఆయనకు అభిమానులుగా మారిపోయారు. పలు పత్రికల్లో బీవీ పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస వ్యాసాలు రాశారు.




హైదరాబాద్: తెలంగాణలో మంగళవారం, బుధవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమైంది ఉంది. 3, 4 తేదీల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ వెల్లడించింది. హైదరాబాద్ రాత్రి వర్షం దంచికొట్టింది. వరదనీటితో పంజాగుట్ట, లక్డీకపూల్, మలక్‌పేట, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, షేక్‌పేట, ఖాజాగూడ, మణికొండ, మేడ్చల్, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయం అయ్యాయి. లక్డీకాపూల్ ద్వారకా హోటల్ కూడలిలో నిలిచిన నీటిని హైడ్రా సిబ్బంది మ్యాన్‌హోళ్లలోకి దారి మళ్లించారు. ఈదురుగాలులతో మణికొండ, అత్తాపూర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

## కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్లకు అంకురార్పణ: మంత్రి ఉత్తమ్




హైదరాబాద్: పోలవరం-బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. "పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదు"అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## పాశమైలారం ఘటన.. సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవహక్కుల కమిషన్

సంగారెడ్డి: పాశమైలారం అగ్నిప్రమాద ఘటనను రాష్ట్ర మానవహక్కుల కమిషన్(హెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. జులై 30లోగా ప్రమాద ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్, ఫైర్ డీజీ, సంగారెడ్డి ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుండ్ర కుమారస్వామి హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. పాతబడిన మిషనరీ వాడటం, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా ఇండిపెండెంట్ కమిటీ




వేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలలో నాణ్యతా ప్రమాణాలపై నివేదిక ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని హెచ్ఆర్సీని కోరారు.




మేడ్చల్ పట్టణం: మేడ్చల్ పట్టణ పరిధిలోని పారిశ్రామికవాడలోని ఆల్కలాయిడ్ బయో యాక్టివ్ ఫార్మా పరిశ్రమలో మంగళవారం బాయిలర్ పేలింది.

ఈ ప్రమాదంలో విధుల్లో ఉన్న కార్మికుడు శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. స్పందించిన యాజమాన్యం, తోటి సిబ్బంది బాధితుడిని వెంటనే పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమయంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు.

చురకలు





# పేటెంట్ నుండి ప్రపంచ ప్రసారం వరకూ: మార్కోని వైజ్ఞానిక యాత్ర

## రేడియో ఆవిష్కరణ: ప్రపంచ సమాచార విప్లవానికి పునాది - 1897 జూలై 2...రేడియో కోసం పేటెంట్ పొందిన దినం

1897లో ఇటలీకి చెందిన యువ శాస్త్రవేత్త గూగ్లీమొ మార్కొని లండన్‌లో రేడియో కోసం పేటెంట్ పొందిన ఘట్టం ప్రపంచ సమాచార చరిత్రలో విప్లవాత్మక మలుపు తీసుకు వచ్చింది. వైర్లు లేకుండా దూర ప్రాంతాలకు సంకేతాలను పంప గల సాంకేతికతను విజయ వంతంగా అభివృద్ధి చేయడంలో మార్కొని సుస్పష్టమైన ముందడుగు వేసాడు. అతని ఆవిష్కరణ ఆధునిక టెలికమ్యూనికేషన్‌కు పునాది వేసింది. మార్కొని 1874లో ఇటలీలో జన్మించి, బాల్యం నుంచే విద్యుత్, మాగ్నెటిజం, తరంగాలపై ఆసక్తి పెంచుకున్నాడు. జర్మన్ శాస్త్రవేత్త హెయిన్‌రిచ్ హెర్ట్జ్ నిర్వహించిన ఎలక్ట్రో మాగ్నెటిక్ తరంగాల ప్రయోగాలపై లోతుగా అధ్యయనం చేసి, 1895లో తన స్వగృహంలో వైర్లను ఉపయోగించకుండా సంకేతాలను ప్రసారం చేసే ప్రయోగాలను ప్రారంభించాడు. ప్రారంభంగా కొన్ని మీటర్ల దూరానికే సంకేతాలను పంపగలిగిన ఈ పరికరాలను మరింత మెరుగుపరిచి, కిలోమీటర్ల దూరాన్ని అధిగమించే స్థాయికి చేర్చాడు. 1897 జూలై 2న బ్రిటిష్ పేటెంట్ కార్యాలయం నుండి అతనికి "వైరులేని టెలిగ్రఫీ వ్యవస్థ"కు పేటెంట్ నంబర్ %+దీ18961203ూ%, మంజూరు చేసింది. అదే ఏడాది బ్రిటన్‌లో 'ది వైర్‌లెస్ టెలిగ్రాఫ్ అండ్ సిగ్నల్ కంపెనీ'ను స్థాపించాడు. ఇది తరువాత "మార్కొనీస్ వైర్‌లెస్ టెలిగ్రాఫ్ కంపెనీ"గా మారింది. ఇదే సంస్థ ద్వారా మార్కొని తన పరిశోధనలకు మరింత గతి కల్పించాడు. 1901లో మార్కొని అట్లాంటిక్ మహా సాగరాన్ని దాటి తొలిసారిగా ఇంగ్లండ్ నుంచి కెనడా న్యూఫౌండ్లాండ్ వరకు తారంగిక సంకేతాన్ని విజయవంతంగా పంప గలిగాడు.

ఈ ఘనత ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 1909లో రేడియో కమ్యూనికేషన్ రంగంలో చేసిన విశేష కృషికి గాను ఆయనకు నోబెల్ ఫిజిక్స్ బహుమతి లభించింది. ఈ పురస్కారాన్ని కార్ల్ ఫెర్డినాండ్ బ్రాన్‌తో కలసి పంచుకున్నాడు. 1912లో టైటానిక్ నౌకా ప్రమాద సమయంలో మార్కొని అభివృద్ధి చేసిన తారంగిక పరికరాల ద్వారానే అత్యవసర సమాచారాన్ని ఇతర నౌకలకు, తీర ప్రాంతాలకు పంప గలిగారు. వందలాది ప్రాణాలను రక్షించడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. ఈ సంఘటన రేడియో ప్రయోజనాలను ప్రపంచానికి పరిచయం చేసింది. రేడియో అభివృద్ధి తరువాతి దశల్లో మరింత వేగంగా జరిగింది. 1920లో అమెరికాలో మొట్టమొదటి వాణిజ్య రేడియో ప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1923లో బ్రిటన్‌లో బీబీసీ (%దీదీజ%) ఏర్పాటు అయ్యింది. 1936 నాటికి నాటకాలు, సంగీత ప్రదర్శనలతో రేడియో వినోద వేదికగా మారింది. ప్రపంచ యుద్ధాల సమయంలో రేడియోను రాజకీయ ప్రచారాలకు, మానవ హక్కుల ప్రచారానికి వేదికగా వినియోగించారు. భారతదేశంలో 1927లో మొదటి రేడియో ప్రసార కేంద్రం ముంబయిలో స్థాపించ బడింది. 1936లో ఆకాశవాణి ఏర్పడి, దేశవ్యాప్తంగా సమాచారాన్ని విస్తరించేందుకు పాలు పంచుకుంది. 1957లో ప్రారంభమైన 'వివిధ భారతి'తో పాటలు, వినోద కార్యక్రమాలు ప్రజల మనసులు గెలుచుకున్నాయి. 2001 తర్వాత ప్రైవేట్ ఎఫ్.ఎం. స్టేషన్లు రంగంలోకి ప్రవేశించి, రేడియో వినికిడి అనుభవాన్ని ఆధునీకీకరించాయి. నేటి డిజిటల్ యుగంలోనూ రేడియో తన ప్రాధాన్యతను కోల్పోలేదు. మొబైల్ ఫోన్లు, కారు స్టీరియోలు, ఆన్‌లైన్ రేడియో యాప్‌లు రేడియో వినికిడికి సులభతరం చేశాయి. నగరాల నుంచే కాదు, గ్రామీణ ప్రాంతాల వరకు కూడా ఇది సముచిత సమాచారం, వినోదం, మరియు సామాజిక అవగాహన కార్యక్రమాల వేదికగా కొనసాగుతోంది. గూగ్లీమొ మార్కొని 1897లో సాధించిన విజయం కేవలం ఒక శాస్త్రీయ ఘట్టంగా కాక, మానవ సంబంధాల వికాసానికి, ప్రపంచీకరణకు, సమాచార విప్లవానికి పునాది వేసింది. రేడియో రూపంలో ప్రపంచానికి అందించిన సేవ ఆయనను శాశ్వతంగా శాస్త్ర చరిత్రలో నిలిపింది. అతని ఆవిష్కరణలతో ప్రారంభమైన ప్రయాణం ఈ రోజు డిజిటల్ కమ్యూనికేషన్ వరకూ విస్తరించి, సాంకేతిక విజ్ఞాన పరిణామంలో ఒక గాఢమైన అధ్యాయంగా నిలిచి పోయింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**





## రైల్వే సూపర్ యాప్ వచ్చేసింది.. ఇక అన్ని సేవలూ ఒకేచోట

రైల్వేకు సంబంధించిన అన్ని సేవలూ ఒకేచోట అందించే సూపర్ యాప్ అందుబాటులోకి వచ్చింది. తొలుత స్వరైల్ పేరిట ఈ సూపర్ యాప్‌ను పరీక్షించిన రైల్వే శాఖ.. తాజాగా రైల్‌వన్ పేరిట పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చింది.

దీని సాయంతో రిజర్వ్‌డ్/ అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్లు, రైళ్ల ఎంక్వైరీ, పీఎన్‌ఆర్, జర్నీ ప్లానింగ్, రైల్ మదద్, ఫుడ్ ఆన్ ట్రైన్ వంటి సేవలు పొందొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సూపర్ యాప్‌లో ప్రస్తుతానికి అందుబాటులోకి వచ్చిన సేవలన్నీ ఆన్‌లైన్‌లో, యాప్ రూపంలో వేర్వేరుగా అందుబాటులో ఉన్నాయి. ఒక్కో సేవకు ఒక్కో యాప్ ఉంది. వీటన్నింటినీ ఒకేచోట అందించడమే ఈ సూపర్ యాప్ లక్ష్యం. దీన్ని కొన్ని నెలలుగా పరీక్షించిన రైల్వేశాఖ.. ఎట్టకేలకు యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మున్ముందు మరిన్ని సేవలను ఇందులో జోడించే అవకాశం ఉంది. ఈ యాప్‌ను అభివృద్ధి చేసిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (%జ=×ూ%) వార్షికోత్సవం సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లాంచ్ చేశారు.

## సహజంగానే మనిషి ఆయుర్దాయం 150-200 ఏళ్లు: బాబా రాందేవ్

మనిషి ఆయుర్దాయం అందరూ అనుకుంటున్నట్లు వందేళు కాదని యోగా గురు బాబా రాందేవ్ పేర్కొన్నారు. నటి షఫాలీ జరివాలా ఆకస్మిక మరణం తర్వాత.. ఆమె వినియోగించిన యాంటి ఏజింగ్ ట్యాబ్లెట్లపై తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది. ఈ క్రమంలో రాందేవ్ ఓ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మానవుడి సహజ జీవితకాలం 100 ఏళ్లు కాదు. కనీసం 150-200 ఏళ్ల వరకు ఉంటుంది. ఇటీవల కాలంలో మనం మెదడు, గుండె, కళ్లు, కాలేయంపై ఎక్కువ ఒత్తిడి పెడుతున్నాం. ప్రజలు ఇప్పుడు 100 ఏళ్లు తినాల్సిన ఆహారాన్ని కేవలం 25 ఏళ్లలోనే తీసుకుంటున్నారు' అని రాందేవ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా అందరికీ ఆహార క్రమశిక్షణ, మంచి జీవనశైలి ముఖ్యమని నొక్కి చెప్పారు. తనకు ఇప్పుడు 60 ఏళ్లు దాటాయని, అయినా నిత్యం యోగా చేయడం, మంచి ఆహారం, జీవనశైలి కారణంగా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నానని తెలిపారు. 2021లో గుండెపోటుతో మృతిచెందిన నటుడు సిద్ధార్థ్ శుక్లా, ఇటీవల మరణించిన నటి షఫాలీ గురించి మాట్లాడుతూ.. మానవ శరీరం లోపలి నుంచి బలంగా ఉండాలన్నారు. మన శరీరంలో ప్రతీ కణానికి సహజమైన జీవితకాలం ఉంటుందని తెలిపారు. దానిపై ప్రభావం పడేలా ఏదైనా చేసినప్పుడు.. అది అంతర్గతంగా ఇబ్బందులు తలెత్తేలా చేస్తుందన్నారు. ఫలితంగా గుండెపోటు వంటి పరిస్థితులు వస్తాయన్నారు. 2002లో వచ్చిన 'కాంటా లగా' రీమిక్స్ సాంగ్‌తో



కుర్రకారు మదిని దోచిన షఫాలీ జరివాలా ఒక్కసారిగా ఫేమ్ అయ్యారు. షఫాలీ గత శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో ఆమె భర్త పరాగ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్డియాక్ అరెస్టుతో ఆమె మృతి చెందినట్లు తొలుత వార్తలు వచ్చినప్పటికీ.. కుటుంబసభ్యులు దాన్ని ధ్రువీకరించలేదు. ఈ క్రమంలో ఆమె యాంటీ ఏజింగ్ ట్యాబ్లెట్లు సహా పలు రకాల మందులను తీసుకున్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఆస్పత్రికి తరలించే ముందు ఖాళీ కడుపుతో ట్యాబ్లెట్లను తీసుకోవడం వల్లే షఫాలీకి రక్తపోటు తగ్గిపోయి ఉండొచ్చని వెల్లడించారు.


# రూ.100 కోట్లతో రోడ్డు నిర్మించారు.. మధ్యలో చెట్లను వదిలేశారు!



ప్రభుత్వం కొత్తగా రోడ్డు నిర్మించింది. ఇంకేముంది.. విశాలంగా, గుంతలు లేకుండా ఉన్న రోడ్డుపై.. ఇరువైపులా ఉన్న చెట్లు చల్ల నుంచి చల్లని గాలి వీస్తుండగా బైక్ పైనో, కారు పైనో వేగంగా వెళ్తుంటే.. ఆ ఆహ్లాదకరమైన డ్రైవింగ్‌ని అనుభవించాలని చాలా మందికే ఉంటుంది. అదే రోడ్డు మధ్యలో చెట్లు కనిపిస్తే!? తాజాగా బీహార్ లో అదే జరిగింది. అవును... చెట్ల మధ్య రోడ్డు వేశారో.. లేక, రోడ్డు పైనే చెట్లు నాటారో అన్నట్లుగా ఉన్న ఓ కొత్త రోడ్డు తాజాగా బీహార్ రాష్ట్రంలో దర్శనమిచ్చింది. దీంతో... రియల్ లైఫ్ లో బైకింగ్ గేమ్ గా పరిస్థితి ఉందనే కామెంట్లను సొంతం చేసుకుంది. బీహార్ రాజధాని పాట్నా నుంచి 50 కిలోమీటర్ల దూరంలో జెహానాబాద్ లో కొత్తగా వేసిన రోడ్డు కథ ఇది. ఇటీవల మధ్యప్రదేశ్ లో నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఆ వంతెనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో.. ఏడుగురు ఇంజినీర్లను సస్పెండ్ చేసింది ఆ రాష్ట్ర ప్రభుత్వం. ఈ సమయంలో తాజాగా మధ్యలో చెట్లను అలాగే ఉంచి రోడ్డు వేసిన ఘటన తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... బీహార్ లోని జెహానాబాద్ లో సుమారు రూ.100 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అయితే.. ఈ విస్తరణలో ఘోరమైన తప్పు జరిగింది. ఇందులో భాగంగా... జిల్లా యంత్రాంగం రోడ్డు విస్తరణ ప్రాజెక్టును చేపట్టినప్పుడు, అడ్డుగా ఉన్న చెట్లను తొలగించడానికి అనుమతి కోరుతూ అటవీ శాఖను సంప్రదించింది. అయితే... వీరి రిక్వస్ట్ ని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ తిరస్కరించింది. నిజంగా రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను నరకాల్సి వస్తే.. అందుకు ప్రతిగా 14 హెక్టార్ల అటవీ భూమికి పరిహారం డిమాండ్ చేసింది. అయితే, జిల్లా యంత్రాంగం ఈ డిమాండ్ ను నెరవేర్చలేకపోయింది. అనంతరం చెట్ల చుట్టూ రోడ్డు నిర్మాణం చేపట్టేసింది. దీంతో... జెహానాబాద్ లో పాట్నా - గయా ప్రధాన రహదారిపై సుమారు 7.48 కి.మీ. పొడవైన రహదారి మధ్యలో చెట్లు ఎత్తుగా నిలబడి ఉన్నాయి. ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా, చిన్న చిన్న చీలికలుగా మారిపోయింది. దీంతో... రూ.100 కోట్లతో ప్రమాదానికి ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఈ ప్రాజెక్ట్ ఉందనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

## 'ఉగ్రవాదులకు అండగా ఉంటాం'... బరితెగించిన పాక్ ఆర్మీ చీఫ్!

పహల్గాం ఉగ్రదాడికి కి ముందు, ఆ తర్వాత పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు, చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారుతున్న సంగతి తెలిసిందే. ఇందులో.. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో ఉంటే.. భారత్ మాత్రం ఉద్రిక్తతలు సృష్టిస్తోందనే నిస్సిగ్గు వ్యాఖ్యలూ చేశారు. తాజాగా ఉగ్రవాదులకు అండగా ఉంటామంటూ బరితెగింపు వ్యాఖ్యలు చేశారు. అవును... ఇటీవల కాలంలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమవుతున్నాయి. విజ్ఞత మరిచి భారత్ పై అతడు చేస్తున్న విమర్శలు, కక్కుతున్న విషయం తీవ్ర విమర్శల పాలవుతోంది. ఈ క్రమంలో మరోసారి భారత్ పై విషం కక్కారు మునీరి. ఇందులో భాగంగా... కశ్మీరీ ఉగ్రవాదులను స్వాతంత్ర్య యోధులుగా అభివర్ణించారు. వారిది చట్టబద్ధమైన పోరాటమని పేర్కొన్నారు. అంతటితో ఆగని మునీర్... కశ్మీర్ ఉగ్రవాదుల పోరాటాన్ని అంతర్జాతీయ చట్టాలూ గుర్తించాయని చెప్పడం గమనార్హం. ఇదే సమయంలో... భారత్ ఉగ్రవాదంగా ముద్ర వేస్తున్నది వాస్తవానికి అంతర్జాతీయ చట్టాలు గుర్తించిన చట్టబద్ధమైన, న్యాయసమ్మతమైన పోరాటం అని చెప్పుకొచ్చారు. తాజాగా పాకిస్థాన్ లోని నావల్



అకాడమీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా... కశ్మీర్ కు రాజకీయ, దౌత్యపరమైన మద్దతును తమ దేశం కొనసాగిస్తూనే ఉంటుందని స్పష్టం చేసిన మునీర్.. స్వయం నిర్ణయాధికారం కోసం అక్కడి ప్రజలు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని అన్నారు. ఇదే సమయంలో... ఐక్యరాజ్యసమితి తీర్మానాలు, కశ్మీరీ ప్రజల ఆకాంక్షల మేరకు న్యాయపరమైన పరిష్కారం కనుక్కోవాలని పాక్ బలంగా నమ్ముతోందని తెలిపారు. అక్కడితో ఆగని ఆయన... భారత్ ఎంతగా కవ్విస్తున్నా పాకిస్థాన్ మాత్రం సంయమనం పాటిస్తోందని.. కాశ్మీర్ ప్రాంతంలోని శాంతి, సుస్థిరతలను దృష్టిలో ఉంచుకొని చాలా వివేకంతో వ్యవహరిస్తోందని చెప్పుకొచ్చారు. పాక్ పై మరోసారి దాడి చేసే దుస్సాహసానికి భారత్ పాల్పడితే.. దీటైన సమాధానం ఇస్తామని మునీర్ హెచ్చరించారు. కాగా... పహల్గాం ఉగ్రదాడికి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఒక కారణమనే సంగతి తెలిసిందే. ఆ ఉగ్రదాడికి ముందు కశ్మీర్.. పాకిస్థాన్ కు జీవనాడి అంటూ మునీర్ వ్యాఖ్యానించారు. ఆ తర్వాతే పహల్గాంలోని బైసరన్ లోయలో ఉగ్రమూక అమాయకులైన పర్యాటకుల ప్రాణలను తీసింది. ఈ ఘటన ఇరు దేశాల మధ్య ఘర్షణకు దారి తీసింది.

## అమెరికాలో ఉద్యోగాల్లో వివక్షకు లోనవుతున్న ఎన్ఆర్ఐలు!

ఒకప్పుడు ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన భారతీయులు, ప్రస్తుతం అక్కడ వివిధ రకాల అనుభవాలను ఎదుర్కొంటున్నారు. బలవంతపు నిర్బంధాలు, అరెస్టులు మాత్రమే కాకుండా... ఇప్పుడు ఉద్యోగాల పరిధిలోనూ తాము అనుభవిస్తున్న వివక్షపై పలువురు ఎన్ఆర్ఐలు గొంతును వినిపిస్తున్నారు.

**- భాష యాసపై వివక్ష: సమావేశాల్లో మాట్లాడవద్దని సూచన!**... ఓ భారతీయ ఉద్యోగి రెడిట్‌లో తన బాధను వ్యక్తం చేస్తూ చేసిన పోస్ట్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది.

32 ఏళ్ల అతను గత సంవత్సరం నుంచి అమెరికాలోని ఒక కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని జట్టులో సభ్యులందరూ అమెరికన్లే. ఒకసారి ప్రాజెక్ట్ అప్‌డేట్ గురించి 55 ఏళ్ల సహచరుడిని



అడిగినప్పుడు అతను "మీరు మీ యాక్సెంట్ వల్ల ఏమీ అర్థం కావట్లేదు. మీరేం మాట్లాడకండి" అని అన్నాడట. ఇది తనను అవమానపరిచేలా ఉందని, ఇప్పటివరకు తనపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని ఆ ఉద్యోగి పేర్కొన్నాడు. ఈ ఘటన ఆన్‌లైన్‌లో విస్తృతంగా చర్చించబడింది. కార్యాలయాల్లో వివిధ భాషలు, ఉచ్చారణలు, సంస్కృతుల పట్ల ఉండాల్సిన గౌరవం గురించి తీవ్రమైన చర్చకు దారితీసింది.

**- వెజిటేరియన్ అంటే మనుషులే కాదట?.. ఆకలితో ఆవేదన...** ఇంకో ఘటనలో శాన్ ఫ్రాన్సిస్కోలో పనిచేస్తున్న భారతీయ మహిళ రుంఝున్ మిశ్రా కార్యాలయ భోజన వేడుకలో తన ఆహార అభిరుచులకు గౌరవం లేకుండా ప్రవర్తించారని వాపోయింది. "ది విక్డ్ వెజిటేరియన్" పేరుతో సోషల్ మీడియాలో పాపులర్ అయిన ఆమె ఆఫీసు నుంచి లంచ్ ఇచ్చే రోజు వెళితే 60 రకాల శాండ్‌విచ్‌లు ఉన్నా ఒక్క వెజిటేరియన్ ఐటమ్ కూడా లేకపోయిందని తెలిపింది. తాను అడిగినప్పుడు మాంసాన్ని తొలగించుకుని బ్రెడ్ మాత్రమే తినమని సూచించారట! ఇది తనను తీవ్రంగా బాధించిందని, అమెరికాలో వెజిటేరియన్లకు ఈ స్థాయిలో అన్యాయం జరుగుతోందని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వివరించింది. ఆమె భావోద్వేగాలకు అనేకమంది భారతీయ నెటిజన్లు మద్దతుగా నిలిచారు.

**- ఒకే భూమి, రెండు ప్రమాణాలా?...** ఈ రెండు ఘటనలు ఎన్ఆర్ఐలలో ఒకింత అవమానాన్ని, ఒకింత ఆవేదనను కలిగిస్తున్నాయి. ఉద్యోగంలో కష్టపడి పనిచేస్తూ, తమ విలువలను నిలబెట్టుకునే ఎన్ఆర్ఐలకు ఇంకా కూడా పూర్తి ఉద్యోగ స్వేచ్ఛ లేకపోవడం విచారకరం. తమ ఉచ్చారణ, ఆహార అలవాట్లు వంటి అంశాలపై విమర్శలు చేయడం వలస వెళ్ళిన భారతీయులకు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తోంది. ఇప్పటివరకు ఎన్నో అవకాశాల కోసం అమెరికా వెళ్ళిన ఎన్నారైలకీ, ప్రస్తుతం అవమానాలు ఎదురవుతున్న పరిస్థితుల్లో... అక్కడ జీవితం నిజంగా అంత సులభమో అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకప్పుడు స్వప్నాల దేశంగా కనిపించిన అమెరికా... ఇప్పుడు చాలామందికి కష్టాల గమ్యస్థానంగా మారిందా?

చురకలు

## సంపాదకీయం

# అధ్యక్షా...బీజేపీ తప్పు చేసిందా ?

రెండు తెలుగు రాష్ట్రాలలో ఇద్దరు బీజేపీ అధ్యక్షులను పార్టీ హైకమాండ్ ఎంపిక చేసింది. లాంచనానికి అయితే నామినేషన్ల స్వీకరణ ఘట్టం, ఎన్నికల ప్రక్రియ అని పెట్టారు. కానీ బీజేపీ పెద్దలు అనుకుని వారి చేతనే ఇలా నామినేషన్లు దాఖలు చేయించారు. అలా ఏపీకి పీవీఎన్ మాధవ్, తెలంగాణాకు రామచంద్రరావు నూతన సారధులు అయ్యారు. ఇద్దరిలో చాలా పోలికలు ఉన్నాయి. ఇద్దరూ ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నవారే. ఇద్దరూ పార్టీకి వీర విధేయులే. ఇద్దరూ పార్టీ హైకమాండ్ కి నచ్చినవారే. హైకమాండ్ మాటను జవ దాటరు. పైగా పార్టీకి అంకితం అయి పనిచేస్తారు. వివాదాలకు దూరంగా ఉండడం కూడా ఈ ఇద్దరికీ మరో పోలికగా ఉంది. అదే సమయంలో ఇద్దరికీ క్షేత్ర స్థాయిలో సొంతంగా బలం కానీ బలగం కానీ లేదు. అంతే కాదు దూకుడుగా రాజకీయాలు చేయలేరు అని అంటారు. ఇక బీసీ సామాజిక వర్గానికి చెందిన పీవీఎన్ మాధవ్ కి ఏపీ బీజేపీ పగ్గాలు ఇచ్చిన హైకమాండ్ బ్రాహ్మణ సామాజిక వర్గానికి తెలంగాణాలో పగ్గాలు ఇచ్చింది. అలా సామాజికపరంగా సమతూకం పాటించామని బీజేపీ భావిస్తోంది. కానీ ఈ ఎంపిక వల్ల తప్పులు జరిగాయా అన్న చర్చ కూడా ఉంది. తప్పు కాదు కానీ ఉత్సాహంగా ఉన్న తెలంగాణ కార్యకర్తలలో కొంత నిరాశను కలిగించేలా నియామకం జరిగిందా అన్నదే చర్చగా ఉందిట. బీజేపీ గ్రాఫ్ గత కొద్ది సంవత్సరాలుగా తెలంగాణాలో బలపడుతోంది. ముఖ్యంగా బీసీ నేత అయిన బండి సంజయ్ పార్టీకి ప్రాణం పోశారు. ఆయన దూకుడే పార్టీకి ఎంత మేలు చేసింది. అలాగే చూస్తే కనుక ఈటెల రాజెందర్ ఈ పదవికి ఆశించారు. ఆయన బీఆర్ఎస్ లో పునాది నుంచి ఉన్నారు. ఆయనకు సంస్థాగతంగా నిర్మాణం ఏమిటో తెలుసు అని అంటారు. ఆయనకు బీఆర్ఎస్ లో చాలా మంది పరిచయం ఉన్నారు. అలాగే రాజకీయంగా చూస్తే కనుక ఆయన వ్యూహ రచనలో దిట్ట అంటారు. బీజేపీ ఎదుగుదలకు అది ఎంతో ఉపయోగపడుతుంది అని చెబుతారు. అలాగే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విషయం తీసుకుంటే కూడా ఆయన కూడా బీసీ నేత. ఆయన సైతం జోరు చేస్తారు. పార్టీ కోసం ఎందాకైనా అనంట్లుగా ఉంటారు. మీడియా అటెంక్షన్ బాగా చేయగలరు. ఇలా పార్టీ బలమైన బీసీ నేతలను ఉంచుకుని బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రామచంద్రరావుకు అవకాశం ఇవ్వడం వెనక వ్యూహం ఏమిటో ఎవరికీ అర్ధం కావడం లేదు అని అంటున్నారు. ఇక రామచంద్రరావు ఏపీకి చెందిన సీఎం తెలుగు దేశం నేత చంద్రబాబుకు కొంత సాన్నిహిత్యం ఉన్న వారు అన్న ప్రచారం ఉంది. అయినా సరే తెలంగాణా రాజకీయాల్లో అది ఏ విధంగా ఉపయోగపడేది కాదనే అంటారు. తెలంగాణాలో బీజేపీ ఉంది. తెలుగుదేశం అయితే పెద్దగా లేదని చెబుతారు. మరి అలాంటపుడు ఎవరు ఉన్నా ఒక్కటే అన్నది ఉంది. ఏపీలో చూస్తే బీసీ నేత పీవీఎన్ మాధవ్ అయితే టీడీపీ విధానాల మీద గతంల పోరాటం చేసిన వారు. అయితే 2014 నుంచి 2019 దాకా ఉన్న రాజకీయం వేరు అని చెబుతారు. ఇపుడు అది కుదరదని అంటారు. ఇపుడు టీడీపీ బలం మీద కేంద్రంలోని ప్రభుత్వం ఆధారపడి ఉంది. దాంతో పరిమితంగానే బీజేపీ పాత్ర ఏపీలో ఉంటోనిద్. పైగా కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామి. మరి ఈ పరిధులు పరిమితులు తెలుసుకుని బీజేపీ కొత్త అధ్యక్షుడు పనిచేయాల్సి ఉంటుంది. ఏపీలో కూడా అంగబలం అర్ధబలం కలిగిన నేతలు ఎంతో మంది ఉన్నారు. కానీ మాధవ్ కి చాన్స్ ఇచ్చారు. ఆ విధంగా విధేయతకు పెద్ద పీట అని చెబుతున్నా మాధవ్ బీజేపీని ఉత్తరాంధ్రాలో అయినా బలోపేతం చేయాల్సి ఉంటుంది. మొత్తానికి ఏపీలో తెలంగాణాలో ఈ రెండు ఎంపికలూ పార్టీ క్యాడర్ ని అయితే కొంత ఆలోచనలో ఉంచాయని అంటున్నారు. చూడాలి మరి అటు రాముడు ఇటు మాధవుడు తమ పనితీరుతో ఏ విధంగా ఆకట్టుకుంటారో. ఏమేమి చేసి కమలాన్ని ముందుకు నడిపిస్తారో. బీజెపీకి రానున్న రోజులల్లో ఏ రకమైన శుభవార్తలు చెబుతారో.

# చరబండ రాజు: ప్రజల గళంగా వెలిసిన విప్లవ కవిత్వం - జూలై 2...చరబండ రాజు వర్ధంతి




చరబండ రాజు (అసలు పేరు బండి రాజేశ్వరరావుబీ జననం: 1944, మగ్దూంపూర్ గ్రామం, షాద్‌నగర్ సమీపం, మహబూబ్‌నగర్ జిల్లాబీ మరణం: జూలై 2, 1982) తెలుగు సాహిత్యంలో ఉద్యమ ప్రేరణగా నిలిచిన ఓ అరుదైన స్ఫూర్తి. సామాజిక అర్ధ రాత్రులలో వెలుగైనవాడు. ఆయన కవిత్వం అణచివేతకు వ్యతిరేకంగా ఒక తీవ్ర గళంగా మారింది. తాను చూసిన దురదృష్టాల్ని అక్షరాల్లోకి నింపి, ప్రజల జీవన యథార్థాన్ని పద్యంలోకి మలచిన మహోన్నత రచయిత. చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలను ఎదుర్కొన్న రాజు, జీవన పోరాటమే పాఠశాలగా స్వీకరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు ప్రతికూలమైనప్పటికీ, చదువు మీద ఆయన ఆసక్తి తగ్గలేదు. పైగా అది జీవితాన్ని అర్థం చేసుకునే సాధనగా మారింది. అణగారిన వర్గాల బాధ, శోషితుల ఆక్రోశం, పీడితుల పీడలను ఆయన స్వానుభూతిగా పొందినవాడు. ఈ వేదనలే ఆయనలో విప్లవ భావజాలానికి విత్తనాలు చల్లి, కలాన్ని కత్తిలా మారుస్తాయి. విద్యార్థి దశ నుంచే వామపక్ష సిద్ధాంతాలు, మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచనలు ఆయనను ఆకర్షించాయి. సమాజంలో ప్రతిష్టితమైన ధనవంతుల గొప్పదనాన్ని ప్రశ్నించే ధైర్యం ఆయనలో నాటివేసింది. ప్రజల జీవనసత్యాలను, వారి అభాగ్యాలను, ఆవేదనల్ని ఆయన పదాల్లో ప్రతిబింబించారు. రచనల ద్వారా కేవలం భావోద్వేగాన్ని కాక, ఉద్యమ శక్తిని, ప్రేరణను నూరిపోసినవాడు. రాజు రచనల్లో "సముద్రం", "గమ్యం", "పాటల పంట" వంటి కవితా సంపుటులు ప్రసిద్ధి పొందాయి. ఆయేవి కేవలం సాహిత్య పరమైన కృషి కాదు ం అవి విప్లవ గీతాలు. కార్మికుల శ్రమ, రైతుల వేదన, దళితుల నిరాశ, గిరిజనుల గొంతులన్నీ ఆ కవితల్లో ఒక్కటయ్యాయి. ఆయన భాష సూటి, సరళమైనది. ప్రజలకు దగ్గరగా ఉండేలా, వారి భాషను పూనుకునేలా రచన చేశారు. అందుకే ఆయన పదాలు పల్లె గడపల్లోనూ, ఉద్యమ వేదికల మీదనూ, జైలు గదుల్లోనూ ప్రతిధ్వనించాయి. చరబండ రాజు జీవితం కవిత్వంతో పాటు ఉద్యమాలకి అంకితమైంది. ప్రభుత్వ వ్యతిరేకత, దమన చర్యలపై గళమెత్తినందుకు ఆయన్ను అనేకసార్లు అరెస్టు చేశారు. అయినా ఆయన పోరాట పంథా మారలేదు. కలాన్ని ఉక్కుపాదంగా మలిచి, శబ్దాన్ని నినాదంగా తీర్చి ప్రజల ఆక్రోశానికి ప్రతిధ్వనిగా నిలిచినవాడు. అరెస్టులు, నిర్బంధాలు, ఆరోగ్య సమస్యలు %–% ఇవేవీ ఆయన సంకల్పాన్ని దెబ్బతీయలేక పోయాయి. రచయితగా కాకుండా పాత్రికేయునిగా కూడా ఆయన పాత్ర విశేషమైనది. "ఉద్యమ" పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించిన సమయంలో విప్లవ ఆలోచనలను ప్రజల్లోకి చొప్పించేందుకు విస్తృతంగా రచనలు చేశాడు. సామాజిక, రాజకీయ విశ్లేషణలతో కూడిన వ్యాసాల ద్వారా చైతన్యాన్ని నింపాడు. ఆయన రచనలన్నీ ఒక పాఠశాల వలె. ఉద్యమ భావజాలాన్ని నేర్పించే పాఠాలు. ఆయన రచనల్లో అంబేడ్కర్ భావజాలం, మార్క్సిస్టు సిద్ధాంతం, మానవీయ తత్వం మేళవించాయి. శోషిత వర్గాల సంక్షేమమే ఆయన రచనల గుండెచప్పుడు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వాతంత్రం కోసం నిరంతరం పోరాడిన కలం ఆయనది. ఆయన భావనలు కేవలం పాఠశాలలు, వేదికలకే పరిమితం కాలేదు %–% ఉద్యమాలలో, ప్రదర్శనలలో, పాటలుగా మారి ఊపిరి లేని ప్రజలకు ఊపిరివ్వ గలిగాయి. 1982 జూలై 2న మెదడు క్యాన్సర్ కారణంగా రాజు తన పోరాట యాత్రను ముగించారు. కానీ ఆయన మరణించినా, ఆయన ఆలోచనలు మరణించలేదు. ఆయన రచనలు ఇప్పటికీ యువ ఉద్యమకారుల చేతుల్లో నినాదాలుగా వినిపిస్తాయి. మార్పు కోసం పరిగెడుతున్న ప్రతి పాదంలో, నిరసనగా మారిన ప్రతి కంఠంలో, న్యాయం కోసం నలిగిన ప్రతి గుండెల్లో చరబండ రాజు పదాలు మౌలిక శక్తిగా మారుతూనే ఉన్నాయి. చరబండ రాజు కవిత్వం ఒక ఉద్యమ శబ్దం. ఆయన జీవితం ఒక మార్గదర్శక దీపం. తన జీవితాన్నే ప్రజల కోసం అంకితం చేసిన ఈ విప్లవ కవి, తెలుగు సాహిత్యంలో శాశ్వతంగా నిలిచిపోయిన ప్రజల స్వరం. చరబండ రాజు %–% ఒక పద్యం కాదు, ఒక ప్రజా చరిత్ర.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**


# నాటక రంగానికి పోణంగి అప్పారావు ఎనలేని సేవలు - జూలై 2..పోణంగి శ్రీరామ అప్పారావు వర్ధంతి

తెలుగు నాటక రంగానికి పోణంగి శ్రీరామ అప్పారావు చేసిన సేవలు సాటి రానివి. అంతేకాదు ఉపాధ్యాయునిగా, ఉపన్యాసకునిగా, పరిపాలనా దక్షునిగా, రచయితగా, పరిశోధకునిగా ఆచార్య పోణంగి శ్రీ రామ అప్పారావు చేసిన కృషి అనన్య సామాన్యం. తెలుగు జాతికి, కీర్తి ప్రతిష్టలు తెచ్చిన మహా మనీషి పోణంగి. పోణంగి శ్రీరామ అప్పారావు (జూలై 21, 1923 – జూలై 2, 2005) నాటకకర్త, అధ్యాపకులు, నాట్యశాస్త్రం అనువాదకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. అప్పారావు 1923, జూలై 21 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు తాలూకా, బందపురంలో జన్మించారు. కొవ్వూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, విజయవాడ శ్రీరాజా రంగయ్యప్పారావు కళాశాలలో, ఆంధ్ర విశ్వ విద్యాలయంలోను విద్యాభ్యాసం చేశారు. తెలుగు నాటక వికాసం' అనే అంశంపై పరిశోధన చేసి 1961 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా స్వీకరించారు. తెలుగు నాటక రంగాన్ని గురించిన సర్వ సమగ్రమైన గ్రంథమిది. 1967లో ఈ గ్రంథం వెలువడిన నాటినుంచి నాటక రంగానికి ప్రామాణిక గ్రంథంగా విరాజిల్లుతుంది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. భీమవరం, రాజమండ్రి, కడప, శ్రీకాకుళం, మద్రాసు కళాశాలలో, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఉపన్యాసకులుగా, హైదరాబాద్ న్యూ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా, పాఠ్య పుస్తకాల ప్రత్యేకాధికారిగా, సాంస్కృతిక శాఖ ప్రత్యేకాధికారిగా, తెలుగు అకాడమీ – అంతర్జాతీయ తెలుగు సంస్థల స్థాపక డైరెక్టర్ గా, ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల ప్రధాన కార్యదర్శిగా, సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టర్ గా, ఆయా పదవులకే వన్నె తెచ్చారు. రాష్ట్ర సంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకునిగా, తెలుగు అకాడమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ (అదే శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంగా మారింది) వ్యవస్తాపక సంచాలకునిగా అప్పారావు ఎనలేని సేవలందించారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన ప్రప్రథమ అంతర్జాతీయ తెలుగు మహా సభలకు ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్విరామంగా శ్రమించి, "నభూతో నభవిష్యతి" గా విజయ వంతం చేశారు. ఆనాటి ముఖ్య మంత్రి జలగం వెంగళరావు, విద్యా మంత్రి మండలి వెంకట కృష్ణారావు నేతృత్వంలో తెలుగుజాతి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే విధంగా అంతర్జాతీయ తెలుగు మహా సభలకు రూపకల్పన చేసి, తర్వాతి మహా సభలకు మార్గ నిర్దేశనం చేశారనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. అప్పారావు 1987 లో కలకత్తాలో జరిగిన విశ్వ ఉన్నయన్ సంసద్లో రాష్ట్ర నాట్య సామ్రాట్ బిరుదును, 1990లో హైదరాబాదు యువ కళావాహిని వారిచే నాటక రత్న బిరుదాన్ని, 1992 లో శ్రీకాళహస్తి భరతముని ఆర్ట్స్ అకాడెమీ వారిచే కళారత్న బిరుదాన్ని అందుకున్నారు. భరతముని సంస్కృతంలో వ్రాసిన నాట్య శాస్త్రాన్ని డాక్టర్ పి.ఎస్.ఆర్. అప్పారావు తెలుగు లోకి అనువదించారు. నాట్యంలోని వివిధ అభినయాలపై సవివరంగా ఎన్నో పుస్తకాలు రచించారు. నాట్యంలో శిక్షణ ఇచ్చే గురువులకు, నృత్యం నేర్చుకునే కళాకారులకు అవి ప్రామాణిక పాఠ్య గ్రంథాలుగా గుర్తింపు పొందాయి. అలనాటి నాటక రంగ ప్రముఖుల జీవిత విశేషాలను సేకరించి, గ్రంథస్తం చేశారు. ఎన్నో ప్రభుత్వ, ప్రయివేటు, స్వచ్ఛంద సాంస్కృతిక సంస్థలు ఆయనను గౌరవించి సత్కరించాయి. దేశ, విదేశాలలో నాట్య శాస్త్రం. పైన, రంగస్థల విషయాలపైన పరిశోధనలు చేసి, అనేక ప్రసంగాలు చేశారు. తాజ్ మహల్ (నాటిక), విశ్వభారతి (నవల), వేణువు (పద్యాత్మక గద్యము), నాట్యశాస్త్రము (గుప్తభావ ప్రకాశికా సహితము – జాతీయ బహుమతి పొందిన గ్రంథం), నాటక రచనా ప్రయోగములు (సిద్ధాంత గ్రంథము), తెలుగు నాటక వికాసము (డాక్టరేట్ పట్ట పరిశోధన వ్యాసము) తదితరాలు ఆయన ఇతర రచనలు. 'నాట్యశాస్త్ర 'గ్రంథానికి దివంగత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా కేంద్ర సాహిత్య అకాడమీ జాతీయ అవార్డును అందుకొన్నారు. నాటకరంగ పరిశోధనలో విశేషంగా కృషి చేసిన అప్పారావు 2005, జూలై 2 న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.




**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సార్వత్రిక విశ్వ విద్యాలయ పితామహుడు గడ్డం రాంరెడ్డి - జూలై 2... విద్యా రంగ సంస్కర్త రాంరెడ్డి వర్ధంతి



మారుమూల పల్లెలో జన్మించి, అంచెలంచలుగా పైకి ఎదుగుతూ, ఉన్నత చదువులు చదివి, విదేశాలలో విద్యనభ్యసించి, విద్యారంగంలో వినూత్న, విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టిన మేధావి ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డి. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గా, వైస్ ఛాన్సలర్ గా, బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ప్రథమ వైస్ ఛాన్సలర్ గా, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గా, భారత సమాజ విజ్ఞాన పరిశోధనా మండలి దక్షిణ ప్రాంతీయ కేంద్ర వ్యవస్థాపక డైరెక్టర్ గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ గా తన మేధో సంపత్తిని ధారబోసిన మహనీయుడు ఆయన. దూరవిద్య ప్రముఖులు, సమాజ శాస్త్ర విజ్ఞానంలో మేటి వ్యక్తి, సార్వత్రిక విశ్వవిద్యాలయ పితామహుడు" (Father of Open Universities) గా గుర్తింపు పొంది, జి.రాంరెడ్డిగా సుపరిచితులైన గడ్డం రాంరెడ్డి (డిసెంబరు 4, 1929 – జూలై 2, 1995) 1929 డిసెంబరు 4న కరీంనగర్ జిల్లా మైలారం గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో రాజ నీతి శాస్త్రంలో ఎమ్.ఎ. పట్టా పొంది పి.హెచ్.డి. స్వీకరించారు. 1977 వరకు అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పనిచేశారు. 1977 నుండి 1982 మధ్య కాలంలో వైస్ ఛాన్సలర్ గా పనిచేశారు. హైదరాబాదు లోని భారత సమాజ విజ్ఞాన పరిశోధనా మండలి (%ూశీఎఖుశ్రీ ూఎఱవఅఎవం =వంఖుతీఎష్ట్ర జశీబఅ–ఎఱశ్రీ%), దక్షిణ ప్రాంతీయ కేంద్రానికి వ్యవస్థాపక డైరెక్టర్ గా సమాజ శాస్త్రంలో పలు ప్రయోగాలు చేసి సఫలీకృ తులైనారు. 1980 దశాబ్దంలో దూరవిద్య వైపు దృష్టి మళ్ళించి, ప్రపంచ ప్రసిద్ధిచెందిన బ్రిటిష్ ఓపెన్ యూనివర్సిటీ గురించి నిశితంగా పరిశీలించి, దూర విద్యపై విశేషాధ్యయనం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోరిక మేరకు సార్వత్రిక విశ్వ విద్యాలయం మన రాష్ట్రంలో ప్రారంభించే విషయంలో ఒక నివేదిక సమర్పించారు. వెంటనే ప్రభుత్వం ఆమోదించి 1982 లో దేశంలో మొట్ట మొదటగా ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఏర్పడింది. దీనికే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంగా నామకరణం చేశారు. దీనికి మొదటి వైస్ ఛాన్సలర్ గా రాంరెడ్డి నియమితులైనారు. అయన చేస్తున్న కృషిని గుర్తించిన భారత ప్రభుత్వం 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ గా ఆయనను నియమించింది. అక్కడ రాంరెడ్డి తన. మేథో మధనంతో చేసిన కృషి అంతర్జాతీయ గుర్తింపు పొందింది. తరువాత 1991లో భారత ప్రభుత్వం రాంరెడ్డిని కొత్త ఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ గా నియమించింది. ప్రపంచంలోని ప్రముఖ సార్వత్రిక విశ్వ విద్యాలయాలను పరిశీలించి సార్వత్రిక వ్యవస్థకు ఒక చక్కని నమూనా తయారు చేసి తొలిసారిగా ఆసియా అభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సదస్సులో ప్రకటించారు. ఆ నమూనా పలు దేశాలలో సార్వత్రిక విశ్వ విద్యాలయాలు ఏర్పాటు చేసుకోడానికి తోడ్పడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ మొదటి సార్వత్రిక విశ్వ విద్యాలయానికి రాంరెడ్డి సలహాదారుగా నియమించు కోవడం విశేషం. ఆంధ్ర ప్రదేశ్ లోను, భారతదేశం లోను రాంరెడ్డి కి కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశాయి. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోని దూరవిద్యా విభాగానికి ఆయన పేరు పెట్టారు. రారెడ్డికి 1994లో ప్రతిష్ఠాత్మకమైన శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం ప్రదానం చేశారు. ఒక వ్యక్తి ఉన్నత విద్యను అభ్యసించడం సాధారణం. కానీ దేశంలోని ఎంతో మందికి ఆ విద్యను అభ్యసించే అవకాశం కల్పించడం అసాధారణం. దేశ ఆర్థిక సామాజిక సమగ్రాభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని నిర్దేశిస్తూ మారుమూల గ్రామాల ప్రజలు సైతం దూర విద్య ద్వా రా విద్యను పొందవచ్చని నిరూపించారు. విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలను తీసుక వచ్చిన రాంరెడ్డి నిరంతర స్ఫూర్తిదాతగా నిలిచారు. స్నేహ పూర్వక పరిపాలన అధ్యక్షునిగా ఉప కులపతులకు ఆదర్శప్రాయులైనారు. ఉన్నత విద్యలో, ప్రధానంగా దూరవిద్యకు ఊతమిచ్చి, నేడు సర్వత్రా దూర విద్య అందుబాటు లోకి రావడానికి కారణభూతులైన దూర విద్య పితామహులు రాంరెడ్డి లండన్ లో జూలై 2, 1995లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విలువల వికాసానికి కలం పట్టిన కర్మయోగి దాసు కృష్ణమూర్తి - వంద వసంతాలను చూసిన పాత్రికేయ పితామహుడు - జూలై 1, 2025న శత వార్షిక జన్మదిన వేడుకలు జరుపుకున్న సందర్భంగా



భారతీయ పాత్రికేయ రంగానికి విశిష్ట దిశ చూపిన అసాధారణ నైతిక వేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి – దాసు కృష్ణమూర్తి. విలువల పత్రికా ధర్మాన్ని జీవన. విజ్ఞానంగా మలుచుకున్న ఈ మహనీయుడు, ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని పెద్దాపురం సమీప గ్రామంలో వందేళ్ల క్రితం జూలై 1 న జన్మించారు. అక్షరాలపై మక్కువ, విశాలదృష్టి, విలువల పట్ల కట్టుబాటు ఆయనను యావత్ పాత్రికేయ లోకానికి ఆదర్శప్రాయంగా నిలిపాయి. అధిక చదువు, దీర్ఘ అనుభవం, ప్రగాఢమైన పరిశీలనా శక్తి ఆయనను ఏ రంగంలోనైనా ప్రకాశింప జేశాయి. ఆంధ్రా విశ్వ విద్యాలయంలో ప్రాథమిక విద్య, బొంబాయి విశ్వ విద్యాలయంలో ఎల్.ఎల్.బి., ఉస్మానియా విశ్వ విద్యాలయంలో జర్నలిజంలో డిప్లొమా సాధించారు. విద్యలో ఆయనకు ఉన్న నిబద్ధత, నైపుణ్యం తరువాతి జీవితాన్ని తీర్చిదిద్దిన మూలాధారం. దాసు జర్నలిస్టుగా తన ప్రస్థానాన్ని ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఆంగ్ల దినపత్రికలో ప్రధాన ఉప సంపాదకునిగా చేరేముందు అయన "ది సెంటినెల్", "ది డెక్కన్ క్రానికల్", "ది డైలీ న్యూస్"లలో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ది హిందూలో రిపోర్టర్‌గా, ఎడిటోరియల్ డెస్క్‌లో పనిచేశారు. అనంతరం ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా, పాట్రియట్ వంటి ప్రఖ్యాత ఆంగ్ల దినపత్రికల్లో సంపాదకీయ విభాగంలో సేవలందించారు. జాతీయ రేడియో సంస్థ ఆల్ ఇండియా రేడియోలో రాజకీయ వ్యాఖ్యాతగా చేసిన విశ్లేషణలు దేశవ్యాప్తంగా శ్రోతలను చైతన్య. వంతుల్ని చేశాయి. అంతర్జాతీయ స్థాయిలో ఆయన పాత్రికేయ అనుభవం విశేష పీఠాన్ని అధిరోహించింది. అమెరికాలోని వాయిస్ ఆఫ్ అమెరికాలో న్యూస్ ఎడిటర్‌గా పనిచేసిన ఆయన, వాషింగ్టన్ డీసీలో తన విలక్షణమైన విలువాధారిత పాత్రికేయతతో అక్కడి మేధావులను ఆకట్టుకున్నారు. తద్వారా, అంతర్జాతీయ పాత్రికేయ ప్రమాణాలను భారతంలో విలీనం చేసే ప్రయత్నానికి నాయకత్వం వహించారు. జార్జియా స్టేట్ యూనివర్శిటీలో జర్నలిజం అధ్యాపకునిగా పనిచేసి విదేశీయులకు భారత పాత్రికేయ ధోరణులను పరిచయం చేశారు. భారత్. లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఢిల్లీ ఐ ఐ ఎం సి, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పాఠాలు చెబుతూ పత్రికా విద్యార్థుల మనసుల్లో ప్రజ్ఞాన విత్తనాలు నాటారు. ఆయన బోధనలో విలువలు, వాస్తవ ధర్మం, సామాజిక స్పృహ ప్రధానమయ్యాయి. దాసు కేవలం జర్నలిస్టే కాక, కథా రచయితగా, అనువాదకుడిగా తన ముద్ర వేశారు. "1947 సంతోషబాద్ ప్యాసింజర్ అండ్ అదర్ స్టోరీస్", "ది సీసైడ్ బ్రైడ్" వంటి కథా సంకలనాలు ఆంగ్లంలో ఆయన రచనా పటిమను చాటి. చెప్పాయి. తెలుగు మూలాల. నుండి అనువదించిన అనేక కథలు విదేశీయులకు తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేశాయి. 85 ఏళ్ల వయస్సులో కూడా కథల సంపుటి రాసి అక్షరాల పట్ల తన ఎనలేని ప్రేమను నిరూపించారు. అత్యంత ప్రాచుర్యం పొందిన గ్రంథాల్లో "Journalism in India" (1981) పాత్రికేయ విద్యార్థుల కోసం ఒక ముఖ్యమైన పాఠ్యగ్రంథంగా నిలిచింది. "Indian Journalism: A Critical Perspective", "Ethics in Indian Journalism" వంటి రచనల ద్వారా ఆయన పాత్రికేయ నైతికతకు సంబంధించి ప్రామాణిక ఆధారాలను అందించారు. నిష్పాక్షికత, నిబద్ధత, ప్రజల పక్షాన నిలబడే ధైర్యం – ఇవే ఆయన రచనా దిశలు. ఆయన హాస్యం, వ్యంగ్యం, సామాజిక విమర్శ, తాత్వికతతో కూడిన రచనలు పాఠకులను ఆలోచింప. జేసేలా ఉండేవి. వృద్ధాప్యంలోనూ రోజూ మూడు గంటల పాటు రచన చేస్తూ, సమకాలీన రాజకీయాలపై పరిశీలన కొనసాగిస్తూ జీవితం చివరి చరమాంకం లోనూ రచనకే అంకితమయ్యారు. "పత్రికా స్వేచ్ఛ అనేది ప్రభుత్వాన్ని విమర్శించడంలో లేదు %–% ప్రజల పక్షాన నిలబడటంలో ఉంది" అనే ఆయన ఆత్మవాక్యం, పాత్రికేయ ధర్మానికి మార్గదర్శిగా నిలిచింది. దాసు కృష్ణమూర్తి ఒక జర్నలిస్టు మాత్రమే కాదు. ఆయన ఒక జీవన తాత్వికుడు. ఆలోచనలకు రూపం. విలువల పథంలో నిలిచిన పాత్రికేయ పితామహుడు. నేటి యువ పాత్రికేయులు, రచయితలకు ఆయన జీవితమంతా ఒక పాఠ్య గ్రంథమే. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# యూటీ పునర్నిర్మాణ పనుల్లో పురోగతి

కూసుమంచి : కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయానికి దిగువన సాగర్ ఎడమ కాల్వపై చేపట్టిన యూటీ(అండర్ టన్నెల్) పునర్నిర్మాణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ఈ భారీ నిర్మాణంలో మూడు విభాగాలుగా స్లాబు వేయాల్సి ఉంది. శనివారం ఒక విభాగం స్లాబు పనులు చేపట్టారు. గతేడాది సెప్టెంబరు 1న పాలేరు జలాశయానికి వరద పోటెత్తటంతో దిగువన సాగర్ ఎడమ కాల్వకు 140.568 కిలోమీటరు వద్ద గండి పండిది. వరద ఒకేసారి గండి ప్రాంతానికి రావటంతో ప్రవాహ ఉధ్ధృతికి అండర్ టన్నెల్ ధ్వంసమైంది. కట్టడాన్ని పూర్తిగా తొలగించి, ఇరువైపులా కట్టలు బలోపేతం చేసి నీటిని వదిలారు.



**రూ.4.60 కోట్లు మంజూరు**

యూటీ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.60 కోట్లు మంజూరు చేసింది. గతంలో రెండు ఖానాలుగా ఉన్న యూటీని ఇప్పుడు మూడు ఖానాలతో 2,300 క్యూసెక్కుల నీరు ప్రవహించే ఆకృతితో నిర్మిస్తున్నారు. యూటీ 77 మీటర్ల పొడవు, 11.6 మీటర్ల వెడల్పు ఉండనుంది. మూడు విభాగాలుగా విభజించి స్లాబు పనులు చేపడుతున్నారు. నీరు ప్రవహించే ప్రాంతాన్ని ఒక విభాగంగా, ఇరువైపులా కాల్వ కట్టల అడుగున మరో రెండు విభాగాలుగా స్లాబును నిర్మించనున్నారు. నీరు ప్రవహించే విభాగం స్లాబు పనులు చేపట్టారు. అనంతరం 26, 21 మీటర్లతో మరో రెండు స్లాబులు వేయాల్సి ఉంది. కాల్వ కట్టకు ఒకవైపున 610 మీటర్ల పొడవున సైడ్‌వాల్, యూటీ ప్రాంతంలో కట్టడం బలోపేతానికి రక్షణ గోడలు నిర్మించాలి. ఈ పనులను 20 రోజుల్లో పూర్తి చేసి నీటి విడుదలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈ మంగళంపుడి వెంకటేశ్వర్లుకు తెలిపారు.

# ఏడుపాయల.. అభివృద్ధికి ఆవల

మెదక్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ఇన్‌ఛార్జి అధికారుల పాలనలోనే కొనసాగుతోంది. దీనికి తోడు పదినెలలుగా పాలకమండలి నియామకం లేకపోవడంతో పర్యవేక్షణ కరవైంది. అభివృద్ధి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చక, సకాలంలో సమస్యలు పరిష్కారం కాక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మెదక్ ఎమ్మెల్యే ఏడుపాయల ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతో ఉంది.

**రోజురోజుకు పెరుగుతున్న భక్తులు**

1965-66లో ఈ ఆలయం దేవాదాయ శాఖ ఆదీనంలోకి వెళ్లింది. అప్పటి నుంచి ఛైర్మన్, ధర్మకర్తలతో పాలకమండలిని నియమించి నిర్వహిస్తూ వస్తున్నారు. రోజు రోజుకు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. ఆదివారం రోజున ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుంది.

**ఇన్‌ఛార్జి అధికారి పాలనలోనే..**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ సంచాలకులు ఇన్‌ఛార్జి ఈవోగా కొనసాగుతున్నారు. ఈయనకు ఇటీవలే రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయింది. ప్రస్తుతం ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని 36 ఆలయాలను పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఏడుపాయల ఇన్‌ఛార్జి ఈవోగా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిని ఈవోగా నియమించాల్సి ఉంది.

**ఏం చేయాలంటే**

సహాయ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలి. ఆలయం స్థాయిని పెంచి, సిబ్బందిని నియమించాలి

ఇటీవల రెండుసార్లు పాలకమండలి నియామకానికి దేవాదాయ శాఖ ప్రకటన ఇచ్చినా పలు కారణాలతో ఎవరూ దరఖాస్తు చేయలేదు. వెంటనే పాలకమండలిని నియమించాలి

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలి. భక్తుల బసకు వసతులు కల్పించాలి. శుద్ధి జల కేంద్రాన్ని ప్రారంభించాలి. పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.

**స్థాయిపెంపులో నిర్లక్ష్యం**

ఆలయాలకు వచ్చే ఆదాయం, భక్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని స్థాయి పెంపొందించాల్సి ఉంటుంది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయం స్థాయిని పెంచినప్పుడే ఈ గుడికి సంబంధించి ప్రతిపాదనలు దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపించారు. దానికి ఇప్పటికీ ఆమోదముద్ర పడలేదు. గ్రేడ్-1 స్థాయిలోనే కొనసాగుతోంది.

**ఏటా రూ.6 కోట్లకు పైగా..**

నదుర్గమ్మ ఆలయాలు దేశంలో రెండే ఉన్నాయి. ఒకటి కశ్మీర్‌లో ఉండగా నిర్వహణ లేక మూతపడింది. రెండోది ఇక్కడే ఉండటం విశేషం. ఆలయానికి ఏటా రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. మహాశివరాత్రి జాతరను ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తుండటం విశేషం.

**అవస్థలు పడుతూ..**

సత్రాలు లేకపోవడం సమస్యగా మారింది. ఖాళీ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు వేసిన టెంట్లను భక్తులు ఆశ్రయిస్తున్నారు. తాగునీటి సమస్య వేధిస్తోంది. ఆలయానికి 50 ఎకరాలు ఉన్నా వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందే. పరిసరాలు అపరిశుభ్రతకు నిలయాలుగా కనిపిస్తాయి

సమీపంలోని మంజీరా నదిలో స్నానం చేసి దుర్గమ్మను దర్శించుకోవాలని భక్తులు ఆరాటపడతారు. స్నానఘట్టాలు లేక చెక్‌డ్యాం, నదీపాయల వద్ద స్నానాలు చేస్తుంటారు. ప్రమాదమని తెలిసినా గత్యంతరం లేక భక్తులు వెళ్తున్నారు. పలు సందర్భాలలో భక్తులు నీట మునిగి మృతి చెందుతున్నారుదుస్తులు మార్చుకునేందుకు సరైన వసతి లేదు. ఆలయ సమీపంలో చిన్న రేకుల గది ఉంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు: ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గత ఆగస్టులో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ఈవో

# అంగడి సరకులు.. ఇంటి ముంగిట్లోకి..!



చిట్యాల: 'తియ్య తియ్యని పుచ్చకాయలు..', 'కొబ్బరి కుడుకులకు చక్కెర', 'అల్లం, ఎల్లిగడ్డ రూ. 150కే...రెండు కిలోలు..'.. ఇలాంటి మాటలు పొద్దున లేచింది మొదలు మధ్యాహ్నం వరకు మనకు వినిపిస్తుంటాయి. నిత్యావసర సరకులు ఇప్పుడు ఇంటి ముంగిటకే వచ్చేస్తున్నాయి. కొంతమంది ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్లలో తీసుకొచ్చి అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు.

ఒకప్పుడు నిత్యావసర సరకులు కొనేందుకు సంతలకు వెళ్లేవారు. పట్టణాలు, పెద్ద గ్రామాల్లో 'వార సంత'లు జరుగుతుండేవి. బహిరంగ మార్కెట్లో కన్నా సంతలో తక్కువ ధరకు దొరకడంతో జనం అక్కడకి వెళ్లి కొనుగోలు చేసేవారు. కాలక్రమంలో మార్పులు చోటుచేసుకుని కిరాణా, హోల్‌సేల్ దుకాణాలు వెలుస్తున్నాయి. ఇప్పుడు మార్టులు వెలిశాయి. ఇక్కడ దొరకని వస్తువులు ఉండవు. ఆ తర్వాత ఆన్‌లైన్ బిజినెస్. చరవాణి సాయంతో మార్టుల్లో దొరికే వాటితో పాటు రకరకాల వస్తువులను ఆన్‌లైన్‌లో ఇంటికి తెప్పించుకుంటున్నారు.

మనిషి జీవన గమనంలో వేగం పెరిగింది. పనుల ఒత్తిడిలో మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేసే సమయం ఉండడం లేదు. వీటిని గమనించిన కొందరు రైతులు, హోల్‌సేల్ వ్యాపారుల వద్ద సరకులు టోకున కొనుగోలుచేసి ద్విచక్రవాహనాలు, ఆటోలు, వ్యాన్లలో తీసుకొచ్చి, వీధివీధి తిరిగి విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు గిట్టుబాటవుతోందని సంస్థాన్‌నారాయణపురం రాచకొండ ప్రాంతానికి చెందిన గగులోత్ దాస్యా అనే విక్రయదారుడు పేర్కొన్నారు. వినియోగదారులకు మార్కెట్‌కు వెళ్లే పనిలేకుండా పోవడం, మార్కెట్‌కన్నా తక్కువ ధరకు సరకు దొరుకుతుండడంతో సమయం, ఆర్థికంగా ఆదా అవుతుందని వారు సంతోషంగానే ఉన్నారు. విక్రయదారులు తమ వాహనాలకు వాయిస్ రికార్డు చేసిన మైకులను అమర్చి మరీ ప్రచారం చేసుకుంటున్నారు. నిత్యావసర సరకులే కాకుండా ముగ్గు నుంచి మంచాలక్కు నవారు అల్లకం, బ్యాగులు, దుస్తులకు జిప్పులు వేయడం, గ్యాస్ స్టౌ మరమ్మతు, స్టీలు పాత్రలు, దుప్పట్లు, చీరల విక్రయం వంటివి ముంగిట్లోకి వస్తున్నాయి.

**పాత కాలం గుర్తుకు వస్తోంది: కూనూరు పాపయ్యగౌడ్, చిట్యాల**

మా చిన్నతనంలో గ్రామ కూడలిలో రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, దుంపలు తెచ్చి విక్రయించేవారు. డబ్బులకే కాకుండా కొందరు ధాన్యం ఇచ్చి సరకులు కొనుగోలుచేసేవారు. అప్పట్లో అంతా వ్యవసాయక వాతావరణం ఉండేది. మళ్లీ ఇప్పుడు వీధివీధి తిరుగుతూ విక్రయిస్తుంటే పాత కాలం గుర్తుకు వస్తోంది. అప్పుడు ఎండ్ల బండ్లపై సరకులు తెస్తే, ఇప్పుడు వాహనాలపై తెస్తున్నారు అంతే తేడా.

# మలిదశలో... కష్టాల మలుపులు



నల్గొండ : జిల్లా కొత్తపల్లి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలికి అనారోగ్యం వచ్చింది. అన్నాదమ్ముల ఒప్పందం ప్రకారం ప్రతి ఆరునెలలు ఒకరి వద్ద ఉండాలి. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన ఆమెను ఇద్దరూ పట్టించుకోకుండా మాటలతో హింసించడం, కర్రలతో కొడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమెను ఆసుపత్రికి చేర్పించి సపర్యలు చేశారు. అనంతరం కొడుకులిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ చేయడంతో పరిస్థితులు సద్దుమణిగాయి.

కంటికి రెప్పలాగా కష్టపడి.. తమ సుఖాలను త్యాగం చేస్తూ..కనిపెంచిన కన్నతల్లిదండ్రులూ మలి వయసులో ఠాణాల చుట్టూ..కోర్టుల మెట్లు ఎక్కుతున్నారు. చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా అన్నీ తామై చూసుకున్న వారికి పెద్దతనంలో తీరని శోకాన్ని కలిగిస్తున్న పుత్రరత్నాలు ఉన్నారు. అవును.. వయోధికులు వృద్ధాప్యంలో తమ పిల్లలు పట్టించుకోకపోవడంతో అనేక అవస్థలు పడుతున్నారు. వయోధికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి తమ ఇంటి నుంచే సహాయం కొరవడటంతో మానసికంగా కుంగిపోతున్నారు.

నల్గొండ జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో పిల్లలు పట్టించుకోకపోవడంతో వృద్ధాశ్రమాలకు తల్లిదండ్రులను తరలించిన కేసులు లేవు. అయితే ఎక్కువగా తమ పిల్లలు సరిగా తమకు భోజనం పెట్టడం లేదని, బాగోగులు పట్టించుకోవడం లేదని, సరైన వసతులు సమకూర్చడం లేదనే ఫిర్యాదులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు.

**పెద్దలూ... ఇలా చేయండి**

కుటుంబ సభ్యులు పట్టించుకోకుంటే వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం-2007 ప్రకారం తమకు న్యాయం జరిగేలా సంబంధిత కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. కన్నవారిని పట్టించుకోనివారిపై మూడు నెలల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తోంది. భరణాన్ని ఎగ్గొట్టినవారికి మరో నెల రోజుల వరకు జైలుశిక్ష పడుతుంది.

తెల్లకాగితంపై తమ సమస్యను వివరిస్తూ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారణ చేపడతారు. వృద్ధులతో పాటు వారి కుటుంబ సభ్యులను మూడు సార్లు విచారణ చేసిన తర్వాత వృద్ధులకు పోషణ, సంక్షేమం దక్కేలా తగిన తీర్పు ఇస్తారు.

పిల్లలకు గిఫ్ట్‌డీడ్ కింద కొంత ఆస్తిని ఇవ్వాలి. ఆస్తి పంపకాలు మొత్తం పిల్లలకు చెందేలా వీలునామా రాయవద్దు. కొంత ఆస్తి తమ తదనంతరం తమకు సేవ చేసిన వారికే వర్తిస్తుందనేలా లాయర్‌తో సంప్రదింపులు చేసి దస్తావేజులు రూపొందించాలి.

నల్గొండ జిల్లావ్యాప్తంగా 58,910 మంది వయోవృద్ధులున్నారు. జిల్లాలో నాలుగు ఆర్డీవో కార్యాలయాలున్నాయి. నల్గొండ-54, చండూరు-34, మిర్యాలగూడ-53, దేవరకొండ-49 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు మొత్తం 190 కేసులు నమోదయ్యాయి. ఇందులో 86 కేసుల వరకు పరిష్కారమవ్వగా మిగిలిన 104 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

**వయోవృద్ధులకు రక్షణగా చట్టాలు: అశోక్‌రెడ్డి, ఆర్డీవో, నల్గొండ**

మలి వయస్సులో వృద్ధులకు అండగా ఉండాల్సిన పిల్లలు వారిని వదిలేస్తున్నారు. వృద్ధులకు ఆత్మీయత అందించాల్సిన సమయంలో వారిని భౌతికంగా, మానసికంగా బాధపెట్టే కేసులు ఈ మధ్య వెలుగు చూశాయి. ప్రభుత్వపరంగా వృద్ధుల సంక్షేమం కోసం చట్టాలు పకడ్బందీగా అమలు చేస్తోంది. వారిని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

# మెట్ట వరి.. సాగులో సిరి



మునగాల : వ్యవసాయ సాగులో నేడు ప్రధాన సమస్య కూలీలు. సమయానికి నారు సిద్ధం చేసినప్పటికీ అనుకున్న సమయానికి నాటు వేయడం లేదు. ఫలితంగా పంట దిగుబడి తగ్గి రైతులు అప్పులపాలవుతున్నారు. వీటన్నింటికి ప్రత్యామ్నాయంగా దమ్ము చేయకుండా నేరుగా విత్తి వరిసాగు చేసే పద్ధతి అమలులోకి వచ్చింది. కూలీల కొరత, అధిక రేట్లు, పొలం దమ్ము చేసేందుకు ట్రాక్టర్ కిరాయిలు, ఇతర పెట్టుబడులకు ఈ విధానంలో చెక్ పెట్టవచ్చు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ, సుస్థిర వ్యవసాయ కేంద్రం(సీఎస్‌ఏ), డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్ట వరి సాగుపై రైతులకు శిక్షణ ఇస్తారు. నడిగూడెం మండలానికి చెందిన రణబోతు శ్రీనివాసరెడ్డి తన ఆరున్నర ఎకరాల్లో ఈ మెట్ట వరిసాగు చేశారు.

**మెలకువలు పాటిస్తే ఫలితం..**

మెట్ట వరిసాగుకు ఎర్రనేలలు, మధ్యస్థ నేలలు అనుకూలం. సేంద్రియ పద్ధతుల్లో సాగుకు దుక్కిలో ఎకరానికి 4 క్వింటాళ్ల పశువుల ఎరువు వేసి 4 నుంచి 5 సార్లు పొడి దుక్కిని దున్నుకోవాలి. విత్తన శుద్ధి చేసుకొని, ట్రాక్టరుకు అమర్చిన సీడ్ డ్రిల్ లేదా ఎద్దులతో గొర్రు ద్వారా వరుసలుగా ఆ దుక్కిలోనే విత్తుకోవాలి. వరుసల మధ్య కచ్చితంగా అడుగు దూరం ఉండాలి. చదును చేసిన దుక్కిలో 2 అంగుళాల లోతులో విత్తనాలు పడాలి. విత్తిన తరువాత 4 నుంచి 5 రోజులు వర్షం పడకపోయినా పర్వాలేదు. మట్టిలోని తేమ పూర్తిగా ఆరిపోకుండా చూసుకోవాలి. అవసరమైతే తడి కట్టుకోవాలి. ఎకరానికి సన్న రకాలైతే 8-10 కిలోలు, లావు రకాలైతే 10-12 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఎనిమిది వరుసలు విత్తే సీడ్‌డ్రిల్ ద్వారా గంట సేపట్లో ఎకరం పొలంలో విత్తనాలు వేయవచ్చును. నీరు ఎక్కువ అవసరం ఉండదు. అవసరాన్నిబట్టి తడులు పెట్టుకుంటే సరిపోతుంది. 40-45 రోజుల వరకు కలుపు మొలుస్తుంది. సైకిల్ గొర్రు, వీడర్ల సహాయంతో తొలగించుకోవాలి.

**ప్రయోజనాలివీ..**

నారు మడి పెంచనవసరం లేదు. వరుసలుగా క్రమపద్ధతిలో ఉండటంతో గాలి, వెలుతురు బాగా తగులుతుంది. ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి ఖర్చులు మిగులుతాయి. దిగుబడి సాధారణ పద్ధతిలో మాదిరిగానే వస్తుంది.

**కలుపు నివారణ**

విత్తనాలు వేసిన 48 గంటలలోపు కలుపు నివారణ మందును పిచికారీ చేసుకోవాలి. 20 నుంచి 25 రోజుల్లో 2 లేదా 3 ఆకుల దశలో రెండోసారి కలుపు నివారించుకోవాలి.

# చినుకు ముద్దాడితేనే చేను మురిసేది

గజ్వేల్: కార్తెలు కదిలిపోతున్నా చినుకు జాడ లేక జిల్లాలోని కర్షకులు కలవరపడుతున్నారు. రూ.వేలల్లో ఖర్చు చేసి విత్తనాలు వేశాం.. వర్షాలు సరిగా లేక కొన్ని చోట్ల మొలకలు రాకపోవడం.. వచ్చిన చోట ఎదగకపోవటం ఆవేదన కలిగిస్తోందని రైతులు వాపోతున్నారు. వారం రోజుల పాటు వానల జాడ లేక మొక్కలు వాడిపోయాయని, వరుణుడు కరుణించడంతో కాస్త ఊపిరి పోసుకున్నట్లైందని చెబుతున్నారు. వానాకాలమైనా నేటికీ జిల్లాలోని తటాకాల్లోకి నీరు చేరకపోవటంతో బోర్లపై రైతులు ఆశలు పెట్టుకోలేదు. వరి నాట్లకు ఇంకా పొలాలను సిద్ధం చేసే పనికి ఉపక్రమించలేదు. వరి సాగుకు పూర్తిగా కరెంటు ఆధారిత బోరుబావులే ఆధారం కావడంతో కర్షకులు ఆకాశానికేసి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**అంచనాలు అందుకునేనా..**

ప్రస్తుతం మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మసాగర్‌లలో నీటి నిల్వల కారణంగా భూగర్భజలాలు కాస్తా ఆశాజనకంగా ఉండి బోర్లలో లభ్యమయ్యే కొద్దిపాటి నీటితో జిల్లాలోని పలువురు రైతులు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. వర్షాలు పడితే పొలాల దున్నకాలు సాగుతాయని చెబుతున్నారు. ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 5.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవనున్నాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ప్రస్తుత గణాంకాలు చూస్తే ఈసారి అంచనాలు



అందుకునేనా అని అనుమానం కలుగుతుంది.

**ముందస్తు ఆలోచనలతో మక్క సాగు..**

రైతులు రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు మడికట్లలో మొక్కజొన్న విత్తనాలు వేశారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే నీటి లభ్యతను బట్టి వరి నాటు వేయవచ్చని భావించారు. లేనిపక్షంలో అడపాదడపా కురిసే వానలే మొక్కజొన్నను ఆదకుంటాయని ముందస్తు ఆలోచనలతో ఆ పంట వైపు మొగ్గుచూపారు. ప్రస్తుతం పంట దంతె దశకు చేరుకుంది. సుమారు ఐదారువేల ఎకరాల మొక్కజొన్న పంట వరి మడికట్లలోనే సాగుచేయటం గమనార్హం.

వర్షపాతం వివరాలు

జూన్‌లో సాధారణం: 75.7 మి.మీ

కురిసింది: 47.5 మి.మీ

# స్వచ్ఛ పురస్కారాలకు సర్వే

పెద్దశంకరంపేట : స్వచ్ఛత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. స్వచ్ఛత పాటిస్తూ ఆదర్శంగా నిలిచే గ్రామాలకు కేంద్రం పురస్కారాలు ప్రకటించి నజరానాలు సైతం అందించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 కార్యక్రమాన్ని చేపట్టింది. త్వరలో కేంద్ర బృందాలు గ్రామాల్లో పర్యటించి సర్వే చేయనుంది. వివిధ అంశాల్లో వెయ్యి మార్కులకు ఎక్కువ సాధించిన పంచాయతీలకు స్వచ్ఛర్యాంకులు ప్రకటించనుండటం విశేషం.

**ఎంపిక చేసిన గ్రామాల్లో..** జిల్లాలోని 20 – 25 గ్రామపంచాయతీలను ఎంపిక చేసి సర్వే చేపట్టనుంది. ముందస్తు సమాచారం లేకుండానే ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. అంతర్జాలం ఆధారంగా వచ్చిన సమాచారం మేర వాటిని నిర్ణయించనున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఏదైనా 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి వివరంగా పరిశీలిస్తారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఇతర నివాసాలను అధికారుల ఆదేశాలకు అనుగుణంగా సర్వే చేస్తారు. ఈ మేరకు గ్రామాల్లో స్వచ్ఛత పక్కాగా ఉండేలా ఉన్నతాధికారులు.. సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పారిశుధ్య సమస్య ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకునేలా తెలియ



జేస్తున్నారు.

**పురస్కారం దక్కాలంటే..**

వర్షాకాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేయాలి. తడి, పొడి చెత్త వ్యర్థాలు వేరు చేయడం, సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డులకు తరలించి సేంద్రియ ఎరువుగా మార్చే ప్రయత్నం చేయించాలి. ఇంకుడుగుంతల నిర్మాణాలు, శౌచాలయాల వినియోగంపై తరచూ స్థానికులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వచ్ఛ పురస్కారం దక్కాలంటే అయా అంశాలపై నిత్యం పర్యవేక్షణ తప్పనిసరి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న తరుణంలో, పనులు చేయలేని స్థితిలో ఉన్న పంచాయతీలపై సర్వేలో ఆశించిన ఫలితాలు కనిపిస్తాయా లేదా అన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

**నగదు ప్రోత్సాహకం ఇలా..**

ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి కేంద్రం జాతీయస్థాయి స్వచ్ఛ పురస్కారాలు ప్రకటిస్తుంది. ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులు అందిస్తుంది. రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నగదు ప్రోత్సాహకాలు ఇస్తుంది.

**ఈ అంశాలపై పరిశీలన..**

ప్రతి ఇంటా శౌచాలయం ఉందా.. ఉంటే దాని వినియోగం తీరు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా నిల్వ చేసిన వాటిని పంచాయతీ సిబ్బంది సంబంధిత ట్రాక్టర్, రిక్షాల ద్వారా కంపోస్ట్ షెడ్‌లకు తరలించే తీరు.

మురుగు నీటిని సక్రమంగా కాలువల్లోకి తరలించడం.

ఇంటింటికీ శుద్ధి నీటి సరఫరా. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యాలయాల్లో శౌచాలయాల వినియోగంపై ఆరా తీస్తారు. ఇంకుడు గుంతల నిర్వహణ.

ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు.

గ్రామ పాలనలో మహిళల భాగస్వామ్యం.

# కుట్టు.. ఉపాధికి మెట్టు

భువనగిరి : మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వ తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. డీఆర్‌డీఏ పర్యవేక్షణలో జిల్లా, మండల మహిళా సమాఖ్యల ద్వారా స్కూల్ యూనిఫామ్ కుట్టే పనులు జరుగుతున్నాయి. గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను మహిళా సంఘాల్లోని ఔత్సాహిక మహిళలతో కుట్టిస్తున్న విషయం విధితమే. దుస్తులు కుట్టగా ఛార్జీల కింద గత ఏడాది సుమారు 900 మందికిపైగా మహిళా సంఘాల సభ్యులకు రూ.75 లక్షలు సమపార్జించగా.. ఈ ఏడాది తొలి విడతగా రూ.63.26 లక్షలు ఛార్జీల కింద విడుదలయ్యాయి.

ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఈ సారి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున కూలి డబ్బులు కూడా పెరగనున్నాయి. జిల్లాలో సుమారు 920 మంది మహిళా సంఘాల సభ్యులు ఈ పనిలో నిమగ్నమయ్యారు. వీరిలో 350 మంది కట్టింగ్, దుస్తులకు ఖాజాలు, గుండీలు కుట్టడంతో పాటు దుస్తులను కూడా కుడుతున్నారు. పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులకు జతకు రూ.75, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల యూనిఫామ్ కుట్టినందుకు రూ.100 చొప్పున కూలీ ఇస్తున్నారు.

మండలానికి రెండు చొప్పున కట్టింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖాజాలు, గుండీలు కుట్టేందుకు ప్రత్యేక మిషన్లు సమకూర్చారు. కుట్టులో అనుభవం ఉన్న మహిళా సంఘాల సభ్యులు ఇళ్ల వద్దనే బాల, బాలికల దుస్తులను కుట్టి మండల సమాఖ్యలు



సంబంధిత పాఠశాలలు, గురుకులాలకు ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు. విద్యాశాఖ ఆధీనంలోని పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, టీజీఆర్ఈఐఎస్ సంస్థల విద్యార్థులకు 37,212 జతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులకు 1364 జతలు, బీసీ హాస్టల్ విద్యార్థులకు 738 జతలు కుట్టు పూర్తయి విద్యార్థులకు ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ, సంక్షేమ శాఖల జిల్లా అధికారులు ఇచ్చిన ఇండెంట్ ప్రకారం గత రెండు నెలలుగా వీరు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 79,696 జతల దుస్తులను కుట్టించి ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటికే పాఠశాలల విద్యార్థులకు 39,314 జతల దుస్తులను కుట్టి అందజేశారు.

**మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా : టి.నాగిరెడ్డి, డీఆర్‌డీవో**

మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మహిళా సమాఖ్యల ద్వారా ఈ కార్యక్రమం చేపట్టాం. సెర్ప్ సంస్థ ఆదేశాల మేరకు కుట్టులో నైపుణ్యం ఉన్న మహిళా సంఘాల సభ్యులు 920 మందిని గుర్తించి వారికి శిక్షణ ఇచ్చాం. ఇళ్ల వద్దే ఉంటూ వీటిని కుడుతూ జతకు రూ.75 సంపాదిస్తున్నారు.

# నైపుణ్యమస్తు!

ఖమ్మం : యువతలో కంప్యూటర్, కృత్రిమ మేధ నైపుణ్యాలు పెంపొందించి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచటానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వనోకరంగా అర్హతతో అధునాతన సాంకేతిక శిక్షణనిచ్చి భవితపై భరోసా కల్పిస్తోంది. పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా మార్చగా.. అందులో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల చొరవతో నాలుగు ఏటీసీలు మంజూరయ్యాయి. వీటికి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది.

**మొదటి విడత కేంద్రాల్లో ప్రవేశాలు**

కార్మిక శిక్షణ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్) భాగస్వామ్యంతో రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)లను ఏర్పాటుచేస్తున్నారు. మొదటి విడతలో ఖమ్మం, మణుగూరు, రుద్రంపూర్(కొత్తగూడెం), కృష్ణసాగర్(బూర్గంపాడు) ఐటీఐలను ఏటీసీలుగా మార్చారు. ఆయావోట్ల భవన నిర్మాణాలు పూర్తి చేసి నూతన యంత్రాలు, ఇతర పరికరాలు వచ్చాయి. వీటిని అమర్చాల్సి ఉంది. ఇప్పటికే ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో విద్యార్థులు చేరగా శిక్షణ ఇస్తున్నారు. ఏటీసీలలో పాత ఐటీఐ కోర్సులతో పాటు అదనంగా అధునాతన ఆరు కోర్సులు ఉంటాయి.

**స్థలాల అన్వేషణ**

రాష్ట్ర ప్రభుత్వం టీటీఎల్‌తో కలిసి తెలంగాణలో మరో 46 ఏటీసీలను ఏర్పాటు చేస్తోంది. వీటిలో జిల్లాకు నాలుగు కేంద్రాలు మంజూరయ్యాయి. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం, వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం తూతక్కపేట, మధిర నియోజకవర్గం సిరిపురం, సత్తుపల్లి



నియోజకవర్గం తుంబురులో ఇవి ఏర్పాటు కానున్నాయి. వీటికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఒక్కో కేంద్రానికి రూ.45.15కోట్లు వెచ్చించనుంది. స్థలాలను అధికారులు అన్వేషిస్తున్నారు. టీటీఎల్ తనవాటా కింద యంత్రాలు, సాఫ్ట్‌వేర్, టూల్స్, పరికరాలు అందించనుంది. వర్క్‌షాప్, బోరివెల్స్, మున్సిపాలిటీ నుంచి నీరు, విద్యుత్ సరఫరా, పనులు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, గ్రంథాలయం, ఫర్నిచర్, శిక్షణ, పుస్తకాలు, శానిటరీ, తదితరాలకు నిధులను ప్రభుత్వం సమకూరుస్తుంది.

**కోర్సుల వివరాలు**

ఏడాది కాలవ్యవధి

ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్

మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్

ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ)

రెండేళ్ల వ్యవధి

వర్చువల్ ఎనాలసిస్(బీటీవీవీ), డిజైనర్(ఎఫ్‌ఈఎం)

కంప్యూటర్ న్యూమరిక్ కంట్రోలర్(సీఎన్‌సీ-కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌తో పరికరాల తయారీ)

మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్(ఎంఈవీ).

ఏటీసీలుగా మారిన ఐటీఐలలో పాత కోర్సులతోపాటు కంప్యూటర్ బేస్డ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తాం. ఖమ్మం ఏటీసీలో యంత్రాలు అమర్చాల్సి ఉంది. ఇప్పటికే విద్యార్థులను చేర్చుకొని శిక్షణ ఇస్తున్నాం.

శ్రీనివాసరావు, ఐటీఐల జిల్లా కన్వీనర్

# మరమ్మతులు లేక.. విస్తరణకు నోచుకోక..



మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు రహదారి ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారింది. అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారిన దారిపై నీరు నిలవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అటు విస్తరణకు నోచుకోక, ఇటు మరమ్మతులు లేక వానాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

**రెండు జిల్లాలకు రాకపోకలు**

గతంలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు మట్టి దారి ఉండేది. పదేళ్ల కిందట సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులోని అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాల నిర్వాసితులకు పునరావాస కాలనీ ఏర్పాటు చేసింది. రూ.2 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మించింది. గతంలో ఈ రహదారిపై రోజుకు సుమారు 20 వాహనాలు నడిచేవి. ఈ మార్గంలో మంథని మండలం బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలం సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండేళ్ల కిందట ఖమ్మంపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన అందుబాటులోకి రావడంతో రోజుకు దాదాపు వెయ్యి వాహనాలు నడుస్తున్నాయి.

**విన్నపాలు బుట్టదాఖలు**

రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామస్థులకు పునరావాసం కల్పించిన సింగరేణి సంస్థ దాదాపు పదేళ్ల కిందట కాలనీ వరకు సింగిల్ రోడ్డు వేసింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టలేదు. పునరావాస కాలనీ నిర్మాణం వరకే తమ బాధ్యత అని, రహదారి మరమ్మతుతో తమకు సంబంధం లేదని సింగరేణి అధికారులు చెబుతున్నారు. మరోవైపు రహదారిని ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించకపోవడంతో మరమ్మతుకు, విస్తరణకు నోచుకోవడం లేదు. రహదారిని రెండు వరుసలుగా విస్తరించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లికి మధ్య 2 కిలోమీటర్ల దూరం ఉండగా సుమారు ఎనిమిది మలుపులున్నాయి. మలుపులు, గుంతలతో ఈ మార్గంలో వారానికి ఒక ప్రమాదం జరుగుతోంది.

**సీఆర్ఆర్ నిధులకు ప్రతిపాదనలు**

శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి

సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి వరకు రహదారి విస్తరణ కోసం సీఆర్ఆర్ నిధుల మంజూరుపై కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశముంది.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

వేముల లక్ష్మయ్య, చిన్నఓదాల

రహదారిపై మలుపులున్న చోటనే గుంతలు పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు వరుసలుగా విస్తరించడం ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. వానాకాలంలో ఈ మార్గంలో వెళ్లాలంటేనే భయమేస్తోంది.

# బాధితులకు భరోసా.. సీఈఐఆర్ అండ




గోదావరిఖని: ప్రస్తుత కాలంలో చరవాణులు ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. అలాంటిది చేతిలో ఉండాల్సిన ఫోన్ ఎవరైనా చోరీ చేస్తే.. లేదంటే ఎక్కడైనా పోతే తిరిగి దక్కించుకోవటం కష్టమే. కాని పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ పోయిన ఫోన్లు తిరిగి పొందటానికి ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో అయితే సెల్‌ఫోన్ చోరీకి గురైతే తిరిగి మళ్లీ చేతికి రావటం కష్టమే. అలాంటిది ఎత్తుకెళ్లిన వారిని వెంటనే గుర్తించి వారి నుంచి స్వాధీనం చేసుకోవడానికి పోలీసు శాఖ ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్ బాధితులకు భరోసా కల్పిస్తోంది.

**6,683 ఫిర్యాదులు**

రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పోర్టల్ ప్రారంభమైన నుంచి 6683 ఫిర్యాదులు రాగా.. 2020 పోయిన సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించారు. చోరీకి గురైనా.. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డు నంబరుతో బాధితులు వెంటనే మరో సిమ్ తీసుకోవాలి. వివరాలు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేయాలి. లేదా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు చేస్తారు. ఎవరైనా పోయిన ఫోన్‌ను వినియోగించిన వెంటనే ఎక్కడుందన్న సమాచారం పోర్టల్‌కు చేరుతోంది. ఏప్రిల్ 2023లో ఈ అప్లికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వివిధ రాష్ట్రాల పరిధిలో వచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పోలీసులు ట్రాక్ చేసి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగిస్తున్నారు. తాజాగా కమిషనరేట్ పరిధిలో 120 సెల్‌ఫోన్‌లను అప్పగించారు. దీని కోసం సీసీఎస్, ఐటీ సెల్ పోలీసు బృందాలు ప్రత్యేక దృష్టి సారించి చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

**నమోదు చేయాల్సిన వివరాలు**

ఐఎంఈఐ నంబరు

కొనుగోలు చేసిన రశీదు బిల్లు

ఏదైనా గుర్తింపు కార్డు

ప్రతి రాష్ట్రాలో ప్రత్యేక విభాగం


చోరీకి గురైన సెల్‌ఫోన్ల కోసం సీసీఎస్ పోలీసులతో పాటు ప్రతి రాష్ట్రాలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాం. బాధితులు వివరాలు అందిస్తే వాటిని అప్లికేషన్‌లో నమోదు చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లో చోరీకి గురైన ఫోన్ బ్లాక్ అవుతోంది. వేరే సిమ్‌కార్డు వినియోగించిన సమాచారం అందుతోంది.

అంబర్ కిషోర్ ఝా, రామగుండం సీపీ

# వన మహోత్సవానికి సన్నద్ధం

మెట్‌పల్లి: పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ఏటా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతోంది. ఈ సారి గ్రామాల్లో, పట్టణాల్లో లక్షల మేర మొక్కలు నాటేందుకు సమాయత్తమవుతున్నారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో జిల్లాలో 48.98 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకనుగుణంగా ఆయా శాఖలకు లక్ష్యాలను కేటాయిస్తూ కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో 380 గ్రామ పంచాయతీలు, ఐదు పురపాలికలున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ ఏర్పాటు చేసి 47,67,400 మొక్కల పెంపకం చేపట్టారు. అటవీ శాఖతో పాటు పురపాలికల్లోనూ నర్సరీల్లో మొక్కలు పెంచారు. సుమారు 76 రకాల మొక్కలను పెంచుతున్నారు. గ్రామాలు, పట్టణాల విస్తీర్ణం ఆధారంగా శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు. అవెన్యూ, కమ్యూనిటీ, కాలువలకు ఇరువైపులా, రైతుల పొలంగట్లు, ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో గుంతలు తవ్వే పనులు చేపడుతున్నారు. వర్షాలు తగినంత కురిస్తే మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే 1800 ప్రాంతాల్లో మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించారు. ఇంటింటికీ సుమారు 12 లక్షల మొక్కలు అందించేందుకు పూలు, పండ్ల రకాలకు చెందిన మొక్కలను సిద్ధం చేశారు. వన మహోత్సవాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా మొక్కలు నాటడమే కాకుండా సంరక్షణ కూడా ముఖ్యమని, అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని



పలువురు అభిప్రాయపడుతున్నారు.

**నర్సరీల్లో పెంచిన రకాలు**

జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, మామిడి, బాదం, కర్జూర, ఈత, మారేడు, ఉసిరి, చింత, సీతాఫలం, టేకు, వేప, గుల్‌మోహర్, కానుగ, కదంబ, వెదురు, సుబాబుల్, రేలా, అవిస, పొగడ, తుమ్మ, సీమచింత, శ్రీగంధం, జిట్రేగు, మందార, గులాబీ, మల్లె, అడవి తంగేడు, కరివేపాకు, స్పైడర్‌లిల్లీ, తులసి, పారిజాతం, కనకాంబరం, గన్నేరు.

# ఇక పక్కాగా డ్రైవింగ్ పరీక్షలు

ఖమ్మం : లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్నవారికి వాహన డ్రైవింగ్ పరీక్ష కఠినతరం కానుంది. రవాణాశాఖ కార్యాలయాల్లో పరీక్ష సమయంలో ఎలా పడితే అలా వాహనం నడిపితే ఇకపై లైసెన్సు ఇవ్వడం కుదరదు. రానున్న రోజుల్లో వాహన ప్రమాదాలను నియంత్రించాలనే లక్ష్యంతో పక్కాగా పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విధానంలో మార్పులు చేర్పులు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 18 రవాణాశాఖ కార్యాలయాల్లో నూతన పద్ధతిని అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. ఇందులో ఖమ్మం జిల్లా రవాణాశాఖ కార్యాలయం సైతం ఉంది. త్వరలోనే నూతన డ్రైవింగ్ విధానం అమల్లోకి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇది కార్యరూపం దాల్చితే డ్రైవింగ్ పరీక్షలు సక్రమంగా జరిగి అర్హులు మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు పొందే అవకాశం ఉంటుంది.

**నడిపించేస్తున్నారిలా..!**

జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో ప్రస్తుతం టూవీలర్, త్రీవీలర్, ఫోర్‌వీలర్ వాహనాల లైసెన్సులకు వాహనదారులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ చేసుకొని వచ్చే అధికారులు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి కౌంటర్ నంబర్ ఇస్తున్నారు. అనంతరం డ్రైవింగ్ పరీక్షకు వెళ్లాల్సి ఉంటుంది. చాలా సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు అన్నింటినీ పూర్తిస్థాయిలో నడిపే అవకాశం ఉండటం లేదు. పెద్ద వాహనం నడిపితే చిన్నవి నడపకుండానే మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు లైసెన్సులను జారీ చేస్తుంటారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైనా ట్రాక్, 8 అంకెపై నడపకపోతే లైసెన్సు మంజూరును



నిలిపివేయవచ్చు. చాలా సందర్భాల్లో ఇది జరగడం లేదు. నూతన విధానంతో దీనికి అడ్డుకట్ట పడనుంది.

**సెన్సార్ల వినియోగం**

ఇకపై డ్రైవింగ్ లైసెన్సు మంజూరు చేయాలంటే తప్పనిసరిగా సిమ్యులేటర్‌పై పరీక్ష పాస్ అవ్వాలి. ఖమ్మంలో గతంలో ఏర్పాటు చేసిన పరికరం మూలకు చేరింది. దీన్ని వినియోగంలోకి తేవాల్సి ఉంది. ఖమ్మం కార్యాలయంలో ప్రస్తుత డ్రైవింగ్ ట్రాక్ స్థానంలో అత్యాధునిక సదుపాయాలతో నూతన ట్రాక్‌ను నిర్మించేందుకు కసరత్తు చేపట్టనున్నారు. హెచ్, ఎస్, 8 ఆకారాలతో పాటు రివర్స్, ట్రాక్‌పై సక్రమంగా నడుపుతున్నారో లేదో తెలుసుకునేందుకు సీసీ కెమెరాలతో పాటు ఆధునిక సెన్సార్లను వినియోగించనున్నారు.

**త్వరలోనే అందుబాటులోకి.. : వాకదాని వెంకటరమణ, ఆర్టీఓ, ఖమ్మం**

అధునాతన ట్రాక్‌తో పాటు సిమ్యులేటర్‌పై పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సేవలు త్వరలోనే జిల్లాలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే కార్యాచరణ రూపొందించి పనులు చేపడతాం. జిల్లాలో సగటున ఒక్కరోజుకు డ్రైవింగ్ లైసెన్సులకు వచ్చే దరఖాస్తులు: సుమారు 70-80

లెర్నింగ్ లైసెన్సులు: సుమారు 60-70

# మన్యం వాసులకు మంచి రోజులు

కొత్తగూడెం : ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మన్యం వాసులకు మంచిరోజులు రానున్నాయి. ఇప్పటివరకు యూజీ వైద్యవిద్య ఉన్నచోటే పీజీ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్యకళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ కళాశాలలు నెలకొల్పాలని నిర్ణయించగా.. అందులో భద్రాచలం పట్టణానికి చోటు కల్పించింది.

**బోధనాసుపత్రిగా ఏరియా వైద్యశాల**

పీజీ కళాశాల ఏర్పాటుతో భద్రాచలంలో 200 పడకలు కలిగిన ఏరియా వైద్యశాల పీజీ కోర్సుల కోసం బోధనాసుపత్రిగా మారనుంది. స్థానికంగా అధునాతన వైద్యసదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గిరిజనులకు ఉన్నతస్థాయి వైద్యచికిత్స సులువుగా అందుతుంది. ప్రత్యేక వైద్యసదుపాయాలు(కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్ వంటివి) భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో లభ్యమవుతాయి. రోగులు ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణించాల్సిన అవసరం తగ్గుతుంది. ముఖ్యంగా పీజీ సీట్ల సంఖ్య పెరగటంతో జిల్లా యువతకు వైద్యవిద్యలో అవకాశాలు మెరుగుపడతాయి.

**జిల్లాకు మరో మణిహారమే..**

మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవలందించేందుకు వైద్యులెవరూ ఆసక్తి చూపించని ప్రస్తుత పరిస్థితుల్లో పీజీ వైద్యకళాశాల ఏర్పాటు.. వైద్యరంగం పరంగా జిల్లాకు మణిహారంగా మారనుంది. పీజీ కళాశాలలు ఎక్కువ సంఖ్యలో స్పెషలిస్టు డాక్టర్ల(ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్)ను తయారుచేస్తాయి. వీరు స్థానికంగా నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అవకాశముంటుంది. కళాశాల, బోధనాసుపత్రి ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. పీజీ కళాశాలలు వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తాయి. దీనివల్ల కొత్త చికిత్స పద్ధతులు, ఔషధాలు అభివృద్ధి చెందుతాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాపించే డెంగీ, మలేరియా, టీబీ రోగాల నివారణకు ఇవి సహాయపడతాయి.

**భద్రాచలం అభివృద్ధికి బాటలు..**

కళాశాల ఏర్పాటు కోసం రోడ్లు, విద్యుత్తు, అంతర్జాల సేవల వంటి మౌలిక సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాల కేంద్రాలు (వసతిగృహాలు, దుకాణాలు) పెరుగుతాయి. ఇవి స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. గిరిజన సమాజం ఆధునిక వైద్యవిద్య, సేవల్లో ఏకీకృతమవుతుంది. గిరిజన సంస్కృతికి గౌరవం లభిస్తుంది. పేద గిరిజనులకు ఆధునిక వైద్యం ఉచితంగా అందుతుంది.

భద్రాచలంలో పీజీ వైద్యకళాశాల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. వైద్యకళాశాల ఏర్పాటైతే వైద్యపరంగా జిల్లావాసులకు మంచిరోజులు వచ్చినట్లే. వివిధ విభాగాల్లో విద్యావిషయాలు, సేవలు ఉండటం వల్ల ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. డా.ఎం.రామకృష్ణ, సూపరింటెండెంట్, భద్రాచలం ఏరియా ఆసుపత్రి

# సొమ్ము మాయం.. రికవరీ గగనం

హుజూరాబాద్ : ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ప్రయాణం చేద్దామనుకుంటే జంకుతున్నారు. ఎప్పుడు ఎవరింట్లో దొంగతనం జరుగుతుందో తెలియని పరిస్థితి. డివిజన్ పరిధిలోని శంకరపట్నం, హుజూరాబాద్, వీణవంక, జమ్మికుంటతో పాటు పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. మార్చి 23న శంకరపట్నం మండలం లింగాపూర్‌లో తొమ్మిది ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పోలీసులు వెళ్లి సంఘటన జరిగిన ఇళ్లను పోలీసులు పరిశీలించి పలు వివరాలు సేకరించినా నేటికి ఆ దొంగలను గుర్తించనేలేదు.

ఒక్కరినీ పట్టుకోలేదు

హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు దొంగలు సవాల్‌గా మారుతున్నారు. ఆయా ఠాణాల పరిధిలోని బ్లూకోల్ట్స్ పోలీసులు ప్రతినిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా దొంగలు మాత్రం చిక్కటం లేదు. హుజూరాబాద్ మండలం కందుగుల శివారులోని కాకతీయ ప్రధాన కాలువలోకి కందుగుల, చిన్నపాపయ్యపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు మోటార్లు పెట్టుకోగా ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 15 మోటార్లను పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. వీణవంక మండలం గున్నుకుల ఆదర్శ పాఠశాలలో మూడు కంప్యూటర్లను చోరీ చేశారు.

మే 24న కేశవపట్నం పోలీసు స్టేషన్ కూతవేటు దూరంలో



కె.శ్రీనివాస్‌కు చెందిన దుకాణంలో చోరీ జరిగింది.

మే 19న కేశవపట్నం ఎస్సీ, బీసీ కాలనీకి చెందిన పరమేష్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. రూ.80 వేలు అపహరించారు.మే 14న జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో వెంకటలక్ష్మి అనే వృద్ధురాలి మెడలో నుంచి బంగారు ఆభరణాన్ని లాక్కెల్లాడు.మే 12న జమ్మికుంట మడిపల్లి రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

మే 1న కేశవటపట్నం ప్రధాన రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించారు.

ఏప్రిల్ 18న కేశవపట్నం శివారులోని సైదాపూర్ అడ్డదారి సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణంలో రూ.60వేలతో పాటు సీసీ కెమెరాల డీవీసీని ఎత్తుకెళ్లారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం


దొంగతనాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. గతంలో జరిగిన దొంగతనాలపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నాం. సబ్ డివిజన్ పరిధిలో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తాం.

వి.మాధవి, ఏసీపీ, హుజూరాబాద్

# 'నై'జీరియన్లు

హైదరాబాద్: తప్పు చేసినా, చేయకపోయినా.. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైతే భయపడిపోతాం. ఉద్యోగ నియామకాల్లో ఇబ్బందులు, శిక్షలు, జరిమానాలకు తోడు అది తేలేవరకు ఠాణా, కోర్టు విచారణ తదితర కారణాలతో కేసులంటేనే వణికిపోతారు. కానీ నగరంలో అక్రమంగా ఉంటున్న నైజీరియన్లు మాత్రం ఉద్దేశపూర్వకంగా నిందితులుగా మారుతున్నారు. డీపోర్టేషన్(సొంత దేశానికి తిప్పి పంపడం) నుంచి తప్పించుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. భారత చట్టాల ప్రకారం విదేశీయులు ఏదైనా కేసులో నిందితులుగా ఉంటే అది తేలేంతవరకు స్వదేశానికి వెళ్లడానికి అవకాశం ఉండదు.

**చదువు కోసం వచ్చి అడ్డదారులు** మూడు కమిషనరేట్ల పరిధిలో సుమారు 3,435 మంది నైజీరియా, ఘనా, ఉగాండా, ఐవరీకోస్ట్, టాంజానియా, సూడాన్ తదితర దేశస్థులుంటున్నారు. నగరానికి వచ్చే



ఆఫ్రికా దేశస్థుల్లో ఎక్కువ మంది నైజీరియన్లే. పారామౌంట్‌కాలనీ, బండ్లగూడ జాగీర్, టోలిచౌకి, బంజారాహిల్స్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో వీరు ఎక్కువగా ఉంటున్నారు. విద్య, ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి డబ్బు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలో డ్రగ్స్ ఎప్పుడు పట్టుబడ్డ అందులో ప్రత్యక్షంగా, పరోక్షంగా నైజీరియన్ల పాత్ర ఉంటోంది. డ్రగ్స్‌తో పాటు వ్యభిచారం, సైబర్ నేరాలు, తాంత్రిక పూజల(బ్లాక్ మ్యాజిక్)తో కరెన్సీ తయారీ పేరుతో మోసాలు చేస్తున్నారు. ఇటీవల వీరి ఆగడాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. వీసా గడువు ముగిసినా వెళ్లని వారెందరో లెక్కలు తీయగా వందల మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించారు. డిగ్రీ, పీజీ కోర్సుల కోసమంటూ ఇక్కడికొచ్చినా ఉద్దేశపూర్వకంగా వాటిని పూర్తి చేయకుం డానే వదిలేస్తున్నారు. ఇంకొందరు గోవా, బెంగళూరులకు వెళ్లి డ్రగ్స్ ఏజెంట్లుగా స్థిరపడుతున్నారు. ఇలాంటి వారిని గుర్తించిన హైదరాబాద్ పోలీసులు డీపోర్టేషన్ చేస్తున్నారు. దీన్నుంచి తప్పించుకోవడానికి స్థానికంగా యువతుల్ని పెళ్లాడి మోసగించడం, గృహహింస, దాడులు వంటి నేరాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు వచ్చినప్పుడు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సగటున ఒక్కో విదేశీయుడిని తిప్పి పంపాలంటే రూ.5 లక్షల వరకూ ఖర్చవుతోందని పోలీసులు చెబుతున్నారు.

# జాగ్రత్త.. కూలుతాయ్ జీవితాలు



హైదరాబాద్: నగరంలో పాత భవనాలు దడ పుట్టిస్తున్నాయి. వానలొస్తే చాలు అవి యమపాశంలా మారుతున్నాయి. పైకప్పులు, గోడలు, ప్రహరీలు కూలిపోయి చిన్నారులు, వృద్ధులు మృతి చెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు ముందే మొదలవ్వడంతో నిజాం కాలం నాటి పురాతన భవనాలు, పాత వాంబే గృహ సముదాయాలు, హౌసింగ్ బోర్డు కాలనీలు, గ్రామాల్లో మట్టి ఇళ్ల విషయంలో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు శిథిల భవనాల సర్వే పేరుతో జీహెచ్‌ఎంసీ అధికారులు కాలక్షేపం చేస్తున్నారు. తాజాగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు నోటికొచ్చిన లెక్కలు చెప్పి తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారు. ఇలాగైతే ప్రమాదాలను అడ్డుకోవడంలో జీహెచ్‌ఎంసీ ఈ ఏడాదీ విఫలమవుతుందనే విమర్శలొస్తున్నాయి.

**మొక్కుబడిగా నోటీసులు**

చార్మినార్, శాలిబండ, చాంద్రాయణగుట్ట, బార్కస్, సంతోష్‌నగర్, బహదూర్‌పుర తదితర ప్రాంతాల్లో నిజాం కాలం నాటి వందలాది ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్నాయి. ఏటా వర్షాకాలం ముందు ఆయా ఇళ్లకు హెచ్చరిక బోర్డులు తగిలించడం, నోటీసులిచ్చి చేతులు దులుపుకోవడం టౌన్ ప్లానింగ్ అధికారులకు అలవాటుగా మారింది. కాలనీల్లోకి వెళ్లి ప్రమాదాలను అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమవుతోందనే మాటలు వినిపిస్తున్నాయి.

**ఆయా ప్రాంతాల్లోనే అధికం..**

బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఇమ్లిబన్, కోఠి, సికింద్రాబాద్, కార్వాన్, మెహిదీపట్నం, గోల్కొండ, బోరబండ తదితర ప్రాంతాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు వందలాదిగా ఉన్నాయి. బలహీనంగా ఉండే నిర్మాణాలు సుమారు 10వేలు ఉండొచ్చని అంచనా. జీహెచ్‌ఎంసీ మాత్రం ఏటా సర్వేలో 500 నుంచి 600 భవనాలను గుర్తించి మమ అనిపిస్తోంది.

**పలు ఘటనలు**

జులై 20, 2019న సికింద్రాబాద్ చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ వర్షానికి ఇంటి పైకప్పు కూలింది. ఈ ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది.జులై 26, 2020న మెహిదీపట్నం మాంగార్‌బస్తీలోని ఓ శిథిల భవనం గోడ కూలి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మరణాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.వాంబే, ఇందిరమ్మ గృహాలు, హౌసింగ్ బోర్డు కాలనీల్లో..మెహిదీపట్నంలోని మాంగార్‌బస్తీలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన 200ల వాంబే గృహాలు ప్రమాదకరంగా మారాయి. 80శాతం మేర స్లాబులు, కారిడార్లు పెచ్చులూడాయి. అధికారులు అక్కడి వారిని ఇళ్లు ఖాళీ చేయాలని చెబుతున్నారు. పాతవి కూల్చి అక్కడే పక్కా ఇళ్లను కట్టిస్తామని రాతపూర్వక హామీ ఇస్తేనే కదులుతామని నివాసితులు చెబుతున్నారు.

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ, కైత్లాపూర్ వాంబే, రాజీవ్ గృహకల్ప ఇళ్లు, అదే రకానికి చెందిన జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, బాచుపల్లి ప్రాంతాల్లోని ఇళ్లు కూడా శిథిలావస్థలో ఉన్నాయి. ఎప్పుడైనా కూలిపోవచ్చని తెలిసినప్పటికీ అందులోనే నివాసం ఉంటున్నారు.

కార్యాలయం పైకప్పు కూలి ఆబ్కారీ కానిస్టేబుల్‌కు గాయాలు

షాద్‌నగర్‌లోని ఆబ్కారీ కార్యాలయం పైకప్పు ముందు భాగం ఉన్నట్టుండి కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వర్షాల కారణంగానే శిథిలావస్థలోని భవనం పైకప్పు కూలిపోయినట్లు భావిస్తున్నారు. గాయపడిన కానిస్టేబుల్‌కు స్థానికంగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు.

# యువ వికాసం.. ఎందరికో అవకాశం




బొంరాస్‌పేట: యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసానికి నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ 14 వరకు జిల్లావ్యాప్తంగా 50,197 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వాటిని ఆయా మండలాల అధికారులు పరిశీలించారు.

**ఎంపిక కమిటీ ఏర్పాటు..**

లబ్ధిదారుల ఎంపికకు మండల ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా.. ఎంపీడీవో, బ్యాంకు మేనేజరు, కార్పొరేషన్ అధికారితో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిబిల్ స్కోరు మెరుగ్గా ఉన్నవారిని ఎంపిక చేసి దరఖాస్తులను జిల్లాకు పంపించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొంతమందికి ఆర్థిక సాయం మంజూరు చేస్తారని భావిస్తున్నారు. గత భారాస ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ప్రస్తుతం సిబిల్ స్కోరు ఆధారంగా ఎంపిక చేయనుండడంతో అవకాశం ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ నిరుద్యోగుల్లో నెలకొంది.

**రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు..**

ఈ పథకం కింద ఎంపికైన వారికి రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలిస్తారు. ఇందులో బ్యాంకు రుణం కొంత, మిగిలింది వివిధ కార్పొరేషన్లు రాయితీగా అందిస్తాయి. యువత నచ్చిన యూనిట్లు నెలకొల్పి జీవనోపాధి పొందాలి. రూ.50 వేల యూనిట్‌కు కార్పొరేషన్లు పూర్తి రాయితీ ఇస్తున్నాయి. రూ.లక్షలోపు రుణం తీసుకుంటే 80 శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు తీసుకుంటే 70 శాతం, రూ.4 లక్షలు తీసుకుంటే 60 శాతం రాయితీ వర్తిస్తుంది. మిగతాది బ్యాంకు రుణం. బ్యాంకు రుణం ఇచ్చేందుకు ఒప్పుకుంటేనే పథకం మంజూరవుతుంది. వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా బీసీలవే ఉన్నాయి.

**సెప్టెంబరు వరకు కొనసాగనున్న ప్రక్రియ..**

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సెప్టెంబరు వరకు కొనసాగనుంది. జూన్‌లో రూ.లక్షలోపు రుణాలు ఇవ్వనున్నారు. జులైలో రూ.2 లక్షలు, ఆగస్టులో రూ.3 లక్షలు, సెప్టెంబరులో రూ.4 లక్షల రుణాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యూనిట్లను మార్చుకోవడానికి ప్రభుత్వం అభ్యర్థులకు అవకాశమిచ్చింది. గతంలో నిరుద్యోగులకు ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను మంజూరు చేసినా బ్యాంకులు ఇవ్వలేదు. దీంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు. ఇప్పుడు ఎంపికైన అభ్యర్థులందరికీ సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

# అందుబాటులో నాణ్యమైన విద్య

సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాగా అవతరించిన తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కావాల్సిన వసతులు, సౌకర్యాలు కల్పిస్తుండటంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు ప్రయోగశాలలు, విశాలమైన ఆట స్థలాలు, తరగతి గదులు, కంప్యూటర్ విద్యాబోధన అందుబాటులో ఉన్నాయి. ఓ వైపు ఇంటర్ తరగతులు నిర్వహిస్తూనే.. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులపై విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శనం చేస్తున్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు.

**అన్నింటికీ సొంత భవనాలు**

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అన్నింటికీ సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటల్లో పురాతన భవనాలు ఉండగా.. అవి శిథిలావస్థకు చేరాయి. కోనరావుపేట, చందుర్తిలలో ప్రహరీలు లేవు. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్(వృత్తివిద్య) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో 13,000, ద్వితీయలో 980 మంది చదువుకున్నారు. ప్రథమంలో 51 శాతం, ద్వితీయంలో 52 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2025-26 నూతన విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో దాదాపు 400 మంది విద్యార్థులు చేరినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 10

ప్రభుత్వ అధ్యాపకులు 93

ఒప్పంద 7



అతిథి 8

**గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతంలో పోలిస్తే ఇప్పుడు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కోర్సులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. నాణ్యమైన విద్యతోపాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. కోనరావుపేట, చందుర్తి కళాశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు సమకూరిన తరువాత గోడ నిర్మిస్తాం. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలి.శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

# స్వచ్ఛతకు 'వంద'నం

కరీంనగర్ : పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం.. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సామర్థ్యం కల్పించే దిశగా పురపాలక శాఖ అన్ని నగరాలు, పట్టణాల్లో వంద రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ప్రతి రోజు 'ఒక చర్య.. ఒక మార్పు' అనే నినాదంతో ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు 50 అంశాలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**వ్యర్థాల వేరుపై ప్రచారం**

రద్దీ ప్రాంతాల్లో, నివాస గృహాల్లో పరిసరాల పరిశుభ్రతపై మైక్ ద్వారా ప్రచారం.వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు.

తడి, పొడి చెత్తను వేరు చేసేలా అవగాహన కల్పించడం.

పరిసరాల శుభ్రతపై ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించడం.

వేస్ట్ ఆడిట్ నిర్వహించడం.

ఇంటింటికీ అవగాహన

చెత్తను వేరు చేయడం, పరిశుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించడం.

స్వశక్తి సంఘాలు, ఎన్‌జీవోలు, ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను భాగస్వాములను చేయడం.

బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయడం.

గోడ చిత్రాలు

పరిశుభ్రత, చెత్త నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రతపై గోడ చిత్రాలు రాయించడం.

అభివృద్ధి పనులకు సంబంధించిన బొమ్మలను ఆకట్టుకునేలా గీయించడం.

స్వచ్ఛతపై క్విజ్, పెయింటింగ్, రచన, రంగోలి కార్యక్రమాల నిర్వహణ.

జూన్ 2.. కార్యాచరణ ప్రారంభం

సిబ్బందికి, వాలంటీర్లకు శిక్షణ, ర్యాలీలు, ప్రతిజ్ఞ నిర్వహణ, ప్రచార వ్యూహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.

అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, నోడల్ అధికారుల నియామకం.

**పూడికతీత పనులు**

వర్షం నీరు సక్రమంగా ప్రవహించేలా రహదారులపై చెత్తా చెదారం



తొలగింపు.వరద కాలువల్లోని పూడికను తొలగించడం.

పారిశుద్ధ్య కార్మికులు, యంత్రాలు, పరికరాలు సమకూర్చుకోవడం.

దోమల నియంత్రణ డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం.

నిల్వ నీటిలో దోమల లార్వా పెరగకుండా ఆయిల్ బాల్స్, గంబూసియా చేప పిల్లలను వదలడం.

సులభ్ కాంప్లెక్స్‌ల తనిఖీ

నగరాలు, పట్టణాల్లోని సులభ్ కాంప్లెక్స్‌ల తనిఖీ. శుభ్రతపై పర్యవేక్షణ. నిర్వహణ, వినియోగంపై అభిప్రాయాల సేకరణ.

కంపోస్టు ఎరువు తయారీ

తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీపై అవగాహన కల్పించడం.

చెత్తను వేరు చేసే డబ్బాల పంపిణీ.

డంపింగ్‌యార్డుకు చెత్త తగ్గించేలా చూడటం.

పాఠశాలలో కంపోస్టు యూనిట్ ఏర్పాటు.

బర్తన్ బ్యాంకులు

ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ సామగ్రి వినియోగం తగ్గించేందుకు బర్తన్(స్టీల్ పాత్రల) బ్యాంకుల ఏర్పాటు.

కరీంనగర్ నగరపాలికలో స్వశక్తి సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న ఈ బ్యాంకుల ద్వారా ప్రతి వేడుకలో ఉక్కు, గాజు, స్టీలు పాత్రలు వాడేలా ప్రచారం చేయడం.

# అధికారుల అలసత్వం.. పూడికపై నిర్లక్ష్యం

గోదావరిఖని : ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించింది. త్వరలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముందస్తుగానే నగరాలు, పట్టణాల్లోని వరదకాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. వరద, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త వరద ప్రవాహానికి అడ్డుపడటంతో సమీప ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఈ నేపథ్యంలో నగర, పురపాలక అధికారులు స్పందించి ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తేనే ఆయా ప్రాంతాల్లో వరద ముంపు తప్పే అవకాశముంది.

**ముందు చూపుతోనే నివారణ**

రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనుల కోసం టెండర్లు నిర్వహించగా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో తాజాగా మరోసారి పిలిచారు. దీంతో మురుగు కాలువల నిర్వహణ ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం అత్యవసరమైన చోట మాత్రం పూడిక తీస్తున్నారు.గోదావరిఖనిలోని 2ఎ వంతెన, ఫైవింక్లయిన్ వంతెన, కళ్యాన్‌నగర్‌లోని ఉల్లిగడ్డల బజారు, సంజయ్‌గాంధీనగర్, శాంతినగర్, ప్రశాంత్‌నగర్, రామగుండంలోని పాత అంగడి బజారు ప్రాంతాల్లో వరదలు ముంచెత్తే ప్రమాదముంది. గోదావరిఖనిలోని బి.ఎస్.ఎన్.ఎల్. క్వార్టర్లు, మైదానంలోని వర్షం నీరు బయటకు వెళ్లేందుకు సరైన వ్యవస్థ లేక క్వార్టర్లు జలమయమవుతాయి. పెద్దపల్లి నుంచి కరీంనగర్ ప్రధాన రహదారిలో ఆర్టీవో కార్యాలయం వద్ద వరద రాజీవ్ రహదారిని ముంచెత్తుతుంది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సి వస్తుంది. మంథనిలో ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత పనులను దాదాపు పూర్తిచేయగా 100 రోజుల ప్రణాళికలో మిగతా ప్రాంతాల్లోని అంతర్గత, ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వర్షం కురిసిందంటే చాలు సుల్తానాబాద్‌లోని స్వప్న కాలనీ జలమయమవుతుంది. ఈ ప్రాంతంలోని వరద, మురుగు కాలువల్లో పూడికను ఇటీవలే పురపాలిక తొలగించింది. మిగతా ప్రాంతాల్లోని వరద, మురుగు కాలువల్లో పూడికతీత పనులను చేపడుతున్నారు.

వరదకాలువల వివరాలు

రామగుండం 32.5 కి.మీ

సుల్తానాబాద్ 15.0 కి.మీ

మంథని 12.5 కి.మీ

పెద్దపల్లి 4.5 కి.మీ

## మసూరి బియ్యం.. వ్యాపారి మస్కా

నంద్యాల : మసూరి బియ్యం తరలింపులో వ్యాపారులు మార్కెటింగ్ శాఖకు మస్కా కొడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగయ్యే కర్నూలు సోనా, నంద్యాల మసూరి బియ్యానికి ఎంతో ఆదరణ ఉంది.. సన్నగా ఉండే ఈ బియ్యం నాణ్యతగా.. రుచికరంగా ఉంటాయని పేరుంది. విదేశాల్లోనూ డిమాండ్ ఉంటోంది. దీంతో వ్యాపారులు ఇక్కడ బియ్యం కొనుగోలు చేసి విదేశాలకు రవాణా చేస్తున్నారు. తుంగభద్ర దిగువ, గాజులదిన్నె, కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, హంద్రీనీవా కింద కర్నూలు, నంద్యాల సోనా రకాలు 2.07 లక్షల హెక్టార్లలో సాగు చేస్తుంటారు. కోతల సమయంలోనే ధాన్యాన్ని వ్యాపారులు కల్లాల వద్దకొచ్చి కొనుగోలు చేస్తారు. వీటిని మిల్లులకు తరలించి బియ్యంగా మారుస్తున్నారు. తర్వాత ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**సుంకాలు ఎగ్గొట్టి తరలింపు**

నిబంధనల ప్రకారం వరి ధాన్యం రవాణాకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. మార్కెట్ చెక్‌పోస్టుల వద్ద మాత్రం 2 శాతం పన్ను చెల్లించాలి. లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కుల్లో వేల క్వింటాళ్ల ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా మార్కెట్



కమిటీలకు సమకూరుతున్న ఆదాయం అంతంతమాత్రమే. ప్రత్యేకించి నంద్యాల జిల్లా మీదుగానే ఈ అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచీ తరలుతుండటం గమనార్హం. ఈ విషయాన్ని అధికారులు ఇటీవల గుర్తించారు. చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టి సెస్సు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

**రైతు పేరుతో దగా** నిబంధనల ప్రకారం బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలంటే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలి. వ్యాపారులు 20 శాతం మేర అధికారిక అనుమతులు తీసుకుని.. 80 శాతం అక్రమంగా తరలిస్తున్నారు. కేవలం వివరాలు చూపేందుకు మాత్రమే కొంత బియ్యానికి అధికారిక అనుమతులు తీసుకుంటున్నారు. వివిధ చెక్‌పోస్టుల వద్ద తనిఖీల సమయంలో సిబ్బందికి ఎంతోకొంత ముట్టజెప్పి అక్రమంగా రవాణా చేస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద మాన్యువల్ తనిఖీలే ఉండడం అక్రమార్కులకు కలసివస్తోంది. నంద్యాల జిల్లాలో 22, కర్నూలు జిల్లాలోని 16 చెక్‌పోస్టులు ఉన్నాయి. బియ్యం పెద్దఎత్తున అక్రమ రవాణా జరుగుతున్నా పట్టుకుని కేసులు నమోదు చేయడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

కర్నూలు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో సేకరించిన మసూరి బియ్యాన్ని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా దోర్నాల, మార్కాపురం, బద్వేలు మీదుగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం ఓడరేవుకు తరలిస్తున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి మీదుగా చెన్నై ఓడరేవుకు తరలించి అక్కడినుంచి విదేశాలకు తీసుకెళ్తున్నారు. మరికొంత సరకును నంద్యాల-ఒంగోలు రహదారి మీదుగా గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ ఓడరేవుకు తరలిస్తున్నారు.

**అంతా వారి కనుసన్నల్లోనే**

ఉమ్మడి జిల్లాలో సుమారు 20 మంది బడా బియ్యం వ్యాపారులు ఉన్నారు. నంద్యాలకు చెందిన ఆరుగురు, ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరుకు చెందిన కొందరు అక్రమ వ్యాపారాల్లో ఆరితేరారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రైసుమిల్లుల్లో మర పట్టించి బియ్యం నిల్వ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని ఓడరేవులకు తరలిస్తున్నారు. బియ్యం వ్యాపారం పేరుతో వీరు అక్రమ రవాణా చేస్తున్నారు. వీరి ఆధ్వర్యంలోనే కొన్ని రైస్‌మిల్లులు

## శనివారమొస్తే సెలవే!

యర్రగొండపాలెం : వై.పాలెం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ కోసం గిరిజన విద్యార్థులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అటవీ ప్రాంతాల నుంచి కష్టపడి వస్తే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆవేదనతో వారు వెనుదిరుగుతున్నారు. యర్రగొండపాలెం తహసీల్దారు కార్యాలయానికి శనివారం వెంకటాద్రిపాలెం పంచాయతీ లోని అంకమ్మ చెంచుగూడేనికి చెందిన విద్యార్థి చెంచు గిరిజన బాలిక కుడుముల బుజ్జమ్మ బంధువును తోడు తీసుకొని వచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులు చిన్నతనంలో క్షయతో చనిపోయారు. సోదరుడు మద్యానికి బానిసగా మారడంతో గూడేనికి చెందిన రమణమ్మ అనే మహిళ బాలికను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదువుకు తోడ్పడుతోంది. ఇటీవల బుజ్జమ్మ ఇంటర్ పూర్తి చేసింది. చదువుకునే చెంచు గిరిజనుల పిల్లలకు ఆర్డీటీ సంస్థ సహకారం అందిస్తోంది.



ఈ విధంగానే ఈ బాలికకు 1వ తరగతి నుంచి ప్రతి ఏడాది చదువు కోసం ఆర్డీటీ సంస్థ బాలిక అకౌంట్‌లో కొంత నగదు జమ చేస్తోంది. ఈ విధంగా సమకూరిన రూ.15,000లను డ్రా చేసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో చేరేందుకు బాలిక సిద్ధమైంది. అయితే ఆ నగదు తీసుకోవాలంటే ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్‌ను అవసరమని ఆర్డీటీ వారు తెలియజేయడంతో ఆ సర్టిఫికెట్ కోసం నెల రోజుల కిందట వెంకటాద్రిపాలెం సచివాలయంలో బుజ్జమ్మ దరఖాస్తు చేసుకుంది.. దీనిపై వీఆర్వో సంతకం చేయాలి. అప్పటి నుంచి దీనిపై సంతకం చేయాల్సిన వీఆర్వో చెన్నయ్య వారికి చిక్కడం లేదు. నెల నుంచి తాము సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పోతున్నామని బుజమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చామని, ఎవరూ లేకపోవడంతో వెళ్లిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ విషయంపై తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డికి ఫోన్ చేయగా ఆయన వెంటనే వీఆర్వో చెన్నయ్యకు చెప్పి చెక్ స్లిప్ మీద సంతకం చేయించి సర్టిఫికెట్‌ను అందజేస్తామని తెలియజేశారు.

## అటు చూడరు.. బెల్టు తీయరు!



అనంతపురం : అనంతపురంలోని అశోక్‌నగర్, రాంనగర్, పాతూరు, గుత్తిరోడ్డు, బళ్లారి బైపాస్ ప్రాంతాల్లో వైన్‌షాపుల నిర్వాహకులు అనధికార పర్మిట్ రూంలు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే తాగేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అనుమతులు లేకుండానే ప్రతి వైన్ షాపు వద్ద ఓ మినీ బార్ నిర్వహిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో మందుబాబులు స్వైరవిహారం చేస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, శెట్టూరుతో పాటు కళ్యాణదుర్గంలో బెల్టుషాపులు వెలిశాయి. ఆయా గొలుసు దుకాణాల్లో కర్ణాటక మద్యం సైతం విక్రయిస్తున్నారు. రాయదుర్గం ప్రాంతంలో స్థానిక నాయకుల కనుసన్నల్లో బెల్టుషాపులు నడుస్తున్నాయి.

కూడేరు మండలంలో వైన్‌షాపు నిర్వాహకులే ప్రతి గ్రామంలో ఒకరిని ఏర్పాటు చేసుకుని బెల్టుషాపులు నడుపుతున్నారు.ఏరోజుకు ఆరోజు అమ్మకాలను బట్టి వసూలు చేసుకుంటున్నారు.

పల్లెల్లో బెల్టుషాపుల దందా సాగుతోంది. మారుమూల ప్రాంతాల్లోనూ గొలుసు దుకాణాలు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. గ్రామాల్లోనే మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యానికి బానిసవుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి దోపిడి చేస్తున్నారు. సమయాన్ని బట్టి ఒక్కో సీసాకు రూ.30 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో స్థానిక నాయకుల అండతోనే గ్రామానికి ఒకరు చొప్పున బెల్టుషాపు ఏర్పాటు చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**వైన్‌షాపులకు అనుబంధంగా..**

మండల కేంద్రాల్లో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటైన మద్యం దుకాణాలకు అనుబంధంగా ప్రతి గ్రామంలో బెల్టుషాపులు వెలిశాయి. ఒక్కో వైన్‌షాపు పరిధిలో 10 నుంచి 25 వరకు గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్‌శాఖ నిద్ర నటిస్తోంది. మొదట్లో తనిఖీల పేరుతో హడావుడి చేసిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు.. అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అడపాదడపా పట్టుకున్నా రాజకీయ ఒత్తిళ్లతో కేసులు కట్టకుండా వదిలేస్తున్నారు.

**కిరాణా దుకాణాల్లోనే..**

గ్రామాల్లో పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. వైన్‌షాపుల నుంచి నిత్యం ఆటోలు, బైకుల ద్వారా మద్యం సీసాలు తెప్పించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టుషాపుల వద్దే ప్రత్యేకంగా గుడిసెలు ఏర్పాటు చేసి అక్కడే తాగేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పల్లెల్లో రాత్రి వేళల్లోనూ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

## షిప్‌యార్డు నూతన సీఎండీ ఎవరో?!




సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నియామక ప్రక్రియ పూర్తికాలేదు. సంస్థ సీఎండీగా ప్రస్తుతం కమొడోర్ హేమంత్‌ఖత్రీ వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీ కాలం వచ్చే నెలాఖరు వరకు ఉంది. కేంద్ర ప్రభుత్వ కంపెనీ నిబంధనల ప్రకారం ఆర్నెల్ల కిందటే కొత్త నియామక నోటిఫికేషన్ వెలువడింది. దేశవ్యాప్తంగా పలు కంపెనీల నుంచే కాకుండా భారత నౌకాదళంలో అధికారులుగా పనిచేసిన పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

ఇటీవల నియామక బోర్డు ఇంటర్వ్యూలను ఇప్పటికే నిర్వహించింది. తుది జాబితాలో 12 మందికి చోటు దక్కింది. వీరిలో ఇద్దరు భారత నేవీకి చెందిన అధికారులు కూడా ఉండటం విశేషం. ప్రస్తుతం సీఎండీగా ఉన్న కమొడోర్ హేమంత్ ఖత్రీ కూడా షిప్‌యార్డుకి తొలుత వ్యూహాత్మక ప్లానింగ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత సీఎండీగా నియమితులయ్యారు. ఇప్పటికీ కొత్త సీఎండీ ఎవరనేది తేల్చకపోవడం ఒకింత ఊహాగానాలకు తెరలేపుతోంది. ప్రస్తుత సీఎండీ హేమంత్ ఖత్రీనే మరో రెండేళ్లపాటు పొడిగించే అవకాశాలు లేకపోలేదని ఉద్యోగవర్గాల్లో చర్చసాగుతోంది.

**సాగర తీరాన సరికొత్త లోకం**

నగర పర్యాటకంలో కైలాసగిరి కీలకపాత్ర పోషిస్తోంది. ఇక్కడికి నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వారిని అలరించడానికి గతంలో తెదేపా హయాంలో రోప్‌వే అందుబాటులోకి తెచ్చారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు కైలాసగిరిని పట్టించుకోలేదు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా ఏర్పాటు కాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తోంది. ఇటీవల వీఎంఆర్డీఏ స్కై సైక్లింగ్, జిప్‌లైనర్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు పర్యాటకులను మరింత ఆకర్షించడానికి తేలియాడే గాజు వంతెనకు శ్రీకారం చుట్టింది.

**రూ.6కోట్ల వ్యయంతో:** కైలాసగిరిపై గతంలో టైటానిక్ వ్యూ పాయింట్ ఉండేది. అక్కడి నుంచి చూస్తే సముద్రం అద్భుతంగా కనిపిస్తుంది. ఈ దృశ్యాన్ని చూడటానికే ఇక్కడికి పర్యాటకులు వచ్చేవారు. తర్వాత అది శిథిలమైంది. ప్రస్తుతం దాని స్థానంలో తేలియాడే గాజువంతెన నిర్మిస్తున్నారు. దీనికి రూ.6కోట్లు వెచ్చిస్తున్నారు. వంతెన పొడవు 50 మీటర్లు ఉంటుంది. ఒకేసారి 40మంది వరకు ఎక్కవచ్చు. ప్రస్తుతం 70 శాతం పనులు పూర్తయ్యాయి. జులై నెలాఖరుకు అందుబాటులోకి వస్తుందని వీఎంఆర్డీఏ అధికారులు చెబుతున్నారు.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు: పశ్చిమబెంగాల్, ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు స్కైసైక్లింగ్, జిప్‌లైనర్, రోప్‌వే, అద్దాల ఏసీ రైలుబండికి ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. వీటి ద్వారా వీఎంఆర్డీఏకు ఆదాయం కూడా సమకూరుతోంది. ఇప్పుడు కొత్తగా గాజు వంతెన ఏర్పాటైతే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.

**రాష్ట్రంలో తొలిసారి:** తేలియాడే గాజు వంతెన దక్షిణ భారతదేశంలో కేరళ రాష్ట్రంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విశాఖ నగరంలో ఏర్పాటు చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే దేశంలోనే అతి పొడవైన గాజు వంతెనగా పేరు పొందుతుంది. దీనిపైకి ఎక్కిచూస్తే చుట్టూ ఎత్తయిన కొండలు, కింది భాగంలో లోయ, కనుచూపు మేరలో సాగరం కనిపిస్తాయి. గాల్లో తేలియాడుతున్నట్లు, కొత్త లోకంలో విహరిస్తున్న భావన పర్యాటకులకు కలుగుతుందని అధికారులు చెబుతున్నారు.

**జులై నెలాఖరుకు అందుబాటులోకి:** ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గత ఏడాది నవంబరులో ప్రారంభమైంది. ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురావాలని అనుకున్నాం. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పనులకు అంతరాయం కలిగింది. వర్షాలతో ఆటంకం కలగకుంటే జులై నెలాఖరుకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ఈ మేరకు నిర్మాణం చేస్తున్న ప్రైవేటు సంస్థతో చర్చిస్తున్నాం. పర్యాటకుల నుంచి వసూలు చేసే రుసుములో 45శాతం వీఎంఆర్డీఏకు వస్తుంది.

బలరామరాజు, ఎస్ఈ, వీఎంఆర్డీఏ

## కదలక.. మెదలక

కోట : డాలర్ల పంట రొయ్య.. సాగుదారులకు నష్టాలు మిగులుస్తోంది. అమెరికా సుంకాల దెబ్బకు కుదేలై కొంతకాలం ఇబ్బందులు పడ్డారు. పరిస్థితులు కుదుటపడి ధరలు పెరగడంతో ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో తెల్లమచ్చ వ్యాధితో నష్టపోతున్నారు. జిల్లా పరిధిలోని కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల్లో ఆరువేల హెక్టార్లలో రొయ్యలు సాగు చేస్తున్నారు. అనధికారికంగా మరో ఐదు వేల హెక్టార్లలో సాగు ఉంది. ఎకరా సాగుకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. ఈక్రమంలోనే వాతావరణంలో పెనుమార్పులు వచ్చాయి. వాతావరణం చల్లబడింది. ఈ కారణంతో వంద నుంచి 110 రోజులకు 40 కౌంట్ వరకు పెరుగుదల ఉం డాల్సి ఉండగా ప్రస్తుతం 140 రోజులు పడుతోంది. ప్రస్తుతం సాగు 60 రోజులకు చేరింది. ఈ క్రమంలోనే బరువు 10 గ్రాముల నుంచి 12 గ్రాములకు చేరాలి. తెల్లమచ్చ వ్యాధితో చెరువుల్లోని రొయ్య లు 5 గ్రాముల బరువుకే పరిమితం అవుతున్నాయి. శరీరంపై తెల్లటి మచ్చలతో కదలడం లేదు. నీటిలో తేలుతూ చురుకుదనం లేకుండా కనిస్తున్నాయి. ఆహారం సక్రమంగా తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే రైతులు ముందుగానే విక్రయిస్తూ ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పైగా నష్టపోతున్నారు.



**ఆరు ఎకరాల్లో సాగు చేశా** ఆరు ఎకరాల్లో రొయ్యలసాగు చేశా. ఇప్పటికే 60 రోజులైంది. తెల్లమచ్చ వ్యాధితో ఎదుగుదల లేకుండాపోయింది. 12 గ్రాములు ఉండాల్సిన రొయ్య 5-6 గ్రాములు మాత్రమే ఉన్నాయి. వ్యాధి ముదిరితే మృతి చెందుతాయని ముందే విక్రయిస్తూ రూ.లక్షల్లో నష్టపోయా.

జానకిరామ్‌రెడ్డి, దొరువుకట్ట**వాతావరణంలో మార్పులే కారణం** వాతావరణంలో మార్పులు కారణంగానే తెల్లమచ్చ తెగులు వస్తుంది. దీనికి నివారణ మేలైన పిల్లలు వేయడమే. మేతలో నిబంధనలు పాటించాలి. నిపుణులు సూచనలు పాటిస్తూ సాగు చేయాలి. అప్పుడే అధిక దిగుబడులు పొందుతారు. నష్టాలు ఉండవు.రెడ్యానాయక్, ఎఫ్‌డీవో

## 55 ఏళ్ల ప్రాజెక్టు ప్రశ్నార్థకం!

తిరుపతి : తిరుపతిలోని అఖిల భారత పందుల పరిశోధన స్థానం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వైకాపా పాలనలో పరిశోధనలపై జరిగిన నిర్లక్ష్యాన్ని గుర్తించిన ఐసీఏఆర్ ఏడాది కిందట నిధులు నిలిపివేస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అసలే ఆర్థికంగా కుదేలైన పశువైద్య వర్సిటీకి ఈ పరిశోధనా స్థానం నిర్వహణ అదనపు భారంగా పరిణమించింది.భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) దేశవ్యాప్తంగా పందుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఆఖిలభారత స్థాయిలో పరిశోధనా ప్రాజెక్టుల్ని 1970లో మంజూరు చేసింది. ఆ మేరకు 1971లో స్థానిక పశువైద్య కళాశాల ఆవరణలో పందుల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. యూకేకు చెందిన లార్జ్ వైట్ యార్క్‌షైర్ అనే తెల్లజాతి పందితో స్థానిక పందులను సంకరపరిచారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పోషణ, మేలుజాతి పందుల ఉత్పత్తి, దేశవాళీ జాతుల పరిరక్షణ వంటి అనేక అంశాల్లో ప్రగతి సాధించారు. తిరుపతి-17 జాతిని సైతం ఆవిష్కరించారు. ఏటా ఐసీఏఆర్ నుంచి రూ.30 లక్షల వరకు నిధులు అందడంతో షెడ్ల నిర్వహణ, దాణా,



పరిశోధనలు, సిబ్బంది జీతభత్యాలకు ఎటువంటి ఢోకా ఉండేది కాదు. ప్రస్తుతం పరిశోధనా స్థానంలో 150 వరకు పందులు ఉండగా వాటికి అవసరమైన దాణా, సిబ్బంది జీతభత్యాలకు రూ.11 లక్షల వరకు విశ్వవిద్యాలయం భరిస్తోంది.

**ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం**: ఏటా 500 వరకు సంకరజాతి పిల్లల్ని ఔత్సాహిక రైతులకు విక్రయించేవారు. ఇలా కేంద్రానికి ఏటా రూ.15 లక్షల వరకు ఆదాయం వచ్చేది. వెయ్యిమంది వరకు ఔత్సాహికులకు పందుల పెంపకంలో శిక్షణ ఇచ్చేవారు. తిరుపతి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టులు ఉండగా తిరుపతికి మాత్రమే నిధులు ఆపడం గమనార్హం. వైకాపా హయాంలో వర్సిటీ అధికారులు ప్రాజెక్టు ఫలితాలపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైనట్లు ఆరోపణలున్నాయి. ప్రాజెక్టుల జాబితా నుంచి తిరుపతి పేరు ఇంకా తొలగించలేదని, త్వరలో నిధులు సాధిస్తామని పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కళ్యాణ చక్రవర్తి తెలిపారు.

## 'ఐదేళ్లు'.. గుండెల్లో గుబులు!

విశాఖపట్నం : వైద్యుల బదిలీలకు సంబంధించి... ఐదేళు ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఈనెల 17వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తవనుంది.

**ఏఎంసీ పరిధిలో... :** కొత్త నిబంధన ప్రకారం.. ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) పరిధిలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు 59 మంది వరకు ఉన్నట్టు లెక్క కట్టారు. వారిలో 15 మంది ప్రొఫెసర్లు, 9 మంది సహ ప్రొఫెసర్లు, 35 మంది సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు. ఏఎంసీ పరిధిలో కేజీహెచ్‌తో సహా ఏడు ఆసుపత్రులు ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యుల సర్వీసును బట్టి, బదిలీలకు అర్హులుగా నిర్ణయించారు.

**ఓ ప్రొఫెసర్..** భిన్నవాదనలు: మెడిసిన్ విభాగంలో ఏళ్ల నుంచి ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఓ వైద్యుడి విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ వైద్యుడు కొవిడ్ సమయంలో దాదాపు ఏడాదిన్నర పాటు విజయవాడలో సేవలు అందించారు. నాటి ప్రభుత్వం దాన్ని బదిలీగా పరిగణించి, 2023లో జీఓ ఇచ్చింది. అయితే కేజీహెచ్‌లో వేతనం తీసుకుని, విజయవాడలో పని చేసినంత మాత్రాన.. అది బదిలీ కిందకు రాదని, కేవలం డిప్యుటేషనే అవుతుందని మిగిలిన వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు ఆయన బదిలీకి అర్హుడే అని వారు వాదిస్తున్నారు. కానీ, ప్రభుత్వం జీఓ జారీ చేసినందుకు ఆయన పని చేసిన కాలాన్ని డిప్యుటేషన్‌గా పరిగణించలేమని, అది బదిలీ కిందకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ మేరకు ఆయన 2023 నుంచి ఏఎంసీ పరిధిలో కొనసాగుతున్నట్టు తేల్చి, బదిలీల జాబితాలో పేరు చేర్చలేదు.

**ఉరుకులు.. పరుగులు..**

బదిలీకి అవకాశం ఉన్న వైద్యులంతా ఇప్పుడు ప్రజా ప్రతినిధుల వద్దకు పరుగులు తీస్తున్నారు. తమను ఏదో విధంగా ఏఎంసీకి అనుబంధంగా ఉండే కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో కొనసాగించేలా చూడాలని విన్నవిస్తున్నారు.అయితే ప్రభుత్వం మాత్రం బదిలీల విషయంలో ఎలాంటి మినహాయింపు ఇవ్వరాదని, జీఓ ప్రకారం బదిలీ చేయాల్సిందేనని తేల్చి చెబుతోంది. భార్యాభర్తలు ఒకే చోట పని చేస్తున్నా, దివ్యాంగులైనా, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నా... అలాంటి వారికి కాస్త వెసులుబాటు ఇస్తున్నారు.

## బెత్త విత్తనాల పట్టివేత!

నర్సీపట్నం : తేదీలేని కాంపౌండింగ్ ఫండ్ రసీదుతో వ్యాన్‌లో తరలిస్తున్న బెత్త (రట్టన్) విత్తనాలను అటవీ అధికారులు గొలుగొండ మండలం చీడిగుమ్మల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. కొయ్యూరు మండలం అన్నవరం, కన్నవరం, నల్లబిల్లి, పెద అగ్రహారం, చీడిపల్లి గ్రామాల్లో సేకరించిన ఈ విత్తనాలను ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకు తీసుకువెళ్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బెత్త పిక్కలను మెడలో ధరించే



పూసలుగా తయారు చేసి విక్రయిస్తుంటామని నిందితులు అధికారులకు వివరించారు. ఈ విత్తనాలను మొక్కలుగా పెంచి ఒడిశాకు తరలిస్తుంటారని సమాచారం. ఈ చెట్ల నుంచి వచ్చే కలప ఎంతో నాణ్యమైందిగా చెబుతున్నారు. లాఠీలు, కేన్ ఫర్నీచర్ మాదిరి గృహోపకరణాలు తయారు చేయవచ్చని, కొన్ని రకాల ఔషధాల్లోనూ వినియోగిస్తారని సమాచారం. పట్టుబడిన విత్తనాల విలువ రూ.40 వేల వరకు ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా. తేదీ లేకుండా పట్టుబడిన రసీదు అల్లూరి జిల్లాలోని ఓ రేంజ్ అధికారి పేరున ఉంది. కావాలని తేదీ వేయలేదా... ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. రాత్రి ఈ విత్తనాలు పట్టుబడగా, వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకు తరలించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు రేంజ్ అధికారి లక్ష్మీనర్స్ వెల్లడించారు.

# ర్యాంకులో పురోగతి.. సౌకర్యాలు అధోగతి

దువ్వాడ : దువ్వాడ రైల్వేస్టేషన్ అటు ఆదాయంతో ఇటు ప్రయాణికుల సంఖ్యను కూడా రోజురోజుకు పెంచుకుంటోంది. ర్యాంకు కూడా మెరుగుపర్చు కుంటూ ముందుకెళ్తోంది. అయితే సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఈ లోటు కూడా భర్తీ చేస్తే ఇంకా మెరుగైన ర్యాంకుకు చేరుకునే అవకాశం లేకపోలేదు. **10వ ర్యాంకు సాధించే..:** దువ్వాడ రైల్వేస్టేషన్ 2023-24లో ఈస్టుకోస్ట్ రైల్వే పరిధిలో 13వ ర్యాంకులో ఉండగా.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 10వ ర్యాంకు కైవసం చేసుకుంది. 2023-24లో రూ.27.19 కోట్ల ఆదాయం రాగా.. 2024-25కు రూ.37.53 కోట్లకు పెరిగింది. స్టేషన్ నుంచి ప్రయాణించేవారి సంఖ్య 9.85 లక్షల నుంచి 12.47 లక్షలకు చేరుకుంది. గత ఏడాది 13వ ర్యాంకులో ఉండగా.. శ్రీకాకుళం రోడ్డు, రాయగడలను అధిగమించి 10వ స్థానానికి చేరింది. అటు ప్రయాణికులు, ఇటు ఆదాయం పరంగా మంచి పురోగతి సాధించింది.

**ఇలా సాధ్యమయ్యే..:** దువ్వాడ చుట్టుపక్కల పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందింది. ఇక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్న వారి రాకపోకలు పెరిగాయి. దీంతో నివాసాలు విస్తృత మయ్యాయి. గాజువాక, పశ్చిమ, పెందుర్తి నియోజక వర్గాలకు చెందిన ఎక్కువ మంది ప్రజలు తమ రైలు ప్రయాణాలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌నే ఆశ్రయిస్తున్నారు. దువ్వాడ



నుంచి ప్రధాన రైల్వేస్టేషన్‌కు రైళ్లు చేరుకోవడానికి చాలా సమయం తీసుకుంటుండంతో ఎక్కువమంది దువ్వాడ స్టేషన్‌లో దిగేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కొన్ని రైళ్లు ప్రధాన స్టేషన్‌కు వెళ్లకుండానే దువ్వాడ నుంచి వెళ్లిపోతుండటంతో వల్ల కూడా ఈ స్టేషన్‌కు రద్దీ పెరిగింది.

**మరి అభివృద్ధి ఏది?:** ఆదాయం, ప్రయాణికుల సంఖ్యను బట్టి ర్యాంకులు మెరుగుపడుతున్నా.. ఆ స్థాయిలో సౌకర్యాలు ఉండటం లేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో భాగంగా కేటాయించిన రూ.26.31 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి.ప్రధాన భవనం నుంచి నాలుగో ప్లాట్‌ఫామ్ వరకు 12 మీటర్ల వెడల్పుతో చేపడుతున్న నడక వంతెన నిర్మాణ పనులు పడకేశాయి. కేవలం 40 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఇనుప స్తంభాలు మాత్రమే ఏర్పాటుచేశారు. డ్రాయింగ్ సవరణ జరగాల్సి ఉంది.కార్లు, ద్విచక్ర వాహనాల కోసం నిర్మించాల్సిన పార్కింగ్ షెడ్ల ఊసేలేదు. మొదటి ప్లాట్‌ఫామ్ వైపు పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండ, వానల్లోనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. పార్కింగ్ ఫీజుల మోత మోగిస్తున్నా షెడ్ల నిర్మాణంపై దృషి సారించడంలేదు. ప్రస్తుతం స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ఒక్క లిఫ్టు కూడా తరచూ మొరాయి స్తుండడంతో మెట్ల మార్గాన్నే ఆశ్రయించాల్సి వస్తోంది. కొత్త నడక వంతెనకు అనుసంధానంగా మరో మూడు లిఫ్టు ఏర్పాటు చేయాల్సి ఉంది. నాల్గో ప్లాట్‌ఫామ్‌ను అనకాపల్లివైపు 90 మీటర్లు విస్తరించాల్సి ఉంది. కూడా అసంపూర్తిగానే ఉన్నాయి.

# డంపింగ్ యార్డులకు మోక్షం

పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగరపాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, కుప్పం పురపాలికలను స్వచ్ఛంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. నగరపాలికలు, పురపాలికల్లో పోగయ్యే వ్యర్థాలను జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు డంపింగ్ యార్డుల్లో రీసైక్లింగ్ చేస్తున్నారు.. వ్యర్థాల నుంచి కంపోస్టు మట్టి, రాళ్లు, ప్లాస్టిక్ వస్తువులను యంత్రం ద్వారా వేరేచేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.. మొదట విడతలో రెండు నగరపాలికలు, మూడు పురపాలికల్లో చేపట్టేందుకు ఏప్రిల్ 24న మున్సిపల్ కమిషనర్లతో డీఎంఏ అధికారులు సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఘన వ్యర్థాలను నెల్లూరులో నెలకొల్పనున్న ఐటీసీ ప్లాంట్‌కు తరలిస్తారు. తిరుపతి జిల్లా పుత్తూరు పురపాలికలో ప్రస్తుతం రీసైక్లింగ్ ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే చిత్తూరు, తిరుపతి నగర పాలికలకు ఘనవ్యర్థాల రీసైక్లింగ్ చేపట్టారు. పుత్తూరులో తాజాగా ప్రారంభం కాగా, శ్రీకాళహస్తి, కుప్పంలో రీసైక్లింగ్‌కు సంబంధించి యంత్రాలు అమర్చుతున్నారు. దీనికితోడు తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారు. డివిజన్లు, వార్డుల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను, యార్డుకు తరలించి తడి, పొడి వ్యర్థాలు వేరుచేస్తున్నారు. తడి, పొడి వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు వేరు చేసే పనులు గతంలో ప్రారంభించినా అప్పటి వైకాపా ప్రభుత్వం ఆ పనులను అర్థాంతరంగా నిలిపివేసింది.

**కూటమి ప్రభుత్వం దృష్టి**



కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక డంపింగ్ యార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించేందుకు ఉపక్రమిస్తోంది. ఎన్జీటీ మార్గదర్శకాలు పాటిస్తూ యంత్రాల ద్వారా వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్‌ను వేరు చేసే కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబరు 30 నాటికి పూర్తి స్థాయిలో వ్యర్థాలను శుభ్రం చేసి ఆ ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన పార్కుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో శుద్ధి చేసే యంత్రాన్ని తెప్పించి పనులు చేపడుతున్నారు. ఎరువును రైతులకు అందించనున్నారు.

**ప్రజల సహకారంతోనే..**

పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం కోసం చేపడుతున్న ఈ పనులకు ప్రజల సహకారం ఎంతో అవసరం. స్వచ్ఛాంధ్ర మిషన్ ద్వారా ఈ కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి. తద్వారా భవిష్యత్తులో వ్యర్థాల గుట్టలు కనిపించవు. డంపింగ్‌యార్డులకు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. భవిష్యత్తులో డంపింగ్‌యార్డులు ఆహ్లాదాన్ని పంచనున్నాయి.

విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# సూది.. దారమూ కరవే!



అనంతపురం : ఉచితంగా మెరుగైన వైద్యం అందుతుందన్న ఆశతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తున్న రోగులకు అరకొర సేవలే అందుతున్నాయి. రోజూ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి 1,200 మంది వస్తుంటారు. అందులో ఆర్థో విభాగం ఓపీకి 200, అడ్మిషన్లు 10 వరకు ఉంటాయి. రోజూ 7 నుంచి 10 వరకు శస్త్రచికిత్సలు జరుగుతుంటాయి. అందుకు అవసరమయ్యే సూది, దారంతో పాటు ఇతర సామగ్రి బయట కొనుగోలు చేసి తీసుకురావాలని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు సరైన మంచాలు లేక వాటి కింద ఇటుకలు ఉంచాల్సిన దుస్థితి. కాళ్లు విరిగినవారు మరుగుదొడ్డి వెళ్లాలంటే నానా అగచాట్లు పడుతున్నారు. రోగులను తరలించడానికి సిబ్బంది డబ్బులు డిమాండు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బెడ్‌షీట్లు సైతం సక్రమంగా మార్చడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కొన్ని సరఫరా కావడం లేదు**

డాక్టర్ ఆత్మారాం, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఆర్థో విభాగంలో శస్త్రచికిత్సలకు అవసరమయ్యే దారం (ప్రోలిన్) ఆరు నెలలుగా సరఫరా చేయటం లేదు. కొన్నింటిని బయట తెచ్చుకోవాలని రాసిస్తున్నాం. మోకాళ్ల శస్త్రచికిత్స ఎన్‌టీఆర్ వైద్యసేవ కిందకు రావు. ఇన్‌ప్లాంట్స్ బయట తెచ్చుకుంటే శస్త్రచికిత్స చేసి అమరుస్తాం. మంచాల కింద ఇటుకలు ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఏర్పాటు చేశాం. ఎవరైనా సిబ్బంది డబ్బులు అడిగినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

**చీటీ రాసిస్తున్నారు**

నాగేంద్ర, కుందుర్పి

నా భార్య మోకాలిపై గడ్డరావటంతో ఆర్థోవిభాగంలో చేర్చా. శస్త్రచికిత్స చేసేందుకు అవసరమయ్యే సూది, దారంతో పాటు ఇతర సామగ్రి లేదని వైద్యుడు చీటీ రాసివ్వటంతో ప్రైవేట్‌గా కొనుగోలు చేసి అందజేశా. సెలైన్ అయిపోతే కనీసం వచ్చి తీసేయటం లేదు. ఆపరేషన్‌కు తీసుకెళ్లేముందు రోగికి అందించే దుస్తులు ఉతికి ఇవ్వటం లేదు. సర్జరీ తరువాత రోగి సహాయకులే దుస్తులు ఉతికి ఇవ్వాలని చెబుతున్నారు.

**రూ.లక్ష ఖర్చు అవుతుందంట**

సేవానాయక్, ఓబులనాయణపల్లి తండా

నా భార్యకు మోకాళ్లనొప్పులు రావటంతో ఆసుపత్రికి వచ్చాం. వైద్యులు పరీక్షలు చేసి ఆర్థో వార్డులో చేర్చారు. ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు. వారం రోజులు వార్డులో ఉన్నా వైద్యం అందించలేదు. మోకాళ్ల శస్త్రచికిత్స చేయాలంటే రూ.లక్ష ఖర్చు అవుతుందని వైద్యుడు చెప్పారు. అంత మొత్తం ఉంటే ఇక్కడికి ఎందుకు వచ్చేవాళ్లం.

# కదిలిస్తే చాలు.. ఇంటింటా కన్నీళ్లు



పుట్టపర్తి : బీడీ కాల్చకుండానే కార్మికుల బతుకులు పొగచూరిపోతున్నాయి. తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నా.. వారి తలరాతలు మారడం లేదు. ఫ్యాక్టరీ యజయమాని, కార్మికుడి మధ్య ఏజెంట్లదే పెత్తనం. ఫలితంగా బాల్యం మొదలు వృద్ధాప్యం వరకు పొగాకుతో సహవాసం చేస్తూ అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లిపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో కదిరి, తాడిపత్రి, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో 18 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తున్నారు. వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదు. బీడీ కార్మికులు, ఫ్యాక్టరీ(గడంగ్)లకు మధ్య ఏజెంట్లు దళారీలుగా వ్యవహరిస్తున్నారు. 40-50 ఏళ్లుగా బీడీలే చుడుతున్నా అసంఘటిత కార్మికులుగానే ఉండిపోయారు. కదిరిలో సుమారు 10 వేలమంది ఈ వృత్తిలో ఉండగా 11 మందికి మాత్రమే కార్మికశాఖ గుర్తింపు కార్డులు ఉన్నాయంటే పరిస్థితి అర్థమవుతోంది. తాడిపత్రిలో 7,800 మంది మహిళలు ఉన్నారు. గుర్తింపులేక ఈఎస్ఐ ఆసుపత్రి సేవలు, గృహాలు, పింఛను, బీమా సదుపాయాలు దూరమయ్యాయి. ఒక్కోచోట ఒక్కోలా కూలి ఇస్తున్నారు. కిలో ఆకు, రెండుసేర్ల పొగాకుతో 2 వేల బీడీలు తయారు చేయాలి. అందులో తగ్గిన ప్రతి వంద బీడీలకు రూ.20 కూలిలో కోత పెడుతున్నారు. సంక్షేమ పథకాల అమలు కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా ఫలితం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**పేదరికం.. జబ్బుల వేధింపు**

ప్రతి కుటుంబంలోనూ ఎవరో ఒకరు జబ్బుకు గురైన పరిస్థితులున్నాయి. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధులు అధికంగా సంక్రమిస్తున్నాయి. ఎక్కువ కాలం పనిచేసిన పెద్దలు ఎంతోమంది మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. కుటుంబ పెద్ద మృతి, వారసులకు జబ్బు సోకినా ఉదర పోషణకు ప్రత్యామ్నాయం లేక బీడీలు చుట్టాల్సిందే. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మందులు దొరక్క, ప్రైవేటులో కొనే స్తోమత కొరవడి జీవన పోరాటం సాగిస్తున్నారు.

**50 ఏళ్లుగా పని చేస్తున్నా..**

షేక్ దిల్షాద్, నిజాంవలీ కాలనీ, కదిరి

పదేళ్ల వయసు నుంచే బీడీలు చుడుతున్నా.. 60 ఏళ్లు దాటాయి. కొడుకు, కూతురుకి పెళ్లిళ్లు కావడంతో వేరుగా ఉంటున్నారు. వృద్ధాప్యంతో పనిచేయడానికి ఓపిక లేదు. శ్వాసకోశ సమస్యతో ఇబ్బంది పడుతున్నా. కళ్లు కనిపించటం లేదు. భర్త పక్షవాతంతో ఏపనీ చేయలేని స్థితి. మా అన్న టీబీతో మృతి చెందాడు. మేమిద్దరం రోజుకు 800 బీడీలకు మించి చుట్టలేని స్థితి. వృద్ధాప్య పింఛను రూ.4 వేలే జీవనాధారం.

**రోజుకు రూ.150..**

అక్తర్, నిజాంవలీ కాలనీ

రోజుకు రూ.150 మించి కూలి రావడం లేదు. భర్త ఐదేళ్ల క్రితం ప్రమాదానికి గురై మృతి చెందాడు. నలుగురు పిల్లల భారం మోస్తున్నాను. అనారోగ్య సమస్య ఉంది. మందులకు నెలకు రూ.3 వేలు ఖర్చవుతోంది. డబ్బుల్లేక సగం మందులే తెచ్చుకుంటున్నా. ఉండటానికి ఇల్లు లేదు. అధికారులు స్పందించి గుర్తింపు కార్డులివ్వాలి.

# నష్టాన్ని తగ్గించి.. నిరంతర సరఫరా అందించి..

గురుద్వారా : వర్షాకాలం వచ్చిందంటే పెను తుపాన్ల కారణంగా వృక్షాలు, స్తంభాలు కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలపై పడి విద్యుత్తు వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. దీంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు రూ. కోట్లలో నష్టం వాటిల్లుతోంది. ఇటువంటి ప్రకృతి విపత్తులను దీటుగా ఎదుర్కొని సాధ్యమైనంత వరకు విద్యుత్తు అంతరాయాలు లేకుండా ఉండేలా వర్షాకాలంలో ముందుగా నిర్వహించే 'మాన్‌సూన్' ప్రక్రియను ఏపీఈపీడీసీఎల్ ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటికే ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. తగరపువలస నుంచి అనకాపల్లి వరకు 'మాన్‌సూన్' పనుల నిమిత్తం రూ.2.9 కోట్లు నిధులు మంజూరు చేశారు.

**నిత్యం ఉన్నతాధికారుల పర్యవేక్షణ..**

నగరంలోని 43 విద్యుత్తు కార్యాలయాల్లో జూనియర్, సహాయ జూనియర్ లైన్‌మెన్లతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు మీదుగా ఏపుగా పెరిగిన చెట్లు కొమ్మలు తొలగించడం, 33, 11 కేవీ సబ్‌స్టేషన్లు ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ నెట్వర్క్, ఇతరచోట్ల దెబ్బతిన్న విద్యుత్తు తీగలు, స్తంభాలు మార్చడం వంటివి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరిగే పనులను సకాలంలో పూర్తి చేయడమే గాక పనితీరుపై నిత్యం ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ధ్యేయంగా సిబ్బందిని నిత్యం అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే



90 శాతం పనులు పూర్తికాగా మిగతా 10 శాతం పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా కార్యాచరణ జరుగుతుందని ఎస్‌ఈ శ్యామ్‌బాబు అన్నారు. అనుకోకుండా విద్యుత్తు అంతరాయాలు సంభవిస్తే వినియోగదారులు 1912కు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

# పోగుకు భౌగోళిక పాగా

ఎమ్మిగనూరు: మగ్గమే ఇల్లు.. నరాలే దారాలు.. శ్రమనే పెట్టుబడి.. చెమట చుక్కలే రంగులు.. అలుపు మరచి అహర్నిశలు కష్టపడుతున్న శ్రమజీవి విలువ 'గుర్తింపు'నకు అడుగులు పడుతున్నాయి. సహజ సిద్ధమైన రంగులు.. మృదువైన వస్త్రం.. విభిన్న డిజైన్లతో మార్కెట్లో 'పోటీ' తట్టుకొని దేశవిదేశాల్లో ఆదరణ పొందుతున్న చేనేతపురి ఉత్పత్తుల గుర్తింపునకు మార్గం సుగమమైంది. కంటికి కనిపించని పోగులను మగ్గంపై అతికించి ఎమ్మిగనూరు చేనేత వనితలు తమ నైపుణ్యాన్ని చాటుతున్నారు. వీరి చేతిలో రూపుదిద్దుకున్న బర్డ్సై తువ్వాళ్లు, జిందగి దుప్పట్లు, చేతిరుమాలు, తువ్వాళ్లు, దోమతెరలు, న్యాప్‌కిన్స్ వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ మహిళా శక్తిని చాటుతున్నారు. వీటిలో అత్యంత ఆదరణ పొందిన బర్డ్సై తువ్వాళు, జిందగి దుప్పట్లకు భౌగోళిక గుర్తింపు తీసుకురావడానికి రెసల్యాట్ బీ2బీ సంస్థ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు.

**'దారం'లో దాగిన ప్రత్యేకత**

పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో ఎమ్మిగనూరు చేనేత సహకార పరపతి సంఘాన్ని స్థాపించారు. సంఘం ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా గుర్తించిన నూలు దారాలు వినియోగిస్తారు. తమిళనాడులోని కోయంబత్తూరు,



కర్ణాటకలోని దావణగేరి డిపోల ద్వారా నూలు సరఫరా అవుతోంది. ఏటా రూ.3 కోట్ల మేరకు లావాదేవీలు సాగుతాయి. హైదరాబాద్, రాయచూర్, గుల్బర్గ, కాకినాడ, విజయవాడ, అమరావతి, అనంతపురం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. "భౌగోళిక గుర్తింపు వస్తే సంఘం మరింత అభివృద్ధి దిశగా సాగుతుందని కొత్తవారికి ఉపాధి లభిస్తుందని" చేనేత జౌళీ శాఖ సహాయ సంచాలకులు అప్పాజీ అన్నారు.తువ్వాళ్ల తయారీలో మేటి ఈమె పేరు లక్ష్మమ్మ.. 60 ఏళ్ల వయసు.. భర్త ఈరన్నతో కలిసి చేనేత మగ్గం పని చేస్తుంటారు. నిత్యం 4 నుంచి 6 తువ్వాళ్లు నేస్తుంటారు. చిన్నప్పటి నుంచి తువ్వాళ్ల తయారీలో మేటిగా నిలుస్తున్నారు.

**జిందగి దుప్పట్లు**

జిందగి దుప్పట్లు ఎమ్మిగనూరు చేనేత సహకార సంస్థ నుంచి ఉత్పత్తి అవుతుంటాయి. ఒక్కోదాని పొడవు 2.29 మీటర్లు, వెడల్పు 1.52 మీటర్లు, బరువు 1.5 కిలోలు ఉంటుంది. వీటి తయారీకి కావాల్సిన ముడిసరకును విజయవాడ ఎన్‌హెచ్‌డీసీ ద్వారా కొనుగోలు చేసుకుంటారు. 2/70 కౌంట్ యారాన్ వినియోగిస్తారు. దుప్పటి, బెడ్‌షీట్ రెండు రకాలుగా వినియోగం ఉంటుంది. సొసైటీ ద్వారా డైయింగ్ చేసి రంగులు వేస్తారు. డిజైన్లు, కలర్లను సంస్థ చేస్తోంది. పర్యావరణహిత రంగులు వాడతారు. 16 చెక్క తొక్కుడు మగ్గాలపై నేస్తారు, ఈ దుప్పట్లు మృదువుగా ఉంటాయి. ఏడాదికి 300 వరకు ఉత్పత్తి చేస్తుంటారు.

**బర్డ్సై తువ్వాళ్లు భలే.. భలే**

తొక్కుడు చెక్క మగ్గాలపై బర్డ్సై తువ్వాళ్లు నేస్తారు. రెండు పోగుల నూలు పురిదారాలు ఉంటాయి. తయారైన తువ్వాళ్లు చూస్తే "పక్షి కన్ను" రూపంలో కనిపిస్తాయి. ఇవి మృదువుగా ఉండటంతోపాటు వెంటనే నీటిని పీల్చుకొనే గుణం ఉంటుంది. వీటికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నూలును ఎన్‌హెచ్‌డీసీ ద్వారా 2-20 దారాలను (పురిదారాలు) కొనుగోలు చేస్తారు. బండిల్ 4.5 కిలోల బరువు ఉంటుంది. ఒక కండీ ధర రూ.1,515. ఎమ్మిగనూరు సొసైటీ డైయింగ్ సెక్షన్లలో పర్యావరణ పరిరక్షణ కాపాడే రంగులను వినియోగిస్తారు. మూడు రోజులపాటు దారాలు ఆరబెట్టిన తర్వాత చేనేతలకు ఇస్తారు. వీటితో మగ్గాలపై తువ్వాళ్లు తయారు చేస్తారు. 1.60 మీటర్ల పొడవు, 0.74 మీటర్ల వెడల్పు ఉంటుంది. వీటికి 200 గ్రాముల నూలు ఉపయోగిస్తారు. ఏటా 6-7 వేల తువాళ్ల వరకు ఉత్పత్తి చేస్తుంటారు.

# క్రిసిటీపై సీఎం ప్రత్యేక దృష్టి

గూడూరు : కృష్ణపట్నం పారిశ్రామిక నగరం (క్రిసిటీ) పనులు కొలిక్కి వస్తున్నాయి. వైకాపా హయాంలో ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇటీవల అమరావతిలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పియూష్ గోయల్‌తో చర్చించారు. ఆరు పారిశ్రామిక పార్కుల్లో మొదటి దశలో రూ.1,448 కోట్లతో చేపట్టనున్న మౌలిక వసతుల పనులకు ఈ వారంలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న ఈ పార్కుల నిర్మాణం వేగంగా పూర్తిచేసి రూ.6000 కోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి.



**మారనున్న రూపురేఖలు:** కృష్ణపట్నం పోర్టు నుంచి ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ రూ.3,229.31 కోట్లతో 116.63 కి.మీ నాలుగు రహదారులు నిర్మించడం తెలిసిందే. నాయుడుపేట-తూర్పుకనుపూరు, చిల్లకూరు-తూర్పు కనుపూరు పనులు ఇప్పటికే సగం వరకు పూర్తిచేశారు. ఎన్‌వీ రోడ్ల నుంచి పండూరు వరకు ఇటీవల ప్రారంభమయ్యాయి. గూడూరు-దుగరాజపట్నం భూసేకరణ దశలో ఉంది. ఇవన్నీ పూర్తయితే ఇక్కడి రూపురేఖలు మారనున్నాయి. రెండేళ్లలో పూర్తిచేసేలా స్వయంగా సీఎం పర్యవేక్షిస్తున్నారు.

# సీజన్ మొదలైనా.. వసతులు కరవు

బంగారుపాళ్యం : మామిడి కాయల విక్రయాల్లో పేరుగాంచిన బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కొరవడి రైతులు, వ్యాపారులు, మండీ వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.. ఈ ఏడాది సీజన్ ఇప్పుడిప్పుడే మొదలైంది.. అయినా ఇప్పటివరకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ఆయా వర్గాలు నిరాశగా ఉన్నాయి.. అసలు వసతులు కల్పిస్తారో..? లేదో..? అని ఎదురుచూస్తున్నాయి. స్థానిక మార్కెట్ యార్డులో ఏటా మామిడి కాయల సీజన్‌లో ఐదు నెలలు క్రయవిక్రయాలు జరుగుతాయి. కోట్లాది రూపాయల విలువైన కాయలను పంజాబ్, మహారాష్ట్ర, బిహార్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలతో పాటు జిల్లాలోని పండ్ల గుజ్జు పరిశ్రమలకు తరలిస్తారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల నుంచి రైతులు మామిడి కాయలను ట్రాక్టర్లు, లారీలు, ఆటోలు తదితర వాహనాల్లో ఇక్కడి యార్డుకు తీసుకొస్తారు. ఇక్కడ 500 మందికి పైగా కూలీలు, వ్యాపారులతో మార్కెట్‌యార్డు రాత్రింబవళ్లు సందడిగా ఉంటుంది. కాయల కొనుగోలుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు, కూలీలు, రైతులు మౌలిక వసతులు లేమితో అవస్థలు పడుతున్నారు. మార్కెట్ యార్డులో శుద్ధి నీటి కేంద్రం లేదు. దీంతో ప్రైవేటు వారి వద్ద నుంచి నీరు కొనుగోలు చేసి మరీ తెచ్చుకుంటు



న్నారు. పదెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రముఖ యార్డులో తగినన్ని వసతులు లేక కొనుగోలుదారులు, వ్యాపారుల తిప్పలు చెప్పనలవికావు. కనీసం మరుగుదొడ్లకు వెళ్లాలన్నా అవస్థే. అత్యవసరమైన నీటి కుళాయిలు లేవంటే ఇక్కడి పరిస్థితి ఎలాఉందో వేరే చెప్పనక్కర్లేదు. మరుగుదొడ్లు ఉన్నా కొన్నింటికి నీటి వసతి లేక పోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో యార్డులోని మహిళా కూలీల తిప్పలు వర్ణనాతీతం. వారు ఎటు వెళ్లాలో తెలియక లోలోన మదనపడుతున్నారు. ఇటీవల ఛైర్మన్‌గా నియమితులైన భాస్కర్ నాయుడు.. ఇక్కడి సమస్యలపై దృష్టి సారించి సమన్వయంతో వసతులు కల్పించాలని వారు కోరుతున్నారు.

**వసతులు కల్పిస్తాం**

మామిడి కాయల క్రయవిక్రయాల యార్డుకు వచ్చే వ్యాపారులు, రైతులు, కూలీలకు వసతులు కల్పిస్తాం. ఇందుకు ప్రణాళిక రూపొందించాం. గంగయ్య, కార్యదర్శి, మార్కెట్ కమిటీ

# విద్యార్థుల జీవితాలకు.. నవోదయం

మదనపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసింది. ఏటా ప్రవేశ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. మదనపల్లె మండలం వలసపల్లె నవోదయ విద్యాలయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకునేందుకు జూన్ 1న నోటిఫికేషన్ విడుదల చేశారు.

**విద్యాలయంలో సౌకర్యాలు..**

జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 12వ తరగతి వరకు ఇక్కడే ఉచిత విద్య పొందవచ్చు.



అలాగే భోజన, వసతి, దుస్తులు, పుస్తకాలు అందజేస్తారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతి గృహాలున్నాయి. రన్నింగ్ ట్రాక్, మైదానం ఉంది. ప్రతి ఏటా వివిధ విద్యాలయాల నుంచి వచ్చిన విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. సంగీతం, నృత్యం, ఎన్‌సీసీ, కరాటేలో శిక్షణ ఇస్తారు.

**పరీక్ష విధానం ఇలా...**

ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో మొత్తం 100 మర్కులకు ప్రశ్నలుంటాయి. మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలకు 50 మార్కులు, అర్థమెటిక్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులు, ల్యాంగ్వేజ్‌లో 20 ప్రశ్నలకు 25 మార్కులుంటాయి. వీటిలో విద్యార్థులు అర్హత సాధించాల్సి ఉంటుంది. జులై 29వ తేదీ ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ. దరఖాస్తు చేసుకున్న వారికి 2025 డిసెంబరు 13న ప్రవేశ పరీక్ష ఉండనుంది.

**అర్హులు వీరే...**

విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 అయిదో తరగతి చదువుతున్న వారై ఉండాలి. విద్యాలయంలో ప్రవేశానికి గ్రామీణ విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల కోటాలో చేరాలనుకునే విద్యార్థులు 3, 4, 5 తరగతులు ఆ ప్రాంతాల్లోనే చదివి ఉండాలి. మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయిస్తారు.

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోండి**

మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో ఏఏ మండలాలైతే ఉన్నాయో వారంతా అర్హులే. అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వేలాయుధన్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయం

# ఎగుమతుల్లో వేగం.. కంటైనర్ డిపోతో సాకారం



అనంతపురం : ఎగుమతులు, దిగుమతుల్లో కీలకమైన ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో (ఐసీడీ) చిత్తూరు జిల్లావాసుల కల. డ్రైపోర్టులుగా వీటిని అభివర్ణిస్తుంటారు. స్థానికంగా అందుబాటులోకి వస్తే ప్రధానంగా వ్యవసాయ, ఉద్యాన, పారిశ్రామిక ఎగుమతులు జోరందుకుంటాయి. గత ప్రభుత్వ హయాంలోనే గుడిపాల మండలం సిద్ధంపల్లి కేంద్రంగా అందుబాటులోకి వస్తుందని ఘనంగా ప్రకటించి చివరకు చేతులెత్తేశారు. పారిశ్రామికంగా ఉమ్మడి జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ అంశంపై కూటమి ప్రభుత్వం వెంటనే దృష్టిపెడితే ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయి.

చిత్తూరు జిల్లా నుంచి మామిడి, గ్రానైట్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు.. తిరుపతి జిల్లా నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. గుజ్జు పరిశ్రమలకు సంబంధించిన యంత్రాలు దిగుమతి చేసుకుంటున్నారు. ఇందుకోసం వ్యాపారులు ఎక్కువగా చెన్నైలోని ఎన్నూర్ నౌకాశ్రయం ఆశ్రయిస్తున్నారు. అతితక్కువగా నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం వెళ్తున్నారు. మామిడి, గ్రానైట్ కంటైనర్లు దాదాపు 20,000 వరకు విదేశాలకు వెళ్తుండగా వివిధ పరిశ్రమల నుంచి మరో 15-20 వేల కంటైనర్లలో సరకు ఎగుమతి అవుతోంది.

**పెట్టుబడికి ఢోకా లేదు..** ఐసీడీ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఎప్పుడో గుర్తించారు. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఒకరిద్దరు పెట్టుబడిదారులు వచ్చి స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. అయితే అధికారులు భూముల ధరలు ఎక్కువగా నిర్ణయించారని వారు వెనుకడుగు వేసినట్లు సమాచారం. మరోవైపు ఏడాదికి 6,000 కంటైనర్ల వరకు వ్యాపారం జరిగితే పెట్టుబడికి ఎలాంటి నష్టం ఉండదని, మనదగ్గర దాదాపు 40,00 కంటైనర్లు ఎగుమతి అవుతున్నందున భారీగా లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని, ఈ అంశంపై కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానించి వారి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కంటైనర్‌పై రూ.20 వేల వరకు మిగులు**

ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉత్పత్తులు చెన్నైకి తీసుకెళ్లడంతో అదనంగా రవాణా భారం పడుతోంది. స్థానికంగా ఏర్పాటయితే ఒక్కో కంటైనర్‌పై కనీసం రూ.15-20 వేలు మిగులుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీనికితోడు ఇక్కడి లారీ యజమానులకు వ్యాపారం దొరుకుతుంది. తద్వారా రవాణా రంగంలో వందలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఎగుమతుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు ఆదాయం వస్తుంది.

**సమస్యలు, ప్రయోజనాలు ఇలా..**

నౌకాశ్రయానికి ఒక్కోసారి భారీగా సరకువస్తే డాక్యుమెంటేషన్‌కు 15-20 రోజుల వరకు నిరీక్షణ తప్పడం లేదు. రద్దీ లేకున్నా తక్కువలో తక్కువ నాలుగైదు రోజులు పడుతుంది. అదే మనదగ్గర తాత్కాలిక హ్యాడ్లింగ్ కేంద్రం అందుబాటులోకి వస్తే కస్టమ్స్ అనుమతుల ప్రక్రియ సులువుగా పూర్తవుతుంది. డాక్యుమెంటేషన్ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుంది. చెన్నైకి వెళ్లే అవస్థలు తప్పుతాయి. కంటైనర్ల కొరతను అధిగమించే అవకాశం ఉంటుంది. నిల్వ సామర్థ్యం సైతం పెరుగుతుంది. తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన వ్యాపారులు సైతం ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. ఇలా చిత్తూరు, తిరుపతి, తమిళనాడుతోపాటు సమీప రాయలసీమ జిల్లాలు సైతం ఆశ్రయించడంతో ఎగుమతులు జోరందుకునే అవకాశం ఉంటుంది.

# విత్తులోనే.. విలాపం



చిత్తూరు : త్వరలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది.. జిల్లాను ముందస్తు తొలకరి వర్షాలు పలకరించాయి.. రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు.. వ్యవసాయ శాఖ ఖరీఫ్ ప్రణాళిక ప్రకటించింది.. అయితే కేటాయింపుల్లో భారీ కోత పెట్టింది.. సీజన్ ముంచుకొస్తున్నప్పటికీ జిల్లాకు అరాకొరగా విత్తు కేటాయింపు, సరఫరా జరిగింది.. ఈ నెల నాలుగో తేదీ నుంచి పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు.. కోత కారణంగా ఈ ఏడాది కష్టాలు తప్పవా అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుసెనగ సాగు చేస్తారు. దీని సాధారణ సాగు విస్తీర్ణం 51వేల హెక్టార్లు. పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, పుంగనూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో వేరుసెనగ విస్తారంగా సాగవుతుంది. నగరి నియోజకవర్గంలో ఖరీఫ్‌లో తక్కువగా, రబీలో ఎక్కువగా పండిస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు రాయితీ విత్తు 26,234 క్వింటాళ్లు రైతులకు అందజేయాలని కేటాయించారు. గతేడాది 41 వేల క్వింటాళ్లు ఇచ్చారు. ఈ ఏడాది అనూహ్యంగా వాస్తవ కోటాలో 15 వేల క్వింటాళ్లు తగ్గించారు. ఈ ప్రభావం సాగుపై పడనుంది. అదనపు కోటాకు ప్రతిపాదనలు పంపి నెలరోజులు కావస్తున్నా అతీగతీ లేదు. అరకొర విత్తును ఎలా పంపిణీ చేయాలో.. రైతులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని వ్యవసాయ శాఖ అధికారులు మదనపడుతున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల అనాలోచిత నిర్ణయాలు శాపంగా మారాయని, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలనే రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొందరు అధికారులు కంకణం కట్టుకున్నారనే ఆరోపణలు మరోవైపు ఉన్నాయి.

**ప్రశ్నించలేరా..?** జిల్లాకు కేటాయించిన విత్తులో గతేడాదితో పోలిస్తే 15 వేల క్వింటాళ్లు కోత పెట్టారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాకే ఇంత పెద్దఎత్తున కోత పెట్టడంతో ఆ శాఖ అధికారులే విస్తుపోతున్నారు. స్పందించాల్సిన జిల్లా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారనే ప్రశ్న రైతుల నుంచి వినిపిస్తోంది. అసలు వీరికి ఈ సమస్యపై అవగాహన ఉందా అనేది అనుమానమే.

**అదనపు కోటాకు ప్రతిపాదనలు..**

విత్తన కొరత వాస్తవమే. అదనపు కోటాకు ప్రతిపాదనలు పంపాం. రాష్ట్ర అధికారులతో మాట్లాడుతున్నాం. అర్హులైన ప్రతి రైతుకు రాయితీ విత్తు పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

# అస్తవ్యస్త విస్తరణ



అనకాపల్లి : కొన్ని కథలు కంచికి చేరవు.. అలా కొనసాగుతూనే ఉంటాయి. అనకాపల్లిలో రహదారుల విస్తరణ కూడా ఇలా కంచికి చేరని కథలా సాగుతూనే ఉంది. అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారాక ప్రజల రాకపోకలు.. వాహనాల రద్దీ విపరీతంగా పెరిగాయి. ఇందుకు అనుగుణంగా పట్టణ రహదారులు లేవు. వాహనదారుల ఇబ్బందులు తీరుస్తామంటూ విస్తరణ ప్రక్రియ మొదలుపెట్టినా పూర్తి చేయలేకపోతున్నారు. అసంపూర్తి.. అస్తవ్యస్త విస్తరణ పనులతో పట్టణ ప్రజలు.. పడరాని కష్టాలు పడుతున్నారు.

**ఆలయానికి రావాలంటే అవస్థలే :** ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇరుగ్గా ఉన్న ఆలయ రహదారిని విస్తరించాలని కొన్నేళ్లగా చెప్పడం మినహా ఆచరణలోకి రావడం లేదు. ఈ రహదారి 2.2 కిలోమీటర్లు పొడవు ఉంది. విస్తరణకు 189 భవనాలు ఆటంకంగా ఉన్నట్లు గుర్తించారు. ముందుగా ప్రభుత్వ భవనాలకు చెందిన ప్రహరీలను తెదేపా ప్రభుత్వ హయాంలోనే తొలగించారు. తర్వాత అయిదు పర్యాయాలు ప్రణాళికా విభాగం అధికారులు కొలతలు తీశారు. ఇంతకన్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. దూరప్రాంతాలకు చెందిన భక్తులు ఆటోలు, కార్లు, వ్యాన్లలో వస్తుంటారు. వాహనదారులు తరచూ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు.

**అలా వదిలేశారు:** రైల్వేస్టేషన్ నుంచి చోడవరం రహదారిలోకి చేరాలంటే నాయిళ్లవీధి మీదుగా రావాలి. ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ.. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో దీనిని 60 అడుగులకు విస్తరించారు. ఆరు భవనాల యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వాటి జోలికి పోలేదు. మిగిలిన రహదారిని విస్తరించి నూతనంగా రహదారి ఏర్పాటు చేశారు. కొన్ని భవనాలు అడ్డుగా ఉన్నందున ఇబ్బందులు తప్పడం లేదు. చింతావారి వీధిదీ ఇదే పరిస్థితి. దీని పొడవు 0.2 కిలోమీటర్లు. తెదేపా ప్రభుత్వ హయాంలో విస్తరణ మొదలుపెట్టారు. మొత్తం 56 భవనాలు ఉండగా వాటిలో.. 48 తొలగించి రహదారిని విస్తరించారు. మిగిలినవారు న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాస్తవానికి న్యాయ స్థానాల్లో కేసులు వేసిన వారితో సంప్రదించి వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి. ప్రజాప్రతినిధులు, ప్రణాళికా విభాగం అధికారులు వాటి జోలికి పోవడం లేదు. దీనివలన నాయిళ్ల, చింతావారి వీధులను విస్తరించినా పూర్తి స్థాయి ప్రయోజనం చేకూరలేదు.

**అష్టవంకర్లతో పెరుగుబజారు:** పట్టణంలోని వ్యాపార కేంద్రాల్లో పెరుగుబజారు రోడ్డు ముఖ్యమైనది. ఇక్కడ అనేక కిరాణా, బంగారం, ఫ్యాన్సీ, వస్త్రాలు, రెడీమేడ్ దుస్తుల వ్యాపారాలు ఉన్నాయి. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారి విస్తరణ పనులు తెదేపా హయాంలోనే ప్రారంభించినా ఇంతవరకు పూర్తి కాలేదు. ఈ మార్గాన్ని అష్టవంకర్లతో 50 అడుగుల మేర విస్తరించారు. ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. రహదారి నిర్మాణం మాత్రం చేపట్టలేదు. దీనిపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల జిల్లా సర్వే అధికారులు తిరిగి కొలతలు తీశారు. కొంత మందికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది.

జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి.వి.రమణను వివరణ కోరగా ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత కారణంగా కొంత ఆలస్యం అవుతోందని చెప్పారు. పెరుగు బజారులో మిగిలిన వారికి టీడీఆర్‌లు త్వరలోనే ఇస్తామన్నారు. న్యాయస్థానాల్లో కేసులు వేసిన వారితో సంప్రదింపులు చేస్తామని తెలిపారు. నూకాలమ్మ రహదారి విస్తరణ పనులు చేపడతామని వివరించారు.

# ఆవకు రక్షిత కవచం

అచ్యుతాపురం : జిల్లాకే విశిష్టమైన కొండకర్ల ఆవను సంరక్షించడానికి ఎట్టకేలకు అధికారులు ముందుకొచ్చారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యపు కోరలకు చిక్కి రూపు కోల్పోతున్న ఈ జలవనరును భద్రంగా కాపాడేదిశగా కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించారు. అరుదైన జీవజాలం మనుగడకు, ఈ ప్రాంత రైతులకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొల్లేరు తరవాత అతిపెద్ద మంచినీటి సరస్సు కొండకర్ల ఆవ. అచ్యుతాపురం, మునగపాక మండలాల పరిధిలో చుట్టూ కొండల మధ్య సువిశాలంగా విస్తరించి ఉంటుంది. పర్యాటకంతోపాటు పరిసర రైతులకు సాగునీటికి, ఈ ప్రాంతంలో భూగర్భజలాల పెంపునకు ఇది దోహదపడుతోంది. అనకాపల్లి శారదా నది నుంచి కొండకర్ల ఆవకు వర్షాకాలంలో ప్రతి ఏడాది నీరు వస్తుంది. దేశ, విదేశాలకు చెందిన 170 రకాలైన పక్షులు ఆవలో నివాసం ఏర్పాటు చేసుకుని సంతానోత్పత్తి చేస్తుంటాయి. వీటితోపాటు అరుదైన నీటి కుక్కలు, పిల్లులు ఇక్కడ నివాసం ఉంటాయి. తూర్పుకోస్తా పరిరక్షణ నిపుణుల బృందం ఇటీవల కొండకర్ల ఆవలో సర్వే నిర్వహించి ఇక్కడ అరుదైన నీటికుక్కలతోపాటు అంతరించిపోయే జాతుల్లో ఉన్న కుందేళ్లు, కొండచిలువలు, అరుదైన చేపలు ఇక్కడ ఉంటున్నాయని నిర్ధారించారు. ఆవ చుట్టూ ప్రత్యేకమైన ట్రాప్ కెమెరాలను ఏర్పాటుచేసి



మరీ వీటి ఉనికిని గుర్తించారు. జీవవైవిధ్య నిధిగా మారిన కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడంతో వీటన్నింటికీ రక్షణ లభిస్తుంది. పర్యాటకం నిమిత్తం పర్యావరణాన్ని ధ్వంసం చేయకుండా ఈ నిర్ణయం దోహదపడుతుంది. ప్రస్తుతం ఆవ స్వరక్షణకు సంబంధించి ఏ శాఖా బాధ్యత వహించడం లేదు. పర్యాటక, జలవనరుల శాఖ రెండూ ఇది తమకు సంబంధించి వ్యవహారం కాదంటూ తప్పుకొంటున్నాయి. రక్షిత ప్రాంతంగా ప్రకటించిన నేపథ్యంలో ఇకపై కొండకర్ల ఆవలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. జంతువుల వేట, చెట్ల నరికివేతపై నిషేధం ఉంటుంది.

విస్తీర్ణం : 2 వేల ఎకరాలు

ఆధారపడిన గ్రామాలు: 25

మత్స్యకార కుటుంబాలు : 250

పర్యాటకుల సంఖ్య : ఏటా 20 వేల వరకు

గుర్తించడం ఆనందం : కొండకర్ల ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడం చాలా ఆనందంగా ఉంది. దీని పరిధిలో రైతులతోపాటు దీనిపై ఆధారపడే మత్స్యకారులకు ఈ నిర్ణయంతో ఎంతో మేలు జరిగింది. వెంటనే సర్వే నిర్వహించి చుట్టూ హద్దులు పక్కాగా నిర్ణయించాలి. రక్షిత ప్రాంతంగా గుర్తించడం వల్ల ఈ జలవనరును భవిష్యత్తులో ఆక్రమణల పాలవకుండా రక్షించడానికి అవకాశం ఉంటుంది.


కాండ్రేగుల జోగినాయుడు, ఆవనీటి సంఘం అధ్యక్షుడు, హరిపాలెం

మత్స్యకారులకు మేలు : కొండకర్ల ఆవపై ఆధారపడిన కొండకర్ల, వాడ్రాపల్లికి చెందిన పలు కుటుంబాలు చేపల వేటతోపాటు ప్రకృతి ప్రేమికులకు ఆవ అందాలను చూపిస్తూ జీవనం సాగిస్తున్నాయి. ఆవను రక్షిత ప్రాంతంగా గుర్తించడం వల్ల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతోంది. ఆక్రమణలను అడ్డుకోవడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుంది. మత్స్యకారులు మేలు జరిగే నిర్ణయంగా భావిస్తున్నాం. పిల్లి గోవిందరావు, మత్స్యకారుడు, కొండకర్ల

# పూర్వ వైభవం దిశగా గోదావరి!

ఉండి : పశ్చిమలో ఖరీఫ్ వరి సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. గత ప్రభుత్వ హయాంలో కాలువల అభివృద్ధి, నిర్వహణ పనులపై నిర్లక్ష్యం వహించడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. ఇటీవల పలు చోట్ల కాలువల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టడంతో ఈ సారి 3 వేల ఎకరాల్లో అదనంగా వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

ఎంటీయూ 1318 రకానిదే అగ్రస్థానం.. జిల్లాలో వరి సాగుకు అనువైన భూముల విస్తీర్ణం 2.89 లక్షల ఎకరాలు. గతేడాది 2.05 లక్షల ఎకరాల్లోనే పంట పండింది. ఈ ఏడాది 2,08,736 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. ప్రధానంగా ఎకరానికి 3,050 కిలోల వరకు ఉత్పత్తినిచ్చే ఎంటీయూ 1318 వరి రకాన్ని 97,834 ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉందని గుర్తించారు. తర్వాత స్థానంలో ఎంటీయూ 7029 (స్వర్ణ) 47,505 ఎకరాల్లో, పీఆర్ 126 రకం 11,290 ఎకరాల్లో సాగయ్యే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సాగుకు



52,500 క్వింటాళ్ల విత్తనాలు అవసరం. రైతుల నుంచి అత్యధికంగా 47,675 క్వింటాళ్ల వరకు సేకరించుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల నుంచి 4,600 క్వింటాళ్లు అందుబాటులో ఉంటాయి. మరో 225 క్వింటాళ్ల విత్తనాలను రాయితీపై శాఖాపరంగా సరఫరా చేయనున్నారు.

**1.05 లక్షల మందికి సీసీఆర్‌సీ కార్డులు**

ఈ ఏడాది 1,05 లక్షల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులివ్వాలనేది లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు ఒక్క శాతం కూడా పంపిణీ పూర్తి కాలేదు. తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో అత్యధికంగా 40,004, తదుపరి స్థానాల్లో నరసాపురం- 38,297, భీమవరం- 26,299 మందికి కార్డులివ్వాలనేది లక్ష్యం.

గతేడాది కౌలు రైతులకు రూ.357 కోట్ల మేర రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా రూ.247 కోట్లే అందించగలిగారు. ఈ ఏడాది ఆ మొత్తాన్ని అధిగమించాలనే యోచనతో ముందుకెళ్తున్నారు. మొత్తం రుణ ప్రణాళిక రూ.5,050 కోట్లుగా నిర్దేశించుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. నారుమడులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కాలువలకు నీరొచ్చిన వెంటనే రైతులు నారుమడులు వేసుకోవాలని సూచించారు.

## మరీ.. ఇంత జాప్యమా?

చిత్తూరు : కొత్త బియ్యం కార్డు పొందాలనుకుని ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న వారికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించింది.. ఈ నేపథ్యంలో దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా అందుతున్నాయి.. నిర్దేశిత రోజుల్లో బియ్యం కార్డుల సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.. అయితే కొందరు మండల, క్షేత్రస్థాయి అధికారులు దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. కొన్ని మండలాల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులతోపాటు దళారులు వసూళ్ల పర్వం మొదలుపెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మే ఏడో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు.. జిల్లాలో ఇప్పటి వరకు 39,791 దరఖాస్తులు అందాయి.. వీటిని సత్వరమే పరిశీలించి ఆమోదించడంలో రెవెన్యూ అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని దరఖాస్తులు ఆరోపిస్తున్నారు.

**అర్బన్‌లోనే భారీగా పెండింగ్..**

బియ్యం కార్డులకు సంబంధించి లబ్ధిదారులు ఏడు రకాల సేవలకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటారు. క్షేత్రస్థాయి అధికారులు వాటిని పరిశీలించి అర్హుల దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌కు పంపుతారు. తహసీల్దార్ డిజిటల్ కీతో ఆమోదించగానే నూతన కార్డుల జారీతో పాటు అన్ని సేవలు పూర్తవుతాయి. చిత్తూరు



అర్బన్‌లో బియ్యం కార్డుల సమస్యలకు 2,314 దరఖాస్తులు అందాయి. వీటిలో 1,540 దరఖాస్తులు తహసీల్దార్ లాగిన్‌లోనే నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా చిత్తూరు అర్బన్‌లో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు స్పందించి నిర్దేశిత లక్ష్యం ప్రకారం బియ్యం కార్డు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**వచ్చిన దరఖాస్తులు ఇలా..**

చిరునామా మార్పు : 841
ఆధార్ సవరణకు : 532
సభ్యుల చేరికకు : 30,464
సభ్యుడి తొలగింపునకు : 672
కొత్త కార్డుకు : 3,926
కార్డు విభజనకు : 3,301
కార్డు సరెండర్ : 41
చౌక దుకాణం నవీకరణకు : 14

## కన్నలి కాల్వకు.. తూట్లు

శ్రీకాళహస్తి : స్థిరాస్తి వ్యాపారులు, రైస్ మిల్లర్లు కన్నలి కాల్వకు తూట్లు పొడుస్తున్నారు. శ్రీకాళహస్తిలోని దాదాపు ఏడు వార్డులకు సంబంధించిన కాల్వల్లో వచ్చే వర్షపునీరు వెళ్లేందుకు వీలుగా ఈ కాల్వను అభివృద్ధి చేశారు. పట్టణం నుంచి తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం మీదుగా కన్నలి చెరువు వరకు లింకు కాల్వ ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ కాల్వ అభివృద్ధికి తెదేపా హయాంలో పురపాలక సంఘానికి చెందిన రూ.2 కోట్లు నిధులు వెచ్చించి పటిష్ఠ పరిచారు. వైకాపా హయాంలో నిధులు ఇస్తామంటూనే పుణ్యకాలాన్ని పూర్తిచేశారు. ఈ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

**అడుగడుగునా తవ్వకాలు..**



జలవనరుల శాఖ పరిధిలో ఉన్న ఈ కాల్వల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటే విధిగా సంబంధిత అధికారులు ఆమోదం అవసరం. అయితే ఇటీవల కాలంలో వ్యాపారులు, రైస్ మిల్లర్లు తమంతట తాము కాల్వను తవ్వేసి పైపులు వేసుకుంటున్నారు. ఇలా పైపులు అమర్చుకోవడంతో కాల్వ వెడల్పు తగ్గిపోవడంతో పాటు రానున్న రోజుల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారే అవకాశముంది. రాత్రికి రాత్రి ఓ రైస్‌మిల్ యజమాని జేసీబీ సాయంతో ఎంచక్కా కాల్వను తవ్వేసి పైపులు అమర్చడం పట్ల విమర్శలు గుప్పుమన్నాయి. దీంతో చాలా దూరం కాల్వ పూర్తిగా పూడిపోయింది. మళ్లీ కాల్వ తవ్వకాలు చేపట్టాలంటే వ్యయంతో కూడిన పని. ఇలాంటి అనధికారిక తవ్వకాలు జరగకుండా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది. కాల్వలో పైపులు అమర్చుకునేందుకు ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. పనులు చేస్తుండటం మా దృష్టికి వచ్చింది. అక్కడి ఆయకట్టు ఛైర్మన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించాం. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం .నాగరాజు, ఏఈ, జలవనరుల శాఖ, తొట్టంబేడు

## హస్తకళల అభివృద్ధిలో అస్త్రసన్యాసం

శ్రీకాళహస్తి : హస్తకళలకు కాణాచిగా శ్రీకాళహస్తి ఎంతో ప్రాభవం సంతరించుకుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాటి అభ్యున్నతికి కేంద్ర జౌళిశాఖ సైతం స్పందించి హస్తకళా గ్రామం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వైకాపా ప్రభుత్వం పుణ్యామాని పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

శ్రీకాళహస్తి కలంకారీతోపాటు ఇక్కడి కొయ్యబొమ్మలకు ఎంతో గుర్తింపు ఉంది. ఏర్పేడులోని మాధమాల, పాపానాయుడుపేట, కేవీబీపురంలోని కర్లపూడి, బీఎన్‌కండ్రిగలోని పల్లమాలతోపాటు తిరుపతి గ్రామీణ ప్రాంతాల్లో వెదురుతో తయారు చేసే ఎన్నో వస్తువులకు డిమాండ్ ఉంటోంది. చేనేత వస్త్రాలకు గుర్తింపు లభిస్తోంది. పర్యాటకుల ఆసక్తికి తగ్గట్టు హైదరాబాదులోని హైటెక్‌సిటీ తరహాలో ఇక్కడ హస్తకళల గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు భవన నిర్మాణ పనులు 2020 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఆర్అండ్‌బీ పర్యవేక్షణలో జరిగే ఈ పనులకు ప్రభుత్వం రూ.7.5 కోట్లు నిర్ణయించింది. తొలివిడతగా రూ.4.77 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వివిధ కళలకు అవసరమైన రీతిలో భవనాలు నిర్మించారు. వసతుల కల్పనకు మరింత నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అనుకున్న ప్రకారం 2022 జూన్ నాటికి పనులు పూర్తికావాల్సి ఉండగా వైకాపా ప్రభుత్వం నిస్తేజంగా వ్యవహరించింది.

**అసాంఘిక కార్యక్రమాలు**

హస్తకళా గ్రామం ఏర్పాటుకు నిర్మించిన భవనాలు అసంపూర్తిగా ఉండటంతో శిథిలాలుగా మారుతున్నాయి. ఇదివరకు తిరుపతి–రేణిగుంట రోడ్డుకు సమీపంలో ఉండగా ఆరు వరుసల జాతీయ రహదారి పనులతో ఇక్కడి భవనాలు మరుగునపడిపోయాయి. దీంతోపాటు ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు ఆనవాళ్లుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందని హస్త కళాకారులు ఎంతో ఆశతో ఉన్నారు.

# లేదు పర్మిట్టు.. అమ్మేస్తున్నారు ఇష్టం వచ్చినట్టు!



అనంతపురం : జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దుకాణాలను దక్కించుకున్న గుత్తేదారులు లాభాపేక్షతో ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా రేయి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. మద్యం అమ్మకాలు మూడు పువ్వులు..ఆరు కాయలుగా విరాజిల్లుతున్నాయి. నగరంలో 30 దుకాణాలు ఉండగా, రూరల్‌లో 4 ఉన్నాయి.

**ప్రతి దుకాణానికీ..**

ప్రతి దుకాణం వద్ద అనధికారికంగా గదులు, డాబాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివారులోని రుద్రంపేట వద్ద దుకాణం నివాస గృహాల మధ్య ఉంది. దుకాణం గోదాముకు అనుసంధానంగా ఉంది. అర్ధరాత్రి దాకా అమ్మకాలు జరుగుతుంటాయి. మందుబాబులు మత్తులో అల్లరి చేస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నారు.
అలాగే కళ్యాణదుర్గం బైపాసు నుంచి బళ్లారి బైపాసు కూడలి మధ్య సర్వీసు రోడ్డుకు ఆనుకుని ఉన్న ఓ దుకాణం.. ఆ దుకాణం ఉన్న భవనం పైభాగాన్ని పర్మిట్టు గదిగా ఏర్పాటు చేశారు.
నగరంలో సోమనాథనగర్‌కు సమీపంలో ఉన్న దుకాణంలో కొనుగోలు చేసిన వారు తాగడానికి వెనుకభాగంలో డాబా ఏర్పాటు చేశారు.

**ఎమ్మార్పీ ధరలపై రూ.10 అదనం**

ప్రతి మద్యం సీసాపై ప్రభుత్వం 14 శాతం కమిషన్ ఇస్తోంది. ఇది చాలదన్నట్లు గుత్తేదారులు సీసాపై రూ.10లు అదనంగా అమ్ముతున్నారు. మీడియాలో కథనాలు, ఫిర్యాదులు వెళ్లడంతో ఇటీవల పాతూరులోని ఓ దుకాణంలో తనిఖీలు నిర్వహించగా ధరలు పెంపు నిజమేనని తేలింది.

**లోపించిన పర్యవేక్షణ**

అబ్కారీ అధికారుల పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉండటంతో మద్యం అమ్మకాల్లో నిబంధనలు, ఆదేశాలను గాలికి వదిలేస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నెలకు రూ. 20 వేలు (ఇందులో ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు రూ.10 వేలు), ఈఎస్ కార్యాలయానికి రూ.13 వేలు, స్టేటు టాస్క్‌ఫోర్స్‌కు రూ.3 వేలు, లోకల్ పోలీస్ స్టేషనుకు రూ.25 వేల చొప్పున దుకాణదారులు మామూళ్లు సమర్పిస్తున్నట్లు తెలిసింది.

**నిబంధనలు పాటించాల్సిందే**నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, అనంతపురం ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి దుకాణదారుడు నిబంధనలు పాటించాల్సిందే. దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10వరకు మాత్రమే నడవాలి. ఎన్‌ఫోర్స్‌మెంటు, టాస్క్‌ఫోర్సు, స్థానిక ఎక్సైజ్ స్టేషన్ల పోలీసుల ద్వారా దాడులు చేయిస్తాం. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మితే జరిమానాతో పాటు దుకాణం అనుమతులు రద్దు చేస్తాం.

# పరిహారం.. అయోమయం..!



అనంతపురం : ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్న బైపాస్ నిర్మాణంలో పరిహారం అందక భూనిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. భూమి సేకరించిన తర్వాత పరిహారం తక్కువగా ఇస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఒప్పుకోవడం లేదు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటూ వారు హెచ్చరికలు చేస్తున్నారు. తమకు పరిహారం పెంచే వరకూ ముదిగుబ్బలోని బైపాస్ నిర్మాణ పనులు జరగనివ్వమని గత నెల 26వ తేదీ నుంచి రైతులు ఆందోళన చేస్తున్నారు. వారం రోజులుగా నిర్మాణ పనులు అడ్డుకుంటూ నిరసనలు చేపట్టారు.

**1.6 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణం**

342వ జాతీయ రహదారిని ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి రూ.300 కోట్లతో 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. అందులో భాగంగా ముదిగుబ్బలో 1.6 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణానికి 16 ఎకరాల భూమిని సేకరించారు. సుమారు 20 మంది రైతులు భూములు కోల్పోతున్నారు. ముదిగుబ్బ శివారులో ఎకరం భూమి మార్కెట్ విలువ ప్రకారం రూ.కోటి ధర పలుకుతుంటే రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా రూ.లక్షల్లో పరిహారం అందజేస్తున్నారు. అందులో గుంజేపల్లి పరిధిలోని భూములకు ఎకరానికి రూ.12 లక్షలు, దొరిగల్లు పరిధిలోని భూములకు రూ.7.5 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు ఒప్పుకోవడంలేదు. వరుసగా ఐదు రోజులు నిర్మాణ పనులను అడ్డుకుని ధర్నా చేశారు.

**గడువులోపు పూర్తయ్యేనా..?**

ముదిగుబ్బ నుంచి కోడూరు మధ్య 342వ జాతీయ రహదారి నిర్మాణ పనులు 2023లో ప్రారంభమయ్యాయి. ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి, గోరంట్ల మీదుగా చిలమత్తూరు మండలంలోని కోడూరు వరకు 80 కిలోమీటర్ల రోడ్డు నిర్మిస్తున్నారు. మొదటి విడతలో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తికి 90 శాతం పనులు పూర్తయ్యాయి. ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల పరిధిలోని ఆర్వోబీ, కల్వర్టుల దగ్గర పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. పుట్టపర్తి సమీపంలో రోడ్డు నిర్మాణం ఇంకా చేపట్టాల్సి ఉంది. అలాగే పుట్టపర్తి నుంచి కోడూరు మధ్యలో నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరులోపు పనులు పూర్తికావాల్సి ఉండగా ఇంకా ముదిగుబ్బలో భూనిర్వాసితులు ఆందోళనలు చేస్తుండటంతో గడువులోపు పూర్తవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

గిడ్డయ్య, ఎన్‌హెచ్ డీఈ, పుట్టపర్తి
భూసేకరణ చట్టం 2013 ప్రకారం రిజిస్ట్రేషన్ విలువ కంటే రెండున్నర రెట్లు ఎక్కువగా పెంచి పరిహారం ఇస్తున్నాం. అందుకు రైతులు ఒప్పుకోవడం లేదు. భూపరిహారం పెంచాలని రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

# పట్టు రైతులకు కలిసొచ్చిన కాలం

అనంతపురం : వేసవి కాలంలో ఎన్ని జాగ్రత్తలు పాటించినా బైవోల్టిన్ పట్టు పంట చేతికి రావటం కష్టం. ఈ సంవత్సరం ఎండ తీవ్రత కొద్దిరోజులకే పరిమితం కావటం, జూన్‌లో కురవాల్సిన వర్షాలు మే నెలలోనే రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రతికూల కాలంలో పట్టు రైతుల చేతికి పంటలు అందాయి. ఇదే సమయంలో మార్కెట్లో ధరలు నిలకడగా ఉండటంతో కొంత గిట్టుబాటు లభించింది. వేసవిలో పంటలు చేతికి అందవని రైతులు మల్బరి ఆకును ఔషధ తయారీకి విక్రయించేందుకు పూనుకొన్నారు. దీనికి తోడు పంటలు చేతికి అందటం, మార్కెట్లో గూళ్ల ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు తిరిగి పట్టు సాగుపై దృష్టి సారించారు.

**మార్కెట్కు పెరుగుతున్న రాబడి** హిందూపురం మార్కెట్‌కు పట్టుగూళ్ల రాబడి రోజురోజుకు పెరుగుతోంది. గత సోమవారం 5 టన్నులు, మంగళవారం 6, బుధవారం 4 టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు వచ్చాయి. ఈ గూళ్లు అత్యధికంగా కిలో రూ.706, అతి తక్కువగా రూ.366, సరాసరి రూ.550 ధరలు పలికాయి. గడచిన రోజుల్లో స్థానిక మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేవని మడకశిర తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కర్ణాటక ప్రాంతం శిడ్లఘట్ట, రాంనగర్‌లకు పట్టుగూళ్లు తీసుకునివెళ్లేవారు ప్రస్తుతం ధరలు స్థానికంగానే అధికంగా ఉండటంతో రైతులు ఇక్కడికే గూళ్లు తీసుకొస్తున్నారు. దీనివల్ల గూళ్లకు ఇతర ప్రాంత్రాలకు వెళ్లుతున్న రీలర్లు స్థానికంగానే గూళ్లను కొనుగోలు చేస్తూ రీలింగ్ యూనిట్ల



ద్వారా సిల్క్ తీస్తున్నారు.

**వాతావరణ మార్పులు సహకరించాయి**గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ సంవత్సరం వాతావరణంలో ఏర్పడిన మార్పులు బైవోల్టిన్ పట్టురైతులకు ఎంతో సహకరించాయి. వేసవిలో రైతులు ఎన్ని జాగ్రత్తలు తీసుకొన్నా పంటలు చేతికి అందేవి కావు ప్రస్తుతం వందగుడ్లకు వంద కిలోల గూళ్ల దిగుబడి వస్తోంది. ఇది ఎంతో శుభపరిణామంసురేశ్, పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు, హిందూపురం

## మంగళంపాడు చెరువులో మళ్లీ మట్టి తవ్వకాలు

సూళ్లూరుపేట : డివిజన్‌లో మట్టి తవ్వకాలు ఆగడం లేదు. వీటిని అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తుంది. దాంతో మట్టి, గ్రావెల్ అక్రమార్కుల దందా యథేచ్ఛగా జరుగుతుంది. అసైన్మెంట్, ప్రభుత్వ భూములు, పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. సూళ్లూరుపేట పురపాలక సంఘానికి సంబంధించి మండలంలోని మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఇక్కడ రూ.120 కోట్లతో వేసవి నీటి నిల్వ ట్యాంకు, దీనికి అనుబంధంగా గొట్టాలు పూడ్చడం, పురపాలికలో పలుచోట్ల నీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నారు. మంగళంపాడు చెరువులో ఎస్ ఎస్ ట్యాంక్ నిర్మిస్తున్న స్థలం పక్కనే రెండు రోజుల నుంచి రాత్రివేళ మట్టి, గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుపుతున్నారు. రాత్రివేళ గుట్టు చప్పుడు కాకుండా పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు జరిపి పెద్ద టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేట ప్రాంతంలోని



స్థిరాస్తి క్షేత్రాలకు తరలిస్తూ దందా ముఠా రూ.లక్షలు గడిస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా అక్రమార్కులకు అధికార పార్టీ నేతలతో పాటు అధికారుల అండదండలతో రాత్రివేళ మంగళంపాడు చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో అధికారులు ఇటువైపు చూడడం లేదు. ఇప్పటికీ ఈ చెరువులో మట్టి తవ్వకాలతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. చెరువులో మట్టి తవ్వకాలు జరగకుండా చూడాలని ప్రజారోగ్య శాఖ ఇంజనీర్లు పలుమార్లు పోలీసులు, జలవనరుల, రెవెన్యూ శాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. అయినా పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జల వనరుల శాఖ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా ఆయన సమాధానం దాటవేశారు.

## దశాబ్దాల సమస్యకు పరిష్కారం

పుత్తూరు : తిరుపతి బైపాస్ రోడ్డులోని కేవీఎం ఆసుపత్రి సమీప నూతన ఆర్వోబీ అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్‌కు మోక్షం లభించింది. తిరుపతి–చెన్నై 205 జాతీయ రహదారి విస్తరణ పనులు చంద్రగిరి సమీప కాలూరు క్రాస్ నుంచి పుత్తూరు మరాఠీగేటు వరకు 2010లో రూ.600 కోట్లతో ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ చేపట్టింది. సదరు పనులు పూర్తికాకనే ఆ గుత్తేదారు సంస్థ ఎస్వీపురం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేసి టోలు వసూలు చేసింది. అప్పట్లో కాలూరు క్రాస్, కేవీఎం ఆసుపత్రి వద్ద ఆర్వోబీ, గాజులమండ్యం వద్ద రోడ్డు పనులు, పాదిరేడు వద్ద రోడ్డు, వంతెన, టోల్‌ప్లాజా వద్ద అసంపూర్తి పనులు, పుత్తూరు గోవిందపాళెం వద్ద రోడ్డు, నారాయణవనం బైపాస్ రోడ్డు వద్ద పైవంతెన పనులు ఆగిపోయాయి. వీటిని చేపట్టాలని ప్రజాప్రతినిధులు సైతం వినతులు ఇచ్చారు. ఎట్టకేలకు 2023 జూన్‌లో రూ.120 కోట్లు ఆయా పనులు చేపట్టేందుకు మంజూరు చేశారు. టెండర్లు పిలిచి గుత్తేదారులకు పనులు అప్పగించారు.

**సాగిన పనులు..**



2023 జూన్‌లోనే పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. దీనిపై పలుమార్లు కథనాలు వెలువడటంతో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఎప్పటికప్పుడు గుత్తేదారులపై ఒత్తిడి పెంచారు. ఎట్టకేలకు గాజులమండ్యం మినహా అన్ని అసంపూర్తి పనులు చేపట్టారు. అందులో భాగంగా పూడి–రేణిగుంట రైల్వే స్టేషన్ల మధ్య కేవీఎం ఆసుపత్రి సమీపంలోని ఆర్వోబీ నిర్మాణం గతేడాది విజయదశమి నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. అయితే రైల్వే అధికారుల అనుమతులు ఆలస్యం కావడంతో పలుమార్లు కలెక్టర్ వెంకటేశ్వర్, హైవే అధికారులు వారితో మాట్లాడి అనుమతి తీసుకుని వంతెన నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో ప్రస్తుతం వంతెనపై రాకపోకలు మొదలయ్యాయి. దీంతో ఇక తిరుపతి–చెన్నై, పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్లే. గతంలో ఒకే మార్గం ఉండటంతో నిత్యం ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేది. ప్రస్తుతం వంతెన పూర్తి కావడంతో ఆ కష్టాలు తీరాయని వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చిగురిస్తున్న.. చింత ధరలు

పుంగనూరు : ఏడాది పొడవునా ఉపాధి లభించే చింత పరిశ్రమ నష్టాల ఊబి నుంచి గట్టెక్కనుంది. రెండేళ్లుగా చింత వ్యాపారం నష్టాల బాటలో సాగడంతో వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఈ సీజన్‌లో ప్రస్తుత ధరలు వ్యాపారులకు ఊరటనిస్తున్నాయి. ఏటా ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో పొట్టు కాయను స్థానిక వ్యాపారులు దిగుమతి చేసుకోవడం పరిపాటి. గతంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచగా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఎగుమతులు ఊపందుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు.

**ఏడాది పొడవునా ఉపాధి..**

స్థానికంగా లభ్యమయ్యే చింతపండుతోపాటు పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. సాధారణంగా సీజన్‌లో ఇక్కడ నిల్వ చేసుకుని తిరిగి అవసరాలకు అనుగుణంగా ఏడాది పొడవునా వివిధ ప్రాంతాలకు చపాతీ, పూపండు, కరిపులి రకాలుగా విభజించి ఎగుమతి చేస్తారు. కట్టెకాయ నుంచి వివిధ రకాల పండుగా విభజించే వరకు కూలీలతో పని ఉంటోంది. దీంతో ఇక్కడ ఏడాది పొడవునా కూలీలకు ఉపాధి లభిస్తుంది.

# బీచ్‌లు సిస్టర్స్ ముద్దు రచ్చ రచ్చ

టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు అనడంలో సందేహం లేదు. సుదీర్ఘ కాలంగా కాజల్ అగర్వాల్ టాలీవుడ్‌లో కొనసాగుతోంది. గత రెండు మూడు సంవత్సరాలుగా కాజల్ సినిమాలు తగ్గాయి, కానీ ఆమెకు ఉన్న క్రేజ్ మాత్రం తగ్గలేదు. పెళ్లి చేసుకుని, తల్లి అయిన తర్వాత కూడా ముందులా నటించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ టాలీవుడ్‌లో ఆమెకు మునుపటి మాదిరిగా సినిమా ఆఫర్లు రావడం లేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి ఉన్న గౌరవం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హీరోయిన్‌గా కాజల్ చేసిన ఎన్నో సినిమాలు సూపర్ డూపర్ హిట్‌గా నిలిచాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర భాషల్లోనూ నటించి మెప్పించిన ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్ అనే విషయం తెల్సిందే. ఇటీవల మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప' సినిమాలోనూ అత్యంత కీలకమైన పార్వతిదేవి పాత్రలో కాజల్ అగర్వాల్ నటించి మెప్పించింది. ఈ మధ్య కాలంలో లీడ్ రోల్స్ కాకుండా ఇలా గెస్ట్ అప్పియరెన్స్ ఇస్తూ వస్తున్న కాజల్ అగర్వాల్ ఛాన్స్ లభిస్తే లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించేందుకు, యాక్షన్ సీన్స్ కు కూడా రెడీ అన్నట్లుగా చెప్పుకొచ్చింది.



హీరోయిన్‌గా సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న కాజల్ అగర్వాల్ ఇప్పటికీ అదే అందం, అదే ఫిజిక్‌తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. తాజాగా మరోసారి కాజల్ అగర్వాల్ ఫోటోలు ఇన్‌స్టాలో వైరల్ అవుతున్నాయి. ఈసారి ఆమె సిస్టర్ నిషా అగర్వాల్‌తో ఉన్న ఫోటోలు కావడంతో పాటు బీచ్‌లో బికినీలో ఉండటంతో మరింతగా చూపు ఆకర్షిస్తున్నాయి. కాజల్ అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ట్రిప్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రిప్‌లో తీసుకున్న ఫోటోలను అప్పుడప్పుడు షేర్ చేస్తూ వస్తుంది. తాజాగా నిషా అగర్వాల్ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. కాజల్ అగర్వాల్‌కి బీచ్‌లో కూర్చుని ముద్దు పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు సిస్టర్స్ బీచ్‌లో బికినీలో ఉన్నారు. సాధారణంగానే ముద్దుగుమ్మలు బీచ్‌లో బికినీలో ఉంటే చూపు తిప్పడం కష్టం. అలాంటిది ఇద్దరు సిస్టర్స్ బికినీలో ఉండటంతో చూపు తిప్పలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ మాత్రమే కాకుండా నిషా అగర్వాల్ కూడా చాలా అందంగా ఉందని నెట్టింట కామెంట్స్ వినిపిస్తున్నాయి. సముద్రంలో వీరిద్దరూ సరదాగా తీసుకున్న ఈ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ కావడంతో నిషా అగర్వాల్‌కి అదృష్టం కలిసి రాలేదు కానీ, స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశం దక్కి ఉంటే తప్పకుండా పెద్ద హీరోయిన్‌గా పేరు దక్కించుకుని ఉండేది అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిషా అగర్వాల్ పలు సినిమాల్లో నటించినప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో హిట్ పడలేదు. దాంతో అక్క కాజల్ కంటే ముందే పెళ్లి చేసుకుని వైవాహిక జీవితంలో స్థిర పడింది. ఇప్పుడు చెల్లితో పాటు అక్క కాజల్ అగర్వాల్ కూడా సంసార జీవితంలో స్థిర పడింది. వీరిని ఇలా చూసిన వారు చాలా మంది ఇద్దరు కలిసి ఏదైనా ఒక సినిమాలో నటిస్తే బాగుండేది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తున్నారు.

# రష్మిక ది గర్ల్ ఫ్రైండ్ కి బంపర్ ఆఫర్..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న రీసెంట్ గా కుబేర తో మరో సూపర్ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. కుబేర సినిమాలో రష్మిక రోల్ చాలా ఎక్కువ రన్ టైం తో ఉన్నా కూడా ఆమె ఇంపాక్ట్ సినిమా అంతా ఉంది. అందుకే రష్మిక ఈ సినిమా సక్సెస్ లో భాగమైంది అన్నట్టుగా చెప్పొచ్చు. అదీగాక రష్మిక సినిమాలో ఉంటో లక్ కలిసి వస్తుంది అన్నది మరోసారి కుబేరాతో ప్రూవ్ అయ్యింది. కుబేర సినిమా తెలుగులో సూపర్ హిట్ కాగా కోలీవుడ్ లో ఆశించిన రేంజ్ రీచ్ అందుకోలేదు. ఇదిలా ఉంటే రష్మిక కుబేర హిట్ అవ్వడంతో ఆమె చేస్తున్న నెక్స్ట్ సినిమాల మీద ఆ ఎఫెక్ట్ ఉంది. రష్మిక ప్రస్తుతం ది గర్ల్ ఫ్రెండ్ సినిమా చేస్తుంది. ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి మేల్ లీడ్ గా నటిస్తున్నాడు. దసరా సినిమాలో అతని ప్రతిభ చాటాడు. ది గర్ల్ ఫ్రెండ్ లో రష్మికతో స్క్రీన్ షేర్ చేసుకుంటున్నాడు. ఐతే వరుస సినిమాలు హిట్లు కొడుతుండటం వల్ల రష్మిక చేస్తున్న ది గర్ల్ ఫ్రెండ్



సినిమాకు సూపర్ డిమాండ్ ఏర్పడింది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే రష్మిక ఉన్న ఫాం చూసిన హిందీ మేకర్స్ ఆమె నటిస్తున్న ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను భారీ మొత్తానికి కొనేశారట. మిగతా భాషల్లో కూడా ఆ సినిమాకు మంచి బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. రష్మిక సినిమాలో ఉంది అంటే నేషనల్ వైడ్ గా డిస్ట్రిబ్యూటర్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఆ ఇంపాక్ట్ తో ది గర్ల్ ఫ్రెండ్ సినిమా బిజినెస్ అనుకున్న దానికన్నా బాగా జరిగిందని తెలుస్తుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమా కూడా హిట్ పడితే మాత్రం తప్పకుండా రష్మిక రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంటుంది. ఇప్పటికే బాలీవుడ్ టాలీవుడ్ అన్న తేడా లేకుండా పాన్ ఇండియా లెవెల్ లో దూసుకెళ్తుంది.. రష్మిక ఫిమేల్ సెంట్రిక్ మూవీగా చేస్తున్న ది గ్రల్ ఫ్రెండ్ హిట్ అయితే బాలీవుడ్ లో కూడా ఇలాంటి మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంటుంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమాను రాహుల్ రవింద్రన్ డైరెక్ట్ చేస్తున్నాడు. రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ రిలీజ్ ఎప్పుడు సినిమా అప్డేట్స్ ఎప్పుడిస్తారంటూ నేషనల్ క్రష్ ఫ్యాన్స్ సూపర్ ఎగ్జైటెడ్ గా ఉన్నారు.





# జూలై ఫస్ట్ వీక్.. మూడు సినిమాలు.. మూడు జోనర్లు..



ఎప్పటిలానే జూలై ఫస్ట్ వీక్ లో పలు సినిమాలు థియేటర్స్ లో సందడి చేసేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మూడు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఇక్కడ విశేషమేమింటే.. మూడు సినిమాలు.. మూడు విభిన్న జోనర్స్ లో రూపొందాయి. దీంతో ప్రతి ఒక్క మూవీ కచ్చితంగా ఆడియన్స్ ను స్పెషల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందనే చెప్పాలి. అయితే జూలై 4వ తేదీన టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ నటించిన తమ్ముడు మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే రోజు హీరో సిద్ధార్థ్ యాక్ట్ చేసిన 3 బీహెచ్ కే మూవీ తెలుగు, తమిళంలో థియేటర్స్ రిలీజ్ కానుంది. ఆ రెండింటితోపాటు జురాసిక్ వరల్డ్ డొమినియన్ సినిమాకు సీక్వెల్ గా రూపొందిన జురాసిక్ వరల్డ్ రీ బర్త్ మూవీ సందడి చేయనుంది. అక్క- తమ్ముడు అనుబంధాలతో అల్లుకున్న స్టోరీతో నితిన్ తమ్ముడు మూవీ రూపొందుతున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. దీంతో పాటు క్రీడా నేపథ్య అంశాలు కూడా యాడ్ చేశారు మేకర్స్. ఆర్చరీ ప్లేయర్ గా నితిన్ కనిపించనున్నారు. ఆయనకు నితిన్ అక్కగా సీనియర్ నటి లయ నటించారు. ఈ సినిమాతోనే ఆమె రీఎంట్రీ ఇస్తున్నారు. దిల్ రాజు గ్రాండ్ గా నిర్మించగా, సెన్సార్ బోర్డు నుంచి ఏ సర్టిఫికెట్ అందుకున్న తమ్ముడు మేకర్స్.. ఇప్పుడు రిలీజ్ కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. కచ్చితంగా హిట్ అందుకుంటామనే నమ్మకంతో ఉన్నారు. మరోవైపు, హీరో సిద్ధార్థ్.. ఇప్పుడు 3 బీహెచ్ కే మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా శ్రీగణేశ్ తెరకెక్కిస్తున్నారు. కామెడీ, భావోద్వేగాలు, డ్రామాతో రూపొందుతున్న ఆ సినిమాను అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. శరత్ కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మీతా రఘునాథ్, చైత్ర ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. ఇంటిల్లిపాదినీ అలరించే, అన్ని రకాల కమర్షియల్ హంగులతో రూపొందుతున్న ఆ సినిమా.. రిలీజ్ కు రెడీ అవుతోంది. మరోవైపు, జురాసిక్ వరల్డ్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఏడో భాగం రాబోతోంది. జురాసిక్ వరల్డ్ డొమినియన్ సీక్వెల్ గా రూపొందుతున్న జురాసిక్ వరల్డ్ రీ బర్త్ రిలీజ్ కానుంది. కొత్త యుగం పుట్టిందని ఇటీవల అనౌన్స్ చేసిన మేకర్స్.. ఫ్రాంచైజీలో ఏడో పార్ట్ స్పెషల్ గా ఉండనున్నట్లు తెలుస్తోంది. గరేత్ ఎడ్వర్డ్స్ దర్శకత్వం వహిస్తున్న సినిమాలో స్కార్లెట్ జాన్సన్, జోనాథన్ బెయిలీ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. మరి మూడు చిత్రాలు ఎలాంటి రిజల్ట్ అందుకుంటాయో వేచి చూడాలి.

# నా ఛాలెంజ్ ను యాక్సెప్ట్ చేస్తేనే కామెంట్స్ చేయండి





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గత కొన్నాళ్లుగా సినిమాల కంటే సోషల్ మీడియా పోస్టుల ద్వారానే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో తన శరీరాకృతి గురించి కామెంట్స్ చేసే వారికి సమంత గట్టి కౌంటర్ ఇచ్చారు. తనను విమర్శిస్తున్న వారికి ఫిట్‌నెస్ విషయంలో ఛాలెంజ్ చేస్తూ తాను జిమ్ లో చేస్తున్న పుల్ అప్స్ వీడియోను షేర్ చేశారు. రీసెంట్ గా సమంత ఓ అవార్డ్ ఫంక్షన్ లో పాల్గొనగా, ఆ ఈవెంట్ నుంచి పలు ఫోటోలు బయటకు రాగా, అందులో సమంత లుక్స్ చూసి చాలా మంది నెటిజన్లు సన్నగా అయిపోయావు, అనారోగ్యంగా కనిపిస్తున్నావంటూ కామెంట్స్ చేశారు. దీనిపై రెస్పాండ్ అవుతూ సమంత తన ఇన్‌స్టాలో ఓ స్టోరీని పెడుతూ తనను కామెంట్స్ చేసేవారికి సవాల్ విసిరారు. ఆ వీడియోలో సమంత ఎలాగైతే పుల్ అప్స్ చేశారో, తన గురించి నెగిటివ్ కామెంట్స్ చేసే వారు కూడా కనీసం మూడు పుల్ అప్స్ తీసి చూపించాలని, అలా చేసిన వాళ్లే తన గురించి కామెంట్స్ చేయాలని, లేని పక్షంలో తన గురించి మాట్లాడటం మానేయమని ఆ పోస్ట్ లో పేర్కొన్నారు సమంత. కాగా సమంత చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది. గత కొంతకాలంగా మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్న సమంత, ఆ ట్రీట్‌మెంట్ లో భాగంగా తన ఒరిజినల్ లుక్ ను కాస్త కోల్పోయిన మాట నిజమే అయినప్పటికీ, నెటిజన్లు ఇష్టమొచ్చినట్టు కామెంట్స్ చేయడం ఏ మాత్రం కరెక్ట్ కాదు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే అమ్మడు త్వరలోనే రక్త్ బ్రహ్మాండ్ అనే సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సిరీస్ ఆగిపోయిందని గత కొన్నాళ్లుగా వార్తలొస్తుండగా, ఈ సిరీస్ కు సంబంధించిన కీలక సీన్స్ ను ఆల్రెడీ ఫినిష్ చేశామని, త్వరలోనే ఓ భారీ అవుట్‌డోర్ షెడ్యూల్ ను ప్లాన్ చేసినట్టు డైరెక్టర్లు రాజ్ అండ్ డీకే క్లారిటీ ఇచ్చారు.

# మరో థ్రిల్లర్ తో వస్తోన్న ప్రియమణి

ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు వెబ్‌సిరీస్‌లతో కెరీర్ ను ఫుల్ స్పీడులో నడుపుతున్నారు హీరోయిన్ ప్రియమణి. ది ఫ్యామిలీ మెన్, భామా కలాపం వెబ్ సిరీస్ లతో తనదైన నటనతో మెప్పించిన ప్రియమణి, రీసెంట్ గా ఆఫీసర్ ఆన్ డ్యూటీ అనే యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ లో నటించి బ్లాక్ బస్టర్ ను అందుకున్నారు. ఇప్పుడు తాజాగా ప్రిమయణి ప్రధాన పాత్రలో మరో వెబ్ సిరీస్ చేస్తోన్నారు. అదే గుడ్ వైఫ్. జులై 4 నుంచి జియో హాట్‌స్టార్ లో ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషలు సహా ఏడు భాషల్లో గుడ్ వైఫ్ రిలీజ్ అవుతోంది. ఈ సిరీస్ లో ప్రియమణితో పాటూ సంపత్ రాజ్, రేవతి, ఆరి అర్జునన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రీసెంట్ గా గుడ్ వైఫ్ సిరీస్ కు సంబంధించిన ట్రైలర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. గుడ్ వైఫ్ లో ప్రియమణి తరుణిక అనే తల్లి పాత్రలో నటిస్తున్నారు. అప్పటివరకు ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్న ప్రియమణి సడెన్ గా కోర్టు రూమ్ లోకి లాయర్ గా మారడం



అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. గుడ్ వైఫ్ లో ప్రియమణికి భర్త పాత్రలో సంపత్ రాజ్ నటించగా, ఆయన స్కామ్ లో చిక్కుకుని అరెస్టవుతారు. భర్త అరెస్ట్ తో తరుణిక లైఫ్ ఒక్కసారిగా మారిపోతుంది. తన భర్తను కాపాడుకోవడానికి భార్య ఏం చేసింది? అసలామె లాయర్ గా ఎలా మారింది? ఈ ఒంటరి పోరాటంలో తరుణిక విజయం సాధించిందా? అసలు ఆమె భర్త అరెస్ట్ వెనుక ఇంకేదైనా కారణముందా లాంటి ప్రశ్నలు చాలా ఉన్నప్పటికీ ట్రైలర్ ఈ సిరీస్ పై ఆసక్తిని కలిగించింది. అమెరికన్ సిరీస్ ది గుడ్ వైఫ్ కు రీమేక్ గా ఈ సిరీస్ తెరకెక్కుతుండగా, నటి, డైరెక్టర్ రేవతి దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. గుడ్ వైఫ్ రీమేక్ గా తెరకెక్కుతున్నప్పటికీ ఇందులో కోర్టు సీన్స్, డ్రామా చాలా స్పెషల్ గా ఉండటంతో పాటూ ఇండియన్ నేటివిటీకి తగ్గట్టు చేసిన కొన్ని మార్పులు సిరీస్ కు ప్లస్ కానున్నాయి. ఇందులో ప్రియమణి లీడ్ రోల్ లో నటిస్తున్నప్పటికీ ఆమె అలా కనిపించకుండా, చాలా నేచురల్ గా ఒక సాధారణ కుటుంబంలోని భార్య, తన భర్త ఓ కేసులో ఇరుక్కుంటే ఏం చేస్తుందో అలానే కనిపిస్తూ చాలా సెటిల్డ్ గా నటించినట్టు అర్థమవుతుంది. జులై 4న ఈ సిరీస్ రిలీజ్ కానున్నప్పటికీ ఇంకా గుడ్ వైఫ్ కు కావాల్సినంత హైప్ రాలేదు. కానీ ట్రైలర్ రిలీజ్ తర్వాత మెల్లిగా సిరీస్ పై అందరికీ ఆసక్తి పెరుగుతుంది.

# చీరకట్టులో అందాల చి.ల.సౌ

సుశాంత్ హీరోగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందిన 'చి.ల.సౌ' సినిమాతో రుహాని శర్మ హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమాలో నటిగా తన ప్రతిభను కనబర్చింది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే గుర్తింపు లభిస్తుంది. కానీ ఈ సినిమాలో ఆమె పూర్తిగా పద్ధతైన పక్కింటి అమ్మాయిగా కనిపించినా కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అంతే కాకుండా ఇండస్ట్రీలోనూ మంచి గుర్తింపు సొంతం చేసుకుని వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుంది. సోషల్ మీడియాలో ఈమెకు ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. హీరోయిన్‌గా ఒక మోస్తరు సినిమాల్లో నటించినప్పటికీ ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 15 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉంది. రుహాని శర్మ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటో షూట్‌ను షేర్ చేస్తూ ఉంటుంది.



సాధారణంగా హీరోయిన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్కిన్ షో ఫోటో షూట్స్, బోల్డ్ లుక్ ఫోటోలు షేర్ చేస్తూ ఉంటారు. కానీ రుహానీ శర్మ మాత్రం చాలా అరుదుగా మాత్రమే స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా చీర కట్టు ఫోటోలు, నిండైన డ్రెస్‌లతో, ట్రెడీషనల్ లుక్‌లో కనిపిస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి చీర కట్టు ఫోటోలతో కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఉంటారు. తాజా చీర కట్టు ఫోటోలతో చూపు తిప్పనివ్వడం లేదు. రుహాని శర్మ మరోసారి తన అందమైన చీర కట్టు ఫోటోలతో కవ్విస్తోంది. క్యాప్షన్ దొరకడం లేదు.. ఉత్తమమైనది ఆ స్థానాన్ని గెలుచుకుంటుంది నేను వేచి చూస్తున్నాను అంటూ తన చీర కట్టు ఫోటోలను షేర్ చేసింది. చీర కట్టు ఫోటోలతో ఎప్పటికప్పుడు రుహాని శర్మ ఆకట్టుకుంటూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు చీర కట్టు ఫోటోల కారణంగా మరింతగా కవ్విస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రుహానికి దక్కాల్సిన స్థాయిలో ఆఫర్లు దక్కడం లేదు అంటూ అభిమానులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో తెలుగులో ఈమె లవ్ మీ సినిమాలో నటించింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536